సత్యమేవ జయతే

సాక్షి

'తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 17

సంచిక: 71

ఆదివారం 2-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వైరల్



మహారాణి మలాలా వేంచేస్తున్నారహో!

నోబెల్ బహుమతి గ్రహీత మలాలా యూసఫ్ జాయ్ బ్రిటిష్ టీవి సిరీస్ 'వి ఆర్ లేడీ పార్ట్స్' రెండో సీజన్‌లో గెస్ట్ రోల్‌లో కనిపించ నుంది. మలాలా కౌబాయ్ టోపీ ధరించి గుర్రపు స్వారీ చేస్తున్న ఈ షో ఫస్ట్ లుక్ వైరల్ అయింది. ఈ సిట్‌కామ్‌లో ఒక గాయకుడి కూతురు తన టీచర్‌పై గుడ్లు విసురుతుంది.

'అలా ఎందుకు చేశావు?' అని తల్లి అడుగుతుంది.

'బాలికల విద్య కోసం పోరాటానికి మలాలా ఏంచేసిందో నేనూ అదే చేశాను' అంటుంది బాలిక.

'మలాలా ఎప్పుడూ ఎవరి మీదా గుడ్లు విసరలేదు ' అంటుంది తల్లి. ఇలాంటి సరదా సన్నివేశాలెన్నో సిట్‌కామ్‌లో ఉన్నాయి. 'వి ఆర్ లేడీ పార్ట్స్'లో 'మలాలా మేడ్ మీ డూ ఇట్' అనే పాట కూడా ఉంది. ఈ పాటకు సంబంధించిన ఫాంటసీ సీక్వెన్స్‌లో మలాలా దుపట్టా, కౌబాయ్ హ్యాట్‌తో గుర్రంపై కనిపిస్తుంది. 'మలాలా మేడ్ మీ డూ ఇట్' సాంగ్‌లో అంజనా వాసన్, సారా కమీలా, జూలియట్ మెట మెడ్, లూసీ, ఒమోలు నటించారు. సెట్‌లో వీరి నటన చూసి ప్రశం సాపూర్వకంగా మాట్లాడింది మలాలా. నటిగా కొత్త పాత్ర గురించి అడిగినప్పుడు 'ఒకటి రెండు నిమిషాల క్లిప్ కోసం ఎన్ని టేకులు తీసుకున్నానో గుర్తు లేదు' నవ్వుతూ అంటుంది మలాలా.

అటెన్షన్... లుంగీ ఇన్ లండన్

దక్షిణ భారతంలో లుంగీతో కనిపించడం వింతేమీ కాదు. అయితే లండన్‌లో కనిపిస్తే మాత్రం వింతే. ఆ వింతే ఈ వీడియోను వైరల్ అయ్యేలా చేసింది. వలేరి అనే తమిళియన్ రంగు రంగుల లుంగీలు ధరించి లండన్ వీధుల్లో, షాపుల్లో 'రీల్స్' చేసి అక్కడి ప్రజల రియాక్షన్‌ను రికార్డ్ చేసింది. 'వియరింగ్ లుంగీ ఇన్ లండన్' కాప్షన్‌తో ఆమె పోస్ట్ చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి.





మేజర్‌గారి ప్రసంగం మెగా హిట్

ప్రతిష్ఠాత్మక 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డ్' అందుకోవడంతో వార్తల్లోకి వచ్చిన మేజర్ రాధికాసేన్ తన 'వైరల్ స్పీచ్' ద్వారా మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 'జెండర్–సెన్సిటివ్ పీస్‌కీపింగ్' ప్రాముఖ్యత గురించి తన ప్రసంగంలో నొక్కి చెప్పింది సేన్. 'జెండర్–సెన్సిటివ్ పీస్‌కీపింగ్ అనేది కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదు. అది అందరి బాధ్యత. మహిళల ఆరోగ్యం, విద్య, శిశుసంరక్షణ. లింగసమానత్వం, లైంగిక హింసను ఎదుర్కోవడం లాంటి అంశాలపై కమ్యూనిటీలతో మమేకమయ్యే అవకాశం లభించింది' అంటుంది సేన్. ప్రసంగం అనంతరం ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ రాధికసేన్‌ను నిజమైన నాయకురాలిగా, మోడల్‌గా అభివర్ణించారు.

మానవత్వం పరిమళించిన మంచి మనసులు



'ఎవరికి వారే యమునా తీరే' అంటుంటాం గానీ పక్కన ఉన్న వాళ్లకు కష్టం వచ్చినప్పుడు జాతి, మత, కుల, ప్రాంతీయ లెక్కలు వేసుకోకుండా సహాయపడే సహజ గుణం మనిషిలో ఇంకా మిగిలే ఉంది. తాజా విషయానికి వస్తే... కేరళలోని మలప్పురంకు చెందిన ఒక మహిళ కేఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తోంది. పెరమంగళం దాటుతుండగా ఆమెకు పురిటి నొప్పులు మొదలయ్యాయి తమ కుటుంబంలోని వ్యక్తికి ఆ పరిస్థితి వస్తే ఎలా స్పందిస్తారో బస్సు సిబ్బంది, ప్రయాణికులు అలాగే స్పందించారు. తగిన ఏర్పాట్లతో వైద్యసిబ్బంది బస్సు దగ్గరికి వాయువేగంతో వచ్చారు. బస్సులోనే ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రయాణికులు, బస్సు సిబ్బంది, వైద్యులు, స్థానిక ప్రజల మానవత్వాన్ని చాటే ఈ వీడియో వైరల్ అయింది.

బహు భాషిణి

నటిగా సుపరిచితమైన శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా లిప్‌స్టిక్‌కు సంబంధించిన ఒక అడ్వర్‌టైజ్‌మెంట్‌లో బ్రిటిష్, ఫ్రెంచ్, రష్యన్, అమెరికన్ యాక్సెంట్‌లతో మాట్లాడి 'ఔరా' అనిపించింది. శ్రద్ధా నాలుగు విభిన్న భాషలను అలవోకగా మాట్లాడుతున్న ఈ వీడియో వైరల్ అయింది. గతంలో 'కపిల్ శర్మ షో'లో తన భాషా నైపుణ్యాన్ని ప్రదర్శించి 'శభాష్' అనిపించుకుంది శ్రద్ధ.

'శ్రద్ధా కపూర్‌లో మంచి మిమిక్రీ ఆర్టిస్ట్ ఉంది' అంటున్నారు ఆమె అభిమానులు.





అమ్మా... డబ్బులు ఇలా డ్రా చేయాలి

ఈ డిజిటల్ కాలంలో ఏటీయం వినియోగం, యూపీఏ పేమెంట్స్, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌ల గురించి అవగాహన లేని పేరెంట్స్‌కు వాటి గురించి తెలియజేయడం అనివార్యం.

పాకిస్థాన్‌లోని ఒక ఏటీయం క్యాబిన్‌లో తల్లీకూతుళ్లు కనిపిస్తారు.

కార్డు ఉపయోగించి డబ్బు ఎలా డ్రా చేయాలి? అని అడుగుతుంది తల్లి.

కార్డును ఇన్‌సర్ట్ చేయడం నుంచి డబ్బు విత్‌డ్రా చేయడం వరకు తల్లికి ఓపికగా చెబుతుంది కూతురు. 'హ్యాపియెస్ట్ మూమెంట్ బీయింగ్ ఏ గర్ల్ ఫ్రమ్ ఏ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

'ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి తల్లిదండ్రులు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారికి డిజిటల్ విషయాలపై అవగాహన కలిగించడం పిల్లల తప్పనిసరి బాధ్యత' అంటూ నెటిజనులు స్పందించారు.




శాల్యూట్ ది టాలెంట్

మీనాక్షి అమ్మవారి రియలిస్టిక్ పోర్ట్రయిట్‌తో 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సాధించింది మధురైకి చెందిన మోనిష కె. చార్‌కోల్, వాటర్ కలర్స్, కలర్ పెన్సిల్స్.. మొదలైన వాటితో అమ్మవారి పోర్ట్రయిట్‌ను చిత్రించింది. 'శాల్యూట్ ది టాలెంట్' కాప్షన్‌తో 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పోస్ట్ చేసిన మోనిష డ్రాయింగ్ వీడియో వైరల్‌గా మారింది.

కోవిడ్ కల్లోల కాలంలో ఆర్ట్‌పై ఆసక్తి పెంచుకున్న మోనిష క్రమక్రమంగా బొమ్మలు వేయడంలో పట్టుసాధించింది. ఇంటర్‌నెట్‌లో ఆమె బొమ్మలు పాపులర్ కావడమే కాదు ఆర్డర్లు కూడా రావడం మొదలైంది. ఆర్ట్‌కు సంబంధించి వివిధ మాధ్యమాల్లో ప్రయోగాలు చేస్తూ ఆర్టిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకోవాలనేది మోనిష లక్ష్యం.

హెల్త్



జీర్ణవ్యవస్థను పీడించే ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్

వ్యాధి నిరోధక వ్యవస్థ బలహీన పడ్డప్పుడు జీర్ణ వ్యవస్థ ప్రధానంగా ఎదుర్కొనే సమస్యల్లో ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ ఒకటి. ఇది రెండు రకాలు. ఒకటి అల్సరేటివ్ కొలైటిస్, రెండోది క్రోన్స్ డిసీజ్.

జీర్ణవ్యవస్థలో వచ్చే ఈ సమస్యలోని 'అల్సరేటివ్ కొలైటిస్'లో పెద్దపేగు లోపలి లైనింగ్‌లో ఇన్‌ఫ్లమేషన్ వస్తుంది. అప్పుడు అక్కడ పుండ్లు పడటం, కొన్నిసార్లు ఆ పుండ్ల నుంచి రక్తస్రావం కావచ్చు. ఆ భాగం మినహాయించి మిగతా జీర్ణ వ్యవస్థలో మరెక్కడైనా ఇన్‌ఫ్లమేషన్ రావడాన్ని 'క్రోన్స్ డిసీజ్' అంటారు. అంటే నోరు మొదలు కొని, చిన్నపేగుల వరకు ఎక్కడైనా ఇన్‌ఫ్లమేషన్ రావడం వల్ల ఒక్కోసారి ఆ భాగం సన్నగా మారడం లేదా పుండ్లు పడటం జరగవచ్చు.

కారణాలు: ఈ సమస్యలకు కారణాలు నిర్దిష్టంగా తెలియదు గానీ వ్యాధినిరోధక వ్యవస్థ బలహీనం కావడం వల్ల ఈ సమస్య వస్తుందని నిపుణులు భావిస్తున్నారు. జన్యుపరమైన అంశాలతోనూ, పర్యావరణ కారణాలతోనూ రావచ్చు. పొగతాగడం క్రోన్స్ డిసీజ్‌కు దారితీయవచ్చని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది.

అల్సరేటివ్ కొలైటిస్ లక్షణాలు: ● నీళ్లవిరేచనాలు ● కడుపునొప్పి ● జ్వరం ● బరువు తగ్గడం ● తరచూ మలద్వారం నుంచి రక్తం, బంక (మ్యూకస్) పడుతుండటం ● కొన్నిసార్లు మలబద్ధకం ● ఇవిగాక... కీళ్ల నొప్పులు, కీళ్ల వాపు వంటి లక్షణాలు కూడా ఉంటే వ్యాధి తీవ్రంగా ఉందని భావించాలి.

క్రోన్స్ డిసీజ్ లక్షణాలు: ● నీళ్ల విరేచనాలు ● కడుపునొప్పి ● తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ ● బరువు తగ్గడం ● నోటి పొక్కులు ● చర్మసమస్యలు ● కళ్లు ఎర్రబారడం, మండడం ● కొందరిలో మలద్వార సమస్యలైన ఫిస్టులా, మలద్వారం చీరుకుపోవడం, కుచించుకుపోవడం.

నిర్ధారణ పరీక్షలు: ● కొలనోస్కోపీ ● గ్యాస్ట్రో ఇంటస్టినల్ ఎండోస్కోపీ ● రక్తపరీక్షలు, అవసరాన్ని బట్టి సీటీ స్కాన్, ఎమ్మారైలతోపాటు కొన్ని సందర్భాల్లో పెద్ద పేగు బయాప్సీ.

చికిత్స: అల్సరేటివ్ కొలైటిస్‌కు... కొన్ని మందులతో లక్షణాలు తగ్గించడంతోపాటు అవి మళ్లీ రాకుండా చూస్తారు. ఉదాహరణకు నొప్పి తగ్గడానికి వాడే నాన్ స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వంటి వాటి వాడకం

● మందులు వాడినప్పటికీ లక్షణాలు తగ్గని కండిషన్‌ను రిఫ్రాక్టరీ అల్సరేటివ్ కొలైటిస్ అంటారు. వ్యాధినిరోధక వ్యవస్థ అతిగా స్పందించడం వల్ల ఇలా జరుగుతుందని గుర్తించినప్పుడు రోగ నిరోధక వ్యవస్థ తాత్కాలికంగా మందగించేందుకు 6–మెర్కాప్టోప్యూరిన్, అజాథియోప్రిన్ వంటి మందులూ, అప్పటికీ గుణం కనిపించకపోతే సైక్లోస్పోరిన్ వంటి మందులు వాడాలని సూచిస్తారు

● **శస్త్రచికిత్స:** సమస్య ఎంతకీ తగ్గకపోతే అప్పుడు శస్త్రచికిత్స చేసి ప్రభావితమైన మేరకు పెద్దపేగు భాగాన్ని తొలగిస్తారు. అవసరమైతే దేహంలో మరెక్కడైనా (సాధారణంగా నడుము దగ్గర) మలద్వారం



● అల్సరేటివ్ కొలిటిస్ ● క్రోన్స్ డిసీజ్

ఏర్పాటు చేసి, చిన్నపేగు చివరి భాగం అక్కడ తెరుచుకునేలా చూస్తారు.

క్రోన్స్ డిసీజ్‌కు... ఇందులో జీర్ణవ్యవస్థలోని ఏ భాగమైనా ప్రభావితం అయ్యే అవకాశం ఉంది కాబట్టి... నిర్దిష్టంగా ఏ భాగం ప్రభావితమైందన్న అంశాన్ని బట్టి చికిత్స అందిస్తారు.

ఈ వ్యాధికి చేసే చికిత్సల్లో కొన్ని...

● జీర్ణవ్యవస్థలోని వాపును తగ్గించడానికి 5-అమైనోశాల్సిలేట్స్ (5–ఏఎస్ఏ) అనే మందులూ, వాటితో ఫలితం కనిపించకపోతే అవసరాన్ని బట్టి యాంటీబయాటిక్స్ ఇస్తారు ● వీటితో గుణం కనిపించకపోతే అవసరాన్ని బట్టి పరిమిత కాలం పాటు ప్రెడ్నిసోన్, బ్యూడిసోనైడ్ వంటి స్టెరాయిడ్స్‌ను వైద్యులు సూచించవచ్చు ● లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ఇమ్యునో మాడ్యులేటర్స్ లేదా బయలాజిక్ రెస్పాన్స్ మాడిఫైయర్స్ అనే మందులను సూచిస్తారు.

ఆహారంతో అదుపు ఇలా...

● పాలు, పాల ఉత్పాదనలైన జున్ను, వెన్న, పెరుగు పుడ్డింగ్స్ ● చాక్లెట్లు, పేస్ట్రీలు, కేకులు ● పల్లీలు ● కృత్రిమరంగులు వాడిన ఆహారాలు ● పుల్లటి పండ్లు, పండ్ల రసాలు ● మసాలాలు ● వేపుళ్లు, ఫాస్ట్‌ఫుడ్, చైనీస్ ఫుడ్స్ ● కెచప్ ● క్యాబేజీ, బ్రాకలీ, క్యాలీఫ్లవర్ ● బీన్స్, కందులు ● వేటమాంసం ● ఆల్కహాల్ కు పూర్తిగా దూరంగా ఉండాలి.

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబీడీ)తో పాటు ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్) అనే మరో సమస్యా ఉంది. తినగానే విరేచనానికి వెళ్లడం, కొందరిలో మలబద్ధకంతో బాధించే ఈ ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)లో తినగానే వెంటనే మలవిసర్జనకు వెళ్లాల్సిరావడమనే ఇబ్బంది తప్ప పెద్దగా సమస్యలు బాధించకపోవచ్చు. ఐబీఎస్ (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్), ఐబీడీ (ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్) రెండూ వేర్వేరనీ, అందులో ఐబీడీ తీవ్రమైనదని గుర్తించాలి. (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్) వివరాలు పక్కనే...)



డా॥ కావ్య దెందుకూరి
కన్సల్టెంట్ హెపటాలజిస్ట్ & గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ అంటే?

జీర్ణాశయాన్ని బాధించే సమస్యలలో ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబీడీ), 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్' అనే రెండూ ప్రధానమైనవి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్‌లో తిన్న వెంటనే మలవిసర్జనకు వెళ్లాల్సి రావడమనే ఇబ్బంది తప్ప 'ఐబీడీ'లాగా పెద్దగా ఇబ్బంది పెట్టే అంశాలేమీ ఉండవు. 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్' అంటే ఏమిటి, దాని లక్షణాలూ, దానిని అదుపులో ఉంచుకోవడం ఎలాగో తెలిపే కథనమిది.

తినీ తినగానే వెంటనే టాయ్‌లెట్‌కు పరుగెత్తాలనిపించడం లేదా బయట ఎక్కడైనా తినాల్సి వస్తే అలా తినడానికి ముందే మరుగుదొడ్డి ఎక్కడుందో వెతుక్కోవాల్సి రావడం 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్' (ఐబీఎస్)లో ప్రధాన సమస్య. అందుకే ఈ సమస్య ఉన్న వారు బయట లంచ్ చేయడానికీ, ఎవరి ఇంటికైనా అతిథిగా హాజరయ్యేందుకూ, విహార యాత్రలకు వెళ్లడానికీ వెనకాడుతుంటారు. అయితే మరికొందరిది దీనికి పూర్తిగా భిన్నమైన పరిస్థితి. వాళ్లను మలబద్ధకం వేధిస్తుంటుంది.

ఈ అంశం ఆధారంగా 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్'లో నాలుగు రకాలుంటాయి.

ఐబీఎస్ రకాలు: ● **ఐబీఎస్ – డయేరియా (ఐబీఎస్–డీ):** నీళ్లవిరేచనాలతో కడుపులో ఇబ్బంది.

● **ఐబీఎస్ – కాన్‌స్టిపేషన్ (ఐబీఎస్–సీ):** మలబద్ధకంతో పాటు కడుపులో ఇబ్బంది.

● **ఐబీఎస్ – మిక్స్‌డ్ (ఐబీఎస్ – ఎమ్):** కొన్నిసార్లు నీళ్లవిరేచనాలూ, మరికొన్నిసార్లు మలబద్ధకం... ఈ రెండు ఇబ్బందులూ మార్చి మార్చి వస్తుండడం.

● **ఐబీఎస్ – అన్–ఐడెంటిఫైడ్ (ఐబీఎస్–యూ):** లక్షణాలు స్థిరంగా ఉండక మారుతుంటాయి.

కారణాలు: నిర్దిష్టమైన కారణాలు లేవు. అయితే, జీర్ణాశయానికీ, మెదడుకు మధ్య ఏర్పడే కమ్యూనికేషన్ లోపాలే ఈ సమస్యకు ముఖ్య కారణాలుగా భావిస్తుంటారు. దాంతోపాటు పేగుల కదలికలలో లోపాలు, జీర్ణాశయపు నరాల్లో అతి చురుకుదనం, జీర్ణాశయం (గట్) బ్యాక్టీరియాలో మార్పుల వల్ల వచ్చే తేడాలు, కొందరిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ల తర్వాత, మరికొందరిలో కొన్ని రకాల ఆహారాలు సరిపడకపోవడం, బాల్యంలో తీవ్రమైన ఒత్తిడులు ఎదుర్కోవడం వంటివి.

లక్షణాలు: ● విరేచనానికి వెళ్లగానే కడుపులోని ఇబ్బంది తొలగిపోవడం ● మలవిసర్జనలో విరేచనం అయ్యాక కూడా ఇంకా ఏదో మిగిలి ఉన్న ఫీలింగ్ ● కడుపులో గ్యాస్, కడుపు ఉబ్బరం ● మలంలో బంక.

నిర్ధారణ: లక్షణాలను బట్టి నిర్ధారణ చేస్తారు. కొన్ని సందర్భాల్లో కొన్ని రక్తపరీక్షలు, మల పరీక్షతో పాటు జీర్ణాశయంలో బ్యాక్టీరియా పెరుగుతోందేమో తెలుసుకోవడం కోసం 'హైడ్రోజన్ బ్రెత్ టెస్ట్' అనే పరీక్ష.

చికిత్స: ● పీచు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలతో పాటు 'లో-ఫోడ్‌మ్యాప్' ఆహారం.

లో-ఫోడ్‌మ్యాప్ ఆహారం అంటే... 'ఫర్మెంటబుల్ ఆలిగోశాకరైడ్స్, డై శాకరైడ్స్, మోనో శాకరైడ్స్ అండ్ పాలీయాల్స్'అనే రకాల ఆహార పదార్థాల మొదటి అక్షరాలను (ఇంగ్లిష్‌లోని) చేర్చడం ద్వారా 'ఫోడ్‌మ్యాప్' అనే మాటను రూపొందించారు. ఆహారాల్లోని పోషకాల నిర్మాణాన్ని బట్టి, వాటిలోని చక్కెరలను బట్టి ఆ ఆహారాలను అలా పిలుస్తుంటారు. ఆ ఫోడ్‌మ్యాప్ డైట్ చార్ట్ ప్రకారం...

తీసుకోవాల్సిన ఆహారాలు...

అన్నం, ఓట్స్, గ్లూటెన్ ఫ్రీ బ్రెడ్; అరటి, నేరేడు, ద్రాక్ష, కివీ, నిమ్మ, బత్తాయి, నారింజ, బొప్పాయి, పైనాపిల్, స్ట్రాబెర్రీ; క్యారట్, దోస, అల్లం, మిరియాలు, లెట్యూస్, ఆలూ, పాలకూర, టొమాటో వంటివి. ప్రొటీన్లలో చికెన్, ఫిష్, టోఫూ, నట్స్‌లో పల్లీలు, వాల్‌నట్స్.

తీసుకోకూడనివి ...

పాస్తా, కేక్స్, బిస్కెట్లు, పండ్లలో పియర్స్, ప్రూన్, పీచెస్, చెర్రీస్ వంటివి. ఆకుకూరలలో బ్రాకలీ, కాలీఫ్లవర్, ఉల్లి, వెల్లుల్లి, బీట్‌రూట్, పప్పులలో బీన్స్, సోయాబీన్స్ మొదలైనవి.

పాటించాల్సినవి... ● నీళ్లు ఎక్కువగా తాగడం, క్రమబద్ధమైన వ్యాయామం, కంటినిండా నిద్ర ● లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉంటే... మలబద్ధకం ఉన్నవారికి లాక్సెటివ్స్ అనే విరేచనకారి మందులూ, నీళ్లవిరేచనాలు అయ్యేవారికి యాంటీ డయేరియల్ మందులు, అవసరాన్ని బట్టి కొందరికి యాంటీ డిప్రెసెంట్స్, ఇంటెస్టినల్ స్పాజమ్స్, క్రాంప్స్ తగ్గించే మందులూ వాడాల్సి రావచ్చు.

మెడి టిప్

గ్యాస్ సమస్య తగ్గించుకోవడం ఇలా...

కడుపులో గ్యాస్‌తో పొట్ట ఉబ్బరంగా ఉంటే అది బయటకు వెళ్లేవరకు ఓ సమస్యే. ఈ గ్యాస్ సమస్య తగ్గాలంటే పాటించాల్సిన సూచనలివి...

- తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినాలి. అది కూడా బాగా నమలి తినడం.
- గాలి నోట్లోంచి కడుపులోకి చేరకుండా జాగ్రత్తగా ఆహారాన్ని నమలడం.
- కొవ్వు ఎక్కువగా ఉండేవీ, డీప్ ఫ్రైలు, వేపుళ్లు వీలైనంత తక్కువగా తీసుకోవడం.
- కాఫీ, టీ పరిమితంగా తీసుకోవడం.
- సోడాలు, కార్బొనేటెడ్ అండ్ కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండటం.



- సరిపడనివారు పాలూ, పాల ఉత్పాదనలకు దూరంగా ఉండటం.
- పొగ, ఆల్కహాల్ అలవాట్లు పూర్తిగా మానేయడం.
- రోజూ కనీసం రెండు లీటర్ల కంటే ఎక్కువగా మంచినీళ్లు తాగాలి.
- బరువు పెరగకుండా ఉండేందుకు రోజూ వ్యాయామం చేయడం.


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 71

SUNDAY Special | ఆదివారం 2-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి టి20 ప్రపంచ కప్

ఐసీసీ టి20 ప్రపంచకప్ వేడుకకు రంగం సిద్ధమైంది. నేటినుంచి వెస్టిండీస్, అమెరికా సంయుక్త వేదికలుగా టోర్నమెంట్ జరుగుతుంది. జూన్ 29న ఫైనల్ నిర్వహిస్తారు. తొలి సారి 20 జట్లు ఈ టోర్నీలో బరిలోకి దిగుతున్నాయి. జట్లను 4 గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో టాప్–2లో నిలిచిన జట్లు తర్వాతి దశ సూపర్ ఎయిట్‌లో తలపడతాయి. భారత్ తమ తొలి మ్యాచ్‌లో బుధవారం ఐర్లాండ్‌ను ఎదుర్కోనుండగా.. వచ్చే ఆదివారం భారత్, పాక్ మధ్య పోరు జరుగుతుంది.

టి20 ప్రపంచకప్ ప్రత్యేక కథనాలు, విశేషాలు నేటి 'ఫన్ డే' సంచికలో...



ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

కన్యాకుమారిలో వివేకానంద రాక్ మెమోరియల్‌లోని గురువారం మొదలైన మోదీ ధ్యానం శనివారం మధ్యాహ్నం ముగిసింది.

- వివరాలు 6లో



ఏడో విడతలో 62 శాతం పోలింగ్

లోక్‌సభ ఎన్నికల్లో చివరిదైన ఏడో దశ పోలింగ్ పూర్తయింది. రాత్రి 11.50కు అందిన సమాచారం మేరకు 62% పోలింగ్ నమోదైంది.

- వివరాలు 6లో



'ఇండియా'కు 295 సీట్లకు పైనే..

ఖర్గే నివాసంలో ఇండియా కూటమి అగ్ర నేతలు భేటీ అయ్యారు. కూటమికి 295కు పైగా స్థానాలు లభిస్తాయని ఖర్గే చెప్పారు.

- వివరాలు 6లో



నేడే అరుణాచల్, సిక్కిం ఫలితాలు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు 2 రోజుల ముందే అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

దశాబ్ది ఉత్సవాలకు సిద్ధం!



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ వేడుకలకు సంబంధించిన షెడ్యూల్, ఇతర వివరాలను సమాచారశాఖ కమిషనర్ హనుమంతరావు చెప్పారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. - 2లో

ఎల్లుండే 'లోక్‌సభ' కౌంటింగ్



రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం 10వేల మంది సిబ్బందిని ఎంపిక చేసినట్టు సీఈవో వికాస్ రాజ్ చెప్పారు. లోక్‌సభతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడారు. - 3లో

ఎన్డీఏ హ్యాట్రిక్!



లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్ అంచనా

- ఎన్డీఏకు 350 నుంచి 400 వరకు సీట్లు
- ఇండియా కూటమికి 200లోపే
- బీజేపీకి మళ్లీ సొంతగానే మెజారిటీ
- కాంగ్రెస్ 40 నుంచి 70 సీట్లకు పరిమితం
- గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటకల్లో బీజేపీ క్లీన్‌స్వీప్.. మహారాష్ట్ర, బిహార్, రాజస్తాన్, హరియాణాల్లో కోత

6లో

ఎన్డీఏ హ్యాట్రిక్ ఖాయమని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. భారీ మెజారిటీతో కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకుంటుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. బీజేపీ యూపీలో స్థానాలను పెంచుకోవడంతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్‌ల్లో క్లీన్‌స్వీప్ చేస్తుందని కర్ణాటకలో హవా కొనసాగించడమే గాక బెంగాల్లో చొచ్చుకుపోతుందని చెప్పాయి. కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి 150 మార్కు దాటొచ్చని తెలిపాయి.

లోక్‌సభలో మొత్తం స్థానాలు 543 | మెజారిటీ మార్కు 272

సర్వే సంస్థ	ఎన్డీఏ	ఇండియా	ఇతరులు
టైమ్స్ నౌ-ఈటీజీ	358	152	33
ఇండియాటుడే-మై యాక్సిస్	361-401	131-166	8-20
ఏబీపీ న్యూస్-సీ వోటర్	353-383	152-182	4-12
రిపబ్లిక్ భారత్-మ్యాట్రిజ్	353-368	118-133	43-48
జన్ కీ బాత్	362-392	141-161	10-20
ఇండియాటీవీ-సీఎన్‌ఎక్స్	371-401	109-139	28-38
న్యూస్ నేషన్	342-378	153-169	21-23
ఇండియా న్యూస్	371	125	47
దైనిక్ భాస్కర్	281-350	145-201	33-49
రిపబ్లిక్ టీవీ-పీ మార్క్	359	154	30
టుడేస్ చాణక్య	385-415	96-118	27-45
టీవీ9 భారత్ వర్ష్	342	166	35
న్యూస్ 18	355-370	125-140	42-52
పోల్ ఆఫ్ పోల్స్	365	146	32

రాష్ట్రంలో పోటాపోటీ!

- కాంగ్రెస్, బీజేపీలకు అటూ ఇటుగా సమానంగా సీట్లిచ్చిన పలు సంస్థలు
- కొన్ని ఎగ్జిట్‌పోల్స్ బీజేపీ వైపు మొగ్గు
- కాంగ్రెస్ పట్టు నిలుపుకుంటుందని చెప్పిన మరికొన్ని సంస్థలు
- తెలంగాణ లోక్‌సభ ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ ఉత్కంఠ - 5లో

వైఎస్సార్‌సీపీదే ఏపీ..

- 94–104 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తుందని తేల్చి చెప్పిన 'ఆరా' మస్తాన్.. 50% ఓట్లతో 110–120 స్థానాల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని చాణక్య పార్థదాస్ వెల్లడి
- వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఫలితాలు ప్రకటించవద్దని స్థానిక సెఫాలజిస్టులపై టీడీపీ ఒత్తిళ్లు - 5లో



శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - 2లో

అవతరణ అంటే కేసీఆర్‌కు అగౌరవం

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

- అవతరణ ఉత్సవాల్లో పాల్గొనని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతాడు?
- కేసీఆర్‌కు తెలంగాణ సెంటిమెంట్ లేదు.. ఉన్నదంతా వ్యాపారమే
- త్వరలో పీసీసీకి కొత్త అధ్యక్షుడి నియామకం ఉంటుందని వెల్లడి - 2లో

ఉద్యమాన్ని అవమానిస్తూ ఉత్సవాలా?

- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ లేఖ
- దయతో తెలంగాణ ఇచ్చామనే అహంభావ ధోరణి చూపుతున్నారు.. ఉద్యమాన్ని, అమరుల త్యాగాలను అవమానిస్తున్నారు
- అలాంటి మీరు చేసే ఉత్సవాలకు సార్థకత ఏముంటుంది?

3లో



క్లుప్తంగా...

నేడు గాంధీభవన్‌లో ఆవిర్భావ దినోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం గాంధీభవన్‌లో ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొంటారని వెల్లడించారు.

దశాబ్ది ఉత్సవాల శకటం ప్రారంభం

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల శకటాన్ని శనివారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మెట్టుసాయి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై వైరుధ్యాలు వద్దు

టీపీసీసీ నేత దయాకర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అందరూ కలిసి నిర్వహించుకునే కార్యక్రమమని, దీనికి వైరుధ్యాలు, వ్యతిరేకతలు వద్దని టీపీసీసీ నేత అద్దంకి దయాకర్ హితవు పలికారు. చాలా మంది ఉద్యమకారులకు ఆహ్వానం అందలేదనే ప్రచారం జరుగుతోందని, ఆహ్వానం విషయంలో ఏదైనా సమస్యలుంటే ప్రొఫెసర్ కోదండరాం, యెన్నం శ్రీనివాసరెడ్డి, తన దృష్టికి తీసుకొస్తే సహకరిస్తామని శనివారం ఒక ప్రకటనలో సూచించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. అవతరణ దినోత్సవాలకు మాజీ సీఎం కేసీఆర్ తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సోనియా రానట్టే!

అనారోగ్యమే కారణమంటున్న గాంధీభవన్ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది వేడుకలకు ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ రావడం లేదని గాంధీభవన్ వర్గాల సమాచారం. ఆమె హైదరాబాద్ పర్యటన షెడ్యూల్ శనివారం రాత్రి వరకు ఖరారు కాలేదని తెలిసింది. అనారోగ్యంతో పాటు ఎండలను దృష్టిలో ఉంచుకుని ఆమె రావడం లేదనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. రాష్ట్ర ప్రజల నుద్దేశించి సోనియా పంపే వీడియో సందేశాన్ని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో వినిపిస్తారని తెలుస్తోంది. కాగా, సోనియా గాంధీ అనారోగ్య కారణాలతో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు రాలేకపోతున్నారని వి.హనుమంతరావు తెలిపారు.


2024 జూన్ 2నే నిజమైన తెలంగాణ వచ్చింది



సాక్షి, హైదరాబాద్: నిజమైన తెలంగాణ 2024 జూన్ 2నే వచ్చిందని, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు సంతోషించే రోజని టీపీసీసీ నేత గజ్జెల కాంతం పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం అంటే తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిన రోజని స్పష్టం చేశా రు. 1969 – 2014 వరకు తెలంగాణ ప్రజలు ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం 2014–23 వరకు కేసీఆర్ దొర కబంధ హస్తాల్లో బందీ అయిందని విమర్శించారు.

నేడు రాష్ట్రమంతా ఆవిర్భావ ఉత్సవాలు: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా...రాష్ట్రంలో అన్ని జిల్లా, మండల కేంద్రాలతోపాటు అన్ని ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. నాంపల్లి బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె. లక్ష్మణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ, రాష్ట్ర, నగర నాయకులు పాల్గొంటార ని రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా...ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన, ఆత్మ బలిదానాలు చేసుకున్న కుటుంబాలను కలవడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.



ఇదేదో బాగానే ఉంది! ఓడిపోతే విదేశీ కుట్రవల్లేనని అనొచ్చు!

అవతరణ అంటే కేసీఆర్‌కు అగౌరవం

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

అవతరణ ఉత్సవాల్లో పాల్గొనని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతాడు?

కేసీఆర్‌కు తెలంగాణ సెంటిమెంట్ లేదు.. ఉన్నదంతా వ్యాపారమే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దినోత్సవమంటే ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు గౌరవం లేదని.. ఈ ఉత్సవాల్లో పాలుపంచుకోని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. దేశ విభజన తర్వాత కావాలని ఓ రోజు ముందే ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనే పాకిస్తాన్ తరహాలో.. కేసీఆర్ సైతం ఒక రోజు ముందు తెలంగాణ అవతరణ దినోత్సవం జరుపుకొన్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు తెలంగాణ సెంటిమెంట్ ఏమీ లేదని, ఉన్నదంతా వ్యాపారమేనని విమర్శించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రేవంత్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"అమర వీరుల స్తూపం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటుతో మాకు సంబంధం లేదు. ఎన్నికల కోడ్ కాబట్టి అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లడానికి ఈసీ అనుమతి అవసరం. మేం ఈసీ నుంచి అనుమతి తీసుకున్నాకే ఆవిర్భావ వేడుకలకు సోనియా గాం . దీని ఆహ్వానించాం. ఆరోగ్య సమస్యల రీత్యా ఆమెకు సుదీర్ఘ ప్రయాణాలు ఇబ్బందికరం. ఆమె రావాలని ఆశిస్తున్నాం.

అమరులంటే కేసీఆర్‌కు ద్వేషమెందుకు?

రాష్ట్ర అధికార చిహ్నంలో అమర వీరుల స్తూపం పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న కేసీఆర్, కేటీఆర్‌లకు.. అమరవీరులు, వారి కుటుంబాలు, అమరవీరుల స్తూపం అంటే ఎందుకు ద్వేషం? రూ.వెయ్యి కోట్లతో హుస్సేన్ సాగర్‌లో బుద్ధ విగ్రహం పక్కనే అమర వీరుల స్థూపం కట్టాలని 2014లో జరిగిన మహానాడులో నేను డిమాండ్ చేశాను కూడా. రాష్ట్ర గీతం, చిహ్నంపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించలేదన్న బీఆర్‌ఎస్ ఆరోపణలు సరికాదు. ఆహ్వానించేందుకు అపాయింట్‌మెంట్ కోరాం. కానీ వాళ్లు రోడ్డెక్కి తాము చెప్పేది చెప్పేశారు. ఆవిర్భావ వేడుకలకు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డిలను కూడా ఆహ్వానించాం. తెలంగాణ అమరవీరులను గుర్తించడానికి కమిటీ వేశాం. గ్రామసభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ, ఎఫ్ఐఆర్‌ల సేకరణ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశాం.

గేయంలో మార్పులపై అందెశ్రీనే అడగండి

రాష్ట్ర గీతం రూపకల్పన బాధ్యతను పూర్తిగా రచయిత అందెశ్రీకి అప్పగించాం. అందులో పదాల మార్పు, సంగీత దర్శకుడిగా కీరవాణిని ఎంపిక చేసే నిర్ణయం కూడా అందెశ్రీదే. ఈ విషయంలో కేసీఆర్, కేటీఆర్‌లాగా మేం కాంట్రాక్టులు ఇవ్వలేదు. ఔట్ సోర్సింగ్ చేసి కమీషన్లు పొందలేదు. అధికారిక చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగింపుపై ఎలాంటి నిర్ణయం జరగలేదు. సమ్మక్క, సారక్క, జంపన్నలను చంపినవారిగానే కాకతీయులను చూస్తాను. రెడ్డి, కమ్మ, వెలమ రాజులుగా చూడను.

బీఆర్‌ఎస్‌లా రాజకీయం చేయలేదు

రాష్ట్రంలో కరెంట్ కోతల్లేవు. సాంకేతిక అంతరాయాలు కూడా బాగా తగ్గాయి. రాష్ట్రంలోని ఏ సబ్‌స్టేషన్‌కైనా వెళ్లి లాగ్‌బుక్స్‌ను తనిఖీ చేయడానికి సిద్ధం. బీఆర్‌ఎస్ పాలనలో సైతం అంతరాయాలు ఉండేవి. కానీ ఇప్పుడు బీఆర్‌ఎస్ చేస్తున్నట్టుగా అప్పుడు మేం రాజకీయం చేయలేదు. హైదరాబాద్‌ను పదేళ్ల ఉమ్మడి రాజధాని చేస్తే మూడేళ్లకే ఏపీవారు వెళ్లిపోయారు. ఇప్పుడు గడువు పొడిగించాలని కోరడంలో అర్థం లేదు.

పేద రైతులకే రైతు భరోసా!

వానాకాలం పంటలకు రైతు భరోసా అమలుపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. లక్ష ఎకరాల వ్యవసాయేతర భూములకూ గతంలో రైతుబంధు ఇచ్చారు. 'నేను అడ్డగోలుగా చేశా.. మీరూ చేయాలి' అని కేసీఆర్ అంటున్నారు. సంపన్నులు, లేఅవుట్లకు కాకుండా అర్హులైన రైతులకే ఇస్తాం. పేదలకు సాయం చేయడమే ప్రభుత్వ పథకాల లక్ష్యం. ప్రభుత్వ పథకాలకు అర్హత తెల్ల రేషన్ కార్డు, పేదరికమే. ఆర్టీసీ బస్సు చార్జీలు చెల్లించే స్తోమత గల మహిళలు స్వచ్ఛందంగా ఉచిత ప్రయాణాలను విరమించుకోవాలని అప్పీల్ చేస్తాం.

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం

సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. కొత్త విగ్రహం రూపకల్పన బాధ్యతను ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించాం. ఉద్యమ సమయంలో తెలంగాణ యువత గుండెలపై 'టీజీ' అనే అక్షరాలను పచ్చబొట్టు పొడిపించుకున్నారు. అందుకే 'టీఎస్'కి బదులు 'టీజీ'గా మార్చాం.



గన్‌పార్క్‌లోని అమరుల స్తూపానికి పూల అలంకరణ



ఓ బ్రాండ్ విత్తనాలే అడుగుతుండటంతో సమస్య

ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే పత్తి విత్తనాల కొరత ఉంది. మహారాష్ట్ర రైతులు ఆ జిల్లాకు విత్తనాల కోసం రావడంతోనే సమస్య వస్తోంది. గతేడాది కంటే ఈసారి 10 శాతం అధికంగా విత్తనాలను సమీకరించి పెట్టాం. ఓ బ్రాండ్ విత్తనాలనే రైతులు కోరుతుండటంతో సమస్య వచ్చింది.

టీచర్లందరినీ ఒకే గాటన కట్టొద్దు..

ప్రభుత్వ టీచర్లు విధులు ఎగ్గొట్టి రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణలు సరికాదు. అందరినీ ఒకే గాటనకట్టొద్దు. వైద్యశాఖలో నియమితులైన ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఒక నెల జాప్యం జరిగింది. గత ప్రభుత్వంలో కూడా ఇలా జాప్యం జరిగిన సందర్భాలున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్లపై ఆరోపణలు రుజువు కాకముందే వారికి చట్టబద్ధంగా అందాల్సిన హక్కులను ఆపలేం. ఇంజనీర్ల సంఘాలను ఆందోళన కాదు.. ఆమరణ దీక్ష చేసుకొమ్మనండి.. చూద్దాం..

త్వరలోనే కొత్తవారికి పీసీసీ పగ్గాలు

జూన్ 27తో పీసీసీ అధ్యక్షుడిగా నా పదవీ కాలం ముగుస్తుంది. నేను సీఎం అవడంతో.. ఇతరులకు పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం వస్తుంది. దీనిపై ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుంది. 9 నుంచి 12 లోక్‌సభ సీట్లు, రెండు ఎమ్మెల్సీ, ఒక ఎమ్మెల్యే స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంటుంది. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం నుంచి నలుగురు కేంద్ర మంత్రులు అవుతారు.

ఎక్కువగా తాగడంతోనే బీర్ల కొరత

తాగడం ఎక్కువ కావడంతోనే రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడింది. అందులోనూ ఓ బ్రాండ్‌కు గిరాకీ పెరిగింది. సదరు కంపెనీ ఆ మేరకు ఉత్పత్తి చేయడం లేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై సమీక్ష జరపలేదు. బాధితుల వివరాలు నాకు తెలియదు. గ్యాంగ్‌స్టర్ నయీమ్‌కు భారీగా ఆస్తులున్నట్టు నాకు తెలియదు. ఆ కేసుపై నాకు ఎలాంటి నివేదిక అందలేదు.

నేటితో తెలంగాణకు సంపూర్ణ విముక్తి

ఇకపై తెలంగాణకు మాత్రమే హైదరాబాద్ రాజధాని

- ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం
- ప్రజలకు సీఎం రేవంత్ దశాబ్ది శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న రాష్ట్రం ఏర్పాటై పదకొండో సంవత్సరంలోకి అడుగుపెడుతోందని, ఏళ్ల తరబడి సాగిన ఉద్యమంలో పా లుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ పార్టీల నేతలందరికీ ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. 'ఈ ఏడాది జూన్ 2కు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ రోజుతో తెలంగాణ స్వరాష్ట్రానికి సంపూర్ణ విముక్తి లభించింది. విభజన చట్టం ప్రకారం ఇకపై తెలంగాణకు మాత్రమే హైదరాబాద్ రాజధానిగా ఉంటుంది. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సింహభాగం మన ప్రజలకే దక్కుతాయి. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. గత పదేళ్లలో తెలంగాణలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టడంతో పాటు, ఇంతకాలం కోల్పో యిన ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరిస్తాం. తెలంగాణ ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం. ప్రజా పాలనను అందిస్తాం. అన్ని రంగాల్లోనూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచేలా భవిష్యత్ ప్రణాళికలు, సరికొత్త విధానాల రూపకల్పన మొదలైంది.' అని శనివారం ఒక ప్రకటనలో సీఎం రేవంత్ వెల్లడించారు.

గవర్నర్ దశాబ్ది శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్రాన్ని సాధించుకోవడం తెలంగాణ ప్రజలకు ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ సాధనకు ప్రాణాలర్పించిన యువత బలిదానాలను గుర్తు చేసుకుని, వారి ఆత్మలకు శాంతి చేకూర్చాలని ఆయన ప్రార్థించారు. విద్యార్థులు, యువత బలిదానాలతో తెలంగాణ కల సాకారమైందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు, ఉద్యోగులు, నేతలు, విధానరూపకర్తల కఠోర శ్రమ.. అన్ని రంగాల్లో తెలంగాణ పురోభివృద్ధి కొనసాగింపునకు దోహదపడుతుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

గవర్నర్‌కు సీఎం ఆహ్వానం

రాష్ట్ర అవతరణ దినోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి శనివారం ఆయన రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఆదివారం పరేడ్ మైదానంలో నిర్వహించనున్న వేడుకల విశేషాలను గవర్నర్‌కు వివరించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ హాజరవుతారని తెలిపారు.


దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం!

- ఉదయం 9.30 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నివాళులు
- తర్వాత పరేడ్ గ్రౌండ్స్‌లో వేడుకలు.. తెలంగాణ రాష్ట్ర గీతం ఆవిష్కరణ
- అనంతరం సీఎం, ఇతర ప్రముఖుల ప్రసంగాలు
- వివరాలను వెల్లడించిన సమాచార శాఖ కమిషనర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ వేడుకలకు సంబంధించిన షెడ్యూల్, ఇతర వివరాలను రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ హనుమంతరావు శనివారం వెల్లడించారు. దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఉత్సవాలు జరగనున్నాయని చెప్పారు. కార్యక్రమాలు ఉదయం 9.30 గంటలకు గన్‌పార్క్ వద్ద మొదలై.. రాత్రి 9 గంటలకు ట్యాంక్‌బండ్‌పై ముగుస్తాయని తెలిపారు. ట్యాంక్ బండ్‌పై నిర్వహించే వేడుకలకు వచ్చే ప్రజలు సాయంత్రం 5 గంటలోపే చేరుకోవాలని సూచించారు.

సర్వాంగ సుందరంగా ట్యాంక్‌బండ్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల కోసం పరేడ్ గ్రౌండ్స్‌లో, ట్యాంక్‌బండ్‌పై చేస్తున్న ఏర్పాట్లను మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఇతర నేతలు పరిశీలించారు. పరేడ్ గ్రౌండ్స్‌లో వేదికలు, హాజరయ్యే వారికోసం సిద్ధం చేస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఇక దశాబ్ది ఉత్సవాల కోసం ట్యాంక్‌బండ్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికపై జరిగే కార్యక్రమాలను వీక్షించడానికి పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. 80కిపైగా ఫుడ్, వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేశారు. మంచినీటిని అందుబాటులో పెట్టారు. పదేళ్ల తర్వాత ప్రజాస్వామిక తెలంగాణ వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నాడు సోనియా గాంధీ ఒక అడుగు వెనక్కి వేసి ఉంటే తెలంగాణ రాకపోయేదన్నారు. తెలంగాణ ఏర్పాటులో బీజేపీ నేత సుష్మాస్వరాజ్ పాత్రను మరవలేమన్నారు. ఇక ప్రత్యేక తెలంగాణ కోసం ప్రపంచం గర్వించదగ్గ ఉద్యమం జరిగిందని.. కానీ ఆ ఉద్యమానికి అనుగుణంగా గత పదేళ్లలో పాలన జరగలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో మంత్రుల వెంట ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శనివారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో సచివాలయం, అమరుల స్మారకం

ఉత్సవాల షెడ్యూల్ ఇలా..

- ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంటారు. అమరులకు నివాళులు అర్పిస్తారు.
- 9.55 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌కు సీఎం చేరుకుంటారు.
- 10.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సాయుధ బలగాల కవాతు, గౌరవ వందనం ఉంటాయి.
- 10.15 నుంచి 10.35 వరకు బలగాల మార్చ్ ఫాస్ట్ ఉంటుంది.
- 10.35 గంటలకు 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారు.
- 10.38 కార్యక్రమానికి సోనియా గాంధీ హాజరైతే ఆమె తొలుత ప్రసంగిస్తారు. తర్వాత సీఎం రేవంత్ ప్రసంగం ఉంటుంది. సోనియా రాకుంటే నేరుగా సీఎం ప్రసంగిస్తారు.
- 11.08 గంటలకు పోలీసు, ఉత్తమ కాంటింజెంట్ల అవార్డుల ప్రదానం.
- 11.20కు పరేడ్ ముగింపు కోసం పరేడ్ కమాండర్‌కు అనుమతి
- 11.25 గంటలకు అవార్డుల స్వీకర్తలతో ఫొటో సెషన్
- 11.30 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో కార్యక్రమం ముగింపు.

సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై కార్యక్రమాలివీ..

- 6.50 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటారు.
- 7.00 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను సందర్శిస్తారు
- 7.20 గంటలకు కార్నివాల్ మొదలవుతుంది.
- 7.30 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు.. కళాకారుల నృత్యాలు, ఆటపాటలు
- 8.30కు ఫ్లాగ్ వాక్.. జయ జయహే తెలంగాణ గేయం 13.5 నిమిషాల పూర్తి వెర్షన్ విడుదల.
- 8.44 గంటలకు గేయ రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణికి సన్మానం
- 8.50 గంటలకు ఆకట్టుకునేలా బాణసంచా
- 9.00గంటలకు ట్యాంక్‌బండ్‌పై కార్యక్రమం ముగింపు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండండి



- విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రావొద్దు
- అధికారులు, సిబ్బందితో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. వర్షాలు, ఈదురుగాలుల మూలంగా చెట్లు విరిగిపోవడం, స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడటం లాంటి ఘటనలు జరుగుతుంటాయని, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి సమస్య వచ్చిన వెంటనే స్పందించాలని సూచించారు. శనివారం సచివాలయంలో ఆయన విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 'ప్రజలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ అందుబాటులో ఉంది. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టండి. లైన్స్ క్లియరెన్స్ (ఎల్‌సీ) విషయంలో జాగ్రత్త వహించాలి. ఒకేసారి పలు ప్రాంతాల్లో ఎల్‌సీలు ఇవ్వొద్దు. ఎల్‌సీ తీసుకునే సమయంలో స్థానిక వినియోగదారులకు ముందస్తు సమాచారం ఇవ్వండి. వర్షాకాలంలో కరెంటు సరఫరా, మరమ్మతులు, పునరుద్ధరణ విషయంలో ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి నుంచి క్షేత్రస్థాయిలోని లైన్‌మెన్ వరకు అప్రమత్తంగా ఉండాలి. నిరంతరం సమీక్షలు నిర్వహించడంతో పాటు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసుకోండి' అని భట్టి ఈ సమీక్షలో సూచించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ఎ.రిజ్వీ, ఎస్పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆలోచనల మేరకు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చారని శనివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఆశయాలు, ఆకాంక్షలు పదేళ్లుగా ఆచరణకు నోచుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పాలన మొదలయ్యాక ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారని తెలిపారు.

ఉత్సవాలకు అన్ని పార్టీలకు ఆహ్వానం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఉద్యమకారులకు, అన్ని రాజకీయ పార్టీలకు ఆహ్వానం అందజేయాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించిందని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే ఉత్సవ కార్యక్రమాన్ని పరిమితంగా నిర్వహించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే వేడుకలకు ఎలాంటి పరిమితులు లేవని చెప్పారు. ఉద్యమకారులను ఆహ్వానించామని, ఉద్యమకారులే ముఖ్యులుగా ఆవిర్భావ వేడుకలు జరుపుకుంటున్నా మని చెప్పారు. అనేకమంది ఉద్యమ కారులు ఎఫ్ఐఆర్ కాపీలు పంపించారని, హైదరాబాద్‌కు రాలేని వారు ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించే వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

వందలాది మందిని బలితీసుకున్నదే కాంగ్రెస్

- కేసీఆర్ టీఆర్‌ఎస్ పార్టీ పెట్టకుండా ఉంటే తెలంగాణ వచ్చేదా?
- బీఆర్‌ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఇచ్చింది సోనియా, కాంగ్రెస్ అని ప్రచారం చేసుకుంటున్న ఆ పార్టీ నాయకులు గన్‌పార్కు దగ్గర అమరులస్తూపం ఎందుకు కట్టారో తెలుసుకుంటే మంచిదని బీఆర్‌ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి ఎద్దేవా చేశారు. 1969 ఉద్యమంలో 369 మందిని కాంగ్రెస్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని, వారి అమరత్వానికి గుర్తుగానే స్తూపం కట్టారని అన్నారు. మలిదశ ఉద్యమంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఎంతోమంది విద్యార్థులు, యువకుల ప్రాణత్యాగాలకు కారణమైందని గుర్తు చేశారు. తామే తెలంగాణ తెచ్చామని కాంగ్రెస్ నాయకులు అనడం దయ్యాలు వేదాలు వల్లించడమేనని, 2001లో కేసీఆర్ టీఆర్‌ఎస్ పెట్టి పోరాడకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. ఏనాడూ జై తెలంగాణ అనని రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో కూర్చున్నాడని, ఈ ఆర్నెల్లలో సీఎం రేవంత్ ఏనాడూ తెలంగాణ అమరవీరుల స్తూపం దగ్గరకు వెళ్లిందిలేదని విమర్శించారు.

అమరులకు కేసీఆర్‌ నివాళి

- గన్‌పార్క్‌ అమరుల స్థూపం వద్ద పుష్పాంజలి
- అక్కడి నుంచి అమరజ్యోతి వరకు బీఆర్‌ఎస్‌ కొవ్వొత్తుల ర్యాలీ
- నేడు తెలంగాణ భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు
- జాతీయ జెండా ఎగురవేయనున్న కేటీఆర్‌

సాక్షి, హైదరాబాద్‌: భారత్‌ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్‌) చేపట్టిన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో.. తొలిరోజున సాయంత్రం పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. కొవ్వొత్తితో అమరజ్యోతిని వెలిగించి అమరులకు నివాళి అర్పించారు. అనంతరం అమర జ్యోతుల (కొవ్వొత్తుల) ర్యాలీని కేసీఆర్‌ ప్రారంభించారు. వెయ్యి మందికిపైగా తెలంగాణ కవులు, కళాకారులు, న్యాయవాదులు, వైద్యులు, వివిధ రంగాలకు చెందినవారితోపాటు.. పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, కార్యకర్తలతో సుమారు రెండు గంటల పాటు ర్యాలీ కొనసాగింది. అమరులకు నివాళి అర్పిస్తూ ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. రవీంద్రభారతి, ఆర్‌బీఐ మీదుగా సెక్రటేరియట్‌ ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ 'జోహారులు.. జోహారులు.. అమరులకు జోహారులు.. వీరులకు జోహారులు' అంటూ ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి అందరూ అమరులకు నివాళి అర్పించారు.

నేడు తెలంగాణ భవన్‌లో వేడుకలు

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో వేడుకలు జరగనున్నాయి. ఉదయం 9.30కు పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాతోపాటు బీఆర్‌ఎస్‌ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం 'తెలంగాణ యాది' పేరిట ఉద్యమ జ్ఞాపకాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పార్టీ అధినేత కేసీఆర్‌ ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి కేసీఆర్‌ ప్రసంగిస్తారు. తర్వాత తెలంగాణ భవన్‌ పక్కనే ఉన్న కళింగ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి భోజనం చేస్తారు.

ప్రజల భాగస్వామ్యంతోనే తెలంగాణ: కేసీఆర్‌

ప్రజాస్వామిక వాతావరణంలో, పార్లమెంటరీ పంథాలో బీఆర్‌ఎస్‌ పార్టీ అస్తిత్వ రాజకీయ వేదికగా ప్రజలందరి భాగస్వామ్యంతో తెలంగాణ సాధించుకున్నామని కేసీఆర్‌ చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్‌ 2 సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేసీఆర్‌ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో పటిష్ట పర్చుకుంటూ సమర్థవంతంగా పాలన అందించిన గత పదేళ్లలో.. అభివృద్ధి సంక్షేమ రంగాల్లో తెలంగాణ దేశానికే ఒక రోల్‌ మోడల్‌గా నిలిచిందన్నారు. అమరుల త్యాగాలను వృథాపోనీయకుండా.. గత పదేళ్ల ప్రగతిని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని ఆకాంక్షించారు.



గన్‌పార్క్‌ అమరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న కె. చంద్రశేఖర్‌రావు. చిత్రంలో నామా, సంతోష్, పల్లా, శ్రీనివాస్‌గౌడ్, సబిత, తలసాని, సత్యవతి తదితరులు



శనివారం గన్‌పార్క్‌ వద్ద జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో బీఆర్‌ఎస్‌ శ్రేణులు

కాంగ్రెస్‌ పాలనతో మళ్లీ చీకట్లు: కేటీఆర్‌



సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.తారక రామారావు ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇప్పుడు కరెంటు కోతలు, చీకట్లు నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్‌ కోతలు లేవంటూ ఓ వైపు ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, విద్యుత్‌ కోతల సమస్యలను ప్రస్తావిస్తూ 'ఎక్స్‌'లో కేటీఆర్‌కు నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. దీంతో కరెంట్‌ కోతలే లేవంటూ ప్రకటిస్తున్న డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ట్యాగ్‌ చేస్తూ నెటిజన్ల ట్వీట్లను కేటీఆర్‌ శనివారం రీట్వీట్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని వివరించారు. 'విద్యుత్‌ కోతలే లేకుండా పవర్‌ సెక్టార్‌లో బీఆర్‌ఎస్‌ సృష్టించిన మౌలిక సదుపాయాలను కూడా వాడుకోలేని అసమర్థ స్థితిలో రేవంత్‌ సర్కార్‌ ఉంది. 2014కు ముందు తరచూ విద్యుత్‌ కోతలు, పవర్‌ హాలిడేస్‌ మనకు ఉండేవి. ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేసిన ఘనత కేసీఆర్‌ సర్కార్‌ది. 24 గంటల నాణ్యమైన కరెంట్‌ సరఫరా చేయటం కారణంగా హైదరాబాద్‌ అభివృద్ధిలో దూసుకుపోయే పరిస్థితి వచ్చింది. కానీ ఈ పనికిమాలిన కాంగ్రెస్‌ ప్రభుత్వం మళ్లీ పదేళ్ల క్రితం నాటి పాత రోజులను తిరిగి తీసుకొచ్చింది' అని కేటీఆర్‌ పేర్కొన్నారు. విద్యుత్‌ కోతలు లేకుండా కేసీఆర్‌ చేసిందేమిటని కొంతమంది అడుగుతున్నారని...వాళ్లకోసం కొన్ని వివరాలు వెల్లడిస్తున్నట్లు తెలిపారు. '1,110గా ఉన్న తలసరి వినియోగం 2,110 యూనిట్లకు చేరిక. సౌర విద్యుత్‌ సామర్థ్యం 71 మెగావాట్ల నుంచి 5,000+ మెగావాట్లకు పెంపు. తెలంగాణలో స్థాపిత విద్యుత్‌ సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 18,000 మెగావాట్ల చేరిక. ట్రాన్స్‌మిషన్‌ సామర్థ్యం 13,900 మెగావాట్ల నుంచి 37,000 మెగావాట్ల వరకు పెంపు. కేసీఆర్‌ గారి పాలనలో పవర్‌ హాలిడేస్‌ అనే మాటే లేదు' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నెటిజన్లు కాంగ్రెస్‌ సర్కార్‌ను తిడుతూ పెట్టిన కామెంట్లను కేటీఆర్‌ రీపోస్ట్‌ చేశారు.

అమరుల స్థూపానికి ఇనుప కంచె..కేటీఆర్‌ ఎద్దేవా

గన్‌పార్క్‌లో అమరవీరుల స్థూపం వద్ద ఇనుప కంచెతో బ్యారికేడ్‌ ఏర్పాటు చేయడంపై కేటీఆర్‌ 'ఎక్స్‌' వేదికగా స్పందించారు. 'మార్పు వచ్చింది' అనే శీర్షికతో 'ఇందిరమ్మ పాలనలోని ఎమర్జెన్సీ రోజులు గుర్తుకు తెచ్చేలా అమరుల స్థూపానికి కూడా ఇనుప కంచెలు తెచ్చింది' అంటూ కంచె ఏర్పాటు చేసిన ఫొటోను ట్యాగ్‌ చేశారు.

ఎగ్జిట్‌ పోల్స్‌తో సంబంధం లేకుండా ఫలితాలు: కేటీఆర్‌

ఎగ్జిట్‌ పోల్స్‌తో సంబంధం లేకుండా ఫలితాల్లో ఎగ్జాక్ట్‌ పోల్స్‌ వస్తాయని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ చెప్పారు. అమరజ్యోతి వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జీవితంలో ఒక్కసారి కూడా జై తెలంగాణ అనని, అమరులకు నివాళులు అర్పించని వ్యక్తి తెలంగాణకు సీఎంగా ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణ పోరాటాలను, అమరుల త్యాగాన్ని అవమానించేలా కాంగ్రెస్‌ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గతంలో తెలంగాణ ఉద్యమకారులను చంపినది, బలిదానాలకు కారణమైనదే కాంగ్రెస్‌ అని మండిపడ్డారు.

అరచేతిలో ఎన్నికల ప్రపంచం

→ ఎన్నికల ఫలితాల తాజా అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు డిజిటల్‌ రూపంలో మీ ముందుకు తెస్తోంది సాక్షి.కామ్‌. క్షణక్షణం ఇచ్చే ఈ అప్‌డేట్స్‌తో పాటే విశ్లేషణాత్మక కథనాలు, ఏ నియోజకవర్గ సమాచారాన్ని అయినా చిటికెలో ఇట్టే తెలుసుకోగలిగేలా అందిస్తోంది. అంతే కాదు.. మీరు స్వయంగా నావిగేట్‌ చేసుకునే సౌకర్యం, జిల్లాల వారీగానూ ఎన్నికల ఫలితాలు, స్పష్టంగా అర్థమయ్యే గ్రాఫిక్స్‌.. ఇలా ఎన్నెన్నో విశేషాలున్న సాక్షి.కామ్‌ను అస్సలు మిస్‌ కావొద్దు. ఫాలో www.sakshi.com.

SAKSHI.COM

క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి. సాక్షి ఎలక్షన్‌ స్పెషల్‌ను చూడండి..

ఉద్యమాన్ని అవమానిస్తూ ఉత్సవాలా?

సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ లేఖ

- దయతో తెలంగాణ ఇచ్చామనే అహంభావ ధోరణి చూపుతున్నారు
- ఉద్యమాన్ని, అమరుల త్యాగాలను అవమానిస్తున్నారు
- అలాంటి మీరు చేసే ఉత్సవాలకు సార్థకత ఏముంటుంది?
- నాటి కాంగ్రెస్‌ దమన నీతికి సాక్ష్యమే గన్‌పార్క్‌ అమరుల స్థూపం
- తెలంగాణ సీఎం అయి ఉండీ 'జై తెలంగాణ' అనలేదెందుకు?
- ఉత్సవాలకు ఆహ్వానించిన తీరు నన్ను అవమానించేలా ఉంది
- మీ వికృత పోకడలకు నిరసనగా ఉత్సవాలకు బీఆర్‌ఎస్‌ దూరం
- చేసిన తప్పులకు కాంగ్రెస్‌ ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్‌: ''తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. కానీ కాంగ్రెస్‌ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకువెళ్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్‌ పాల్గొనడం సమంజసం కాదని బీఆర్‌ఎస్‌ సహా ఉద్యమకారులు, తెలంగాణవాదులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న మీ వికృత పోకడలను నిరసిస్తూ ప్రభుత్వం నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ పాల్గొనడం లేదు..'' అని భారత్‌ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ రేవంత్‌రెడ్డి రాసిన లేఖకు ప్రతిగా కేసీఆర్‌ శనివారం సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. అందులో కేసీఆర్‌ పేర్కొన్న అంశాలివే..

''రాష్ట్ర అవతరణ ఉత్సవాల నిర్వహణపై మీ (కాంగ్రెస్‌) ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌ను ఆహ్వానించక పోవడం అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనం. బీఆర్‌ఎస్‌ను కావాలని విస్మరించి మీ సంకుచితత్వాన్ని మరోసారి నిరూపించుకున్నారు. నన్ను దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానించిన తీరు.. నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించినట్లుగా ఉంది. ప్రాణాన్ని పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్షతో ఉద్యమాన్ని విజయతీరానికి చేర్చిన నన్ను ఆహ్వానించిన తీరు ఎంతో అవమానకరంగా ఉంది. తెలంగాణ ప్రజాపోరాటానికి నాయకత్వ స్థానంలో నిలిచిన నాకు వేదికపై స్థానం కల్పించలేదు. రాష్ట్ర సాధనలో నాకున్న అనుభవాలు పంచుకునేలా ప్రసంగించే అవకాశం కల్పించక పోవడం మీ అహంకార ఆధిపత్య ధోరణికి పరాకాష్ట. నన్ను ఆహ్వానించి అవమానించాలనే మీ దురుద్దేశాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు. పోరాట వారసత్వాన్ని దెబ్బతీయడానికి మీరు చేస్తున్న కుట్రలను తెలంగాణ సమాజం గమనిస్తున్నది. తెలంగాణ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉత్సవాలు జరుగుతున్న తీరును ఉద్యమకారులు ఇప్పటికే నిరసిస్తున్నారు.

జై తెలంగాణ అని నినదించరెందుకు?

తెలంగాణ ముఖ్యమంత్రి అయినా ప్రజలకు ప్రాణప్రదమైన 'జై తెలంగాణ' నినాదాన్ని ఇప్పటివరకు నోటినిండా పలకలేని మీ మానసిక వైకల్యాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఇక ముందైనా తెలంగాణ వ్యతిరేక మానసికత నుంచి బయటపడి జై తెలంగాణ అని నినదించే వివేకాన్ని తెలంగాణ సమాజం మీ నుంచి కోరుకుంటున్నది. సీఎంగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలవుతున్నా.. ఇప్పటివరకూ తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని సందర్శించక, శ్రద్ధాంజలి ఘటించక పోవడం ద్వారా ప్రజల మనోభావాలను గాయపరిచారు. అమరుల త్యాగాలతో అవతరించిన తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌ దయాభిక్షగా ప్రచారం చేస్తున్న మీ భావ దారిద్ర్యాన్ని నేను నిరసిస్తున్నాను. 1969 నుంచి ఐదు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో చరిత్ర పొడుగునా కాంగ్రెస్‌ రక్తసిక్తం చేసిందనేది దాచేస్తే దాగని సత్యం. 1952 ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురు విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకోవడం మొదలు కాంగ్రెస్‌ క్రూర చరిత్ర కొనసాగింది. తెలంగాణ ప్రజల అభీష్టానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసి తెలంగాణలో ఐదారు తరాల ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్‌ పార్టీది.

మీ దమన నీతికి సాక్ష్యం.. అమరుల స్థూపం

తెలంగాణ తొలిదశ ఉద్యమంలో 369 మంది యువకులను కాల్చి చంపిన కాంగ్రెస్‌ దమన నీతికి సాక్ష్యమే గన్‌పార్క్‌ అమరవీరుల స్థూపం. ఆ స్థూపాన్ని కూడా ఆవిష్కరించ నీయకుండా అడ్డుపడిన కాంగ్రెస్‌ కర్కశత్వం తెలంగాణ చరిత్ర పుటల్లో నిలిచింది. మలిదశ ఉద్యమంలోనూ వందలాది మంది యువకుల ప్రాణాలను బలిగొన్న పాపం కాంగ్రెస్‌ పార్టీదే. తెలంగాణకు కాంగ్రెస్‌ చేసిన అన్యాయాన్ని సరిదిద్దడానికి జరిగిన చరిత్రాత్మక ప్రయత్నంలో భాగంగా ఆవిర్భవించిన టీఆర్‌ఎస్‌ ఉద్యమానికి రాజకీయ వ్యక్తీకరణను ఇచ్చింది. తెలంగాణ వాదాన్ని తిరుగులేని రాజకీయ శక్తిగా మలిచి ఎన్నికలు, సభలు, సమావేశాలతో రాజకీయ ఒత్తిడి పెంచింది. దేశంలో ఉన్న పార్టీల మద్దతును లిఖిత పూర్వకంగా సాధించింది. కానీ తెలంగాణ ఉద్యమాన్ని నిర్వీర్యపరిచే అనైతిక కుట్రలకు కాంగ్రెస్‌ పాల్పడింది.

తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పండి

నా ప్రాణాలను పణంగా పెట్టి 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్‌ సచ్చుడో' అని ఆమరణ నిరాహార దీక్షకు దిగడంతో కాంగ్రెస్‌ 'డిసెంబర్‌ 9' ప్రకటన చేసింది. కానీ సమైక్య పాలకుల ఒత్తిడితో వెనక్కితగ్గి మోసం చేసింది. దాంతో వందలాది మంది యువకులు ప్రాణత్యాగాలు చేశారు. దీనిపై కాంగ్రెస్‌ ఎన్నడూ పశ్చాత్తాపాన్ని ప్రకటించలేదు, క్షమాపణ కోరలేదు. పైగా దయతో మేమే తెలంగాణ ఇచ్చామనే ఆధిపత్య, అహంభావ ధోరణి ప్రదర్శిస్తూ.. ఉద్యమాన్ని, అమరుల త్యాగాన్ని అవమానిస్తున్నారు. ఈ రకమైన వైఖరిని మార్చుకోనప్పుడు మీరు చేసే ఉత్సవాలకు సార్థకత ఏముంటుంది? ఇప్పటికైనా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పండి. రాజకీయ అవసరాల కోసం కాకుండా మనస్ఫూర్తిగా తెలంగాణ సమాజానికి క్షమాపణలు కాంగ్రెస్‌ చెప్పినప్పుడే పాప పరిహారం చేసుకున్నట్టు అవుతుంది.

మీకు తెలంగాణ రాజకీయ అవకాశమే..

కాంగ్రెస్‌కు తెలంగాణ ఒక రాజకీయ అవకాశమే తప్ప మనఃపూర్వక ఆమోదం కాదు. కాంగ్రెస్‌ ఎన్నటికీ మారదని మీ ప్రవర్తన, మీ పార్టీ ప్రవర్తనతో స్పష్టమవుతోంది. నాడు, నేడు ఎన్నడూ అంతే. తెలంగాణలో గత ఆరు నెలలుగా సాగుతున్న మీ పరిపాలనే ఇందుకు నిదర్శనం. ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన మిమ్మల్ని ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తున్నారు. సోషల్‌ మీడియాలో ప్రశ్నిస్తూ పోస్టులు పెడితే కేసులతో వేధింపులు, నిర్బంధాలు ప్రయోగిస్తున్నారు. తెలంగాణకు గర్వకారణమైన అస్తిత్వ చిహ్నాలపై విషం కక్కుతూ.. అధికార ముద్ర నుంచి తొలగిస్తామని అవమానిస్తున్నారు. మీ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు వ్యర్థ ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణకు అన్నం పెట్టిన కాకతీయ రాజులను అవమానిస్తూ.. కుతుబ్‌ షాహీల కాలంలో నిర్మించిన చార్మినార్‌కు మలినాన్ని ఆపాదిస్తున్న మీ సంకుచితత్వం తెలంగాణకు హానికరం.

తెలంగాణ గుండె గాయపడుతోంది

కాంగ్రెస్‌ పాలన కొనసాగుతున్న దాదాపు ఈ ఆరునెలల కాలంలో ప్రజా జీవితం అస్తవ్యస్తమైంది. రానున్న కష్టాలను తలచుకుని తెలంగాణ తల్లి తల్లడిల్లుతున్నది. ప్రతి క్షణం తెలంగాణ గుండె గాయపడుతున్నది. తెలంగాణ బతుకు చిత్రాన్ని మీ అసమర్థ పాలన చిదిమి ఛిద్రం చేసింది. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ దార్శనికతతో శాశ్వతంగా దూరమైన కష్టాలు, సమస్యలన్నీ.. మీ అసమర్థ పాలనతో మళ్లీ ప్రత్యక్షమవుతున్నాయి. అన్ని రంగాలు ఆరు నెలల్లోనే ఆగమైపోయిన విషాదం కనిపిస్తోంది. ఇక ముందైనా నిజమైన ప్రగతి, సంక్షేమం కోసం ప్రయత్నించి ఎన్నికల వాగ్దానాలన్నీ నెరవేర్చడం ద్వారా ప్రజల మన్ననలు పొందుతారని ఆశిస్తున్నాను'' అని రేవంత్‌కు రాసిన లేఖలో కేసీఆర్‌ పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్‌

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మహబూబ్‌నగర్‌ బాలుర జూనియర్‌ కాలేజీలో లెక్కింపు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌: మహబూబ్‌నగర్‌ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నిక కౌంటింగ్‌కు రంగం సిద్ధమైంది. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్‌ కళాశాలలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొత్తం ఐదు టేబుళ్లలో ఓట్లు లెక్కించనున్నారు. మొదటి ప్రాధాన్య ఓటుతో అభ్యర్థి గెలుపొందినట్లయితే మధ్యాహ్నంలోపు ఫలితం తేలే అవకాశం ఉంది. ఎలిమినేషన్‌ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు తప్పదనుకుంటే సాయంత్రం వరకు కౌంటింగ్‌ కొనసాగనున్నట్లు తెలుస్తోంది. కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికైన నేపథ్యంలో ఎమ్మెల్సీగా ఆయన రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చింది. షెడ్యూల్‌ ప్రకారం ఈ ఏడాది మార్చి 28న పోలింగ్‌ జరగగా.. కాంగ్రెస్‌ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్‌ పోటీలో నిలిచారు. మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా, 1,437 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్‌ మండలం మంథన్‌గోడ్‌ ఎంపీటీసీ సభ్యురాలు సుమిత్ర, నాగర్‌కర్నూల్‌ జిల్లా బిజినేపల్లి మండలం గుడ్లనర్వ ఎంపీటీసీ శారద ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు.

కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో శనివారం గరిష్ట ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. గత రెండ్రోజులతో పోలిస్తే శనివారం చాలాచోట్ల సాధారణం కంటే 1 నుంచి 2 డిగ్రీల మేర అధికంగా నమోదు కాగా.. భద్రాచలం, ఖమ్మం, నల్లగొండ, రామగుండంలో సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. శనివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. అదిలాబాద్‌లో 43.3 డిగ్రీల సెల్సియస్‌ గరిష్ట ఉష్ణోగ్రత నమోదుకాగా, నల్లగొండలో 25.8 డిగ్రీల సెల్సియస్‌ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర పరిసర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 1.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశల్లో తక్కువ ఎత్తు నుంచి బలమైన గాలులు వీస్తున్నట్లు తెలిపింది. నైరుతి రుతుపవనాలు శనివారం కేరళలోని మిగిలిన ప్రాంతాలు, తమిళనాడులోని మరి కొన్ని ప్రాంతాలు, రాయలసీమ, కర్ణాటక రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలోకి విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది.

శనివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్‌	43.3
హనుమకొండ	43.0
నిజామాబాద్‌	42.0
మెదక్‌	41.8
రామగుండం	41.4
మహబూబ్‌నగర్‌	41.1
భద్రాచలం	40.0
నల్లగొండ	40.0
హైదరాబాద్‌	39.8
ఖమ్మం	39.6
దుండిగల్‌	39.5
హకీంపేట్‌	39.5

ఎల్లుండే 'లోక్‌సభ' కౌంటింగ్‌

4వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రక్రియ ప్రారంభం

- తొలుత పోస్టల్‌ బ్యాలెట్లు.. తర్వాత ఈవీఎంలో ఓట్ల లెక్కింపు..
- 34 ప్రాంతాల్లో 120 కౌంటింగ్‌ కేంద్రాలు.. 10 వేల మంది సిబ్బంది
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం 10వేల మంది సిబ్బందిని ఎంపిక చేసినట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ వెల్లడించారు. 4న జరిగే లోక్‌సభ ఓట్ల లెక్కింపుతో పాటు 2న జరిగే ఉమ్మడి మహబూబ్‌నగర్‌ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు, 5న జరిగే ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్ల ఓట్ల లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా 34 ప్రాంతాల్లో 120 కౌంటింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశామని వికాస్‌రాజ్‌ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం 10 వేల మంది సిబ్బందిని ఎంపిక చేశామని.. ఇందులో 50 శాతం సిబ్బంది రిజర్వ్‌లో ఉంటారని చెప్పారు. ర్యాండమైజేషన్‌ పద్ధతిలో సిబ్బందిని ఎంపిక చేసి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్టు వివరించారు.

మూడంచెల భద్రత మధ్య

ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఒక కౌంటింగ్‌ కేంద్రం ఉంటుందని.. ఒక కేంద్రంలో 24 టేబుల్స్‌ ఉంటాయని వికాస్‌రాజ్‌ తెలిపారు. అయితే మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో 28 టేబుల్స్‌ అవసరమవడంతో.. రెండు హాల్స్‌ ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి కౌంటింగ్‌ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని.. గుర్తింపు కార్డు ఉంటేనే కేంద్రం లోపలికి అనుమతిస్తామని తెలిపారు. కౌంటింగ్‌ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, కెమెరాలు సహా ఎలాంటి ఎల్రక్టానిక్‌ పరికరాలను అనుమతించబోమన్నారు. ఇప్పటివరకు 2.18 లక్షల పోస్టల్‌ బ్యాలెట్లు వచ్చాయని.. ఇంకా ఈటీపీబీఎస్‌ (ఎల్రక్టానికల్లీ ట్రాన్స్‌మిటెడ్‌ పోస్టల్‌ బ్యాలెట్‌ సిస్టం)లు వస్తున్నాయని, కౌంటింగ్‌ రోజు ఉదయం 8 గంటలలోపు వచ్చిన వాటిని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ లెక్కన పోస్టల్‌ బ్యాలెట్ల సంఖ్యపై కౌంటింగ్‌ రోజే స్పష్టత వస్తుందన్నారు. చొప్పదండి, దేవరకొండ, యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు 24 రౌండ్లు పడుతుందని.. ఆర్మూర్, భద్రాచలం, అశ్వారావుపేట సెగ్మెంట్లకు సంబంధించి 13 రౌండ్లలోనే పూర్తవుతుందని వివరించారు. సీఈసీ ఆదేశాల మేరకు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌ పరిధిలో ర్యాండమ్‌గా ఐదు పోలింగ్‌ కేంద్రాల్లోని వీవీప్యాట్‌ రసీదులను లెక్కిస్తామని తెలిపారు.



2,414 మంది సూక్ష్మ పరిశీలకులు

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌ ప్రక్రియ కోసం 2,414 మంది సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లను) నియమించినట్టు వికాస్‌రాజ్‌ తెలిపారు. ఒక్కో టేబుల్‌కు ఒక అబ్జర్వర్‌ ఉంటారని చెప్పారు. లెక్కింపు కోసం ఒక టేబుల్‌కు ఒక ఏఆర్‌ఓ, ఇద్దరు సహాయకులు ఉంటారన్నారు. కౌంటింగ్‌ ఏజెంట్లకు సంబంధించి ముందుగానే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. స్ట్రాంగ్‌ రూమ్‌ నుంచి లెక్కింపు కేంద్రం వరకు బారికేడ్లు, పటిష్ట భద్రత మధ్య తరలిస్తామని.. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డు అవుతుందని వివరించారు. కౌంటింగ్‌ రోజు మద్యం దుకాణాలను మూసివేస్తామన్నారు. ఆ రోజున ర్యాలీలకు అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు అనుమతిస్తే ర్యాలీలు చేసుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు పరిశీలకుల అనుమతి తర్వాత ఫలితాలు వెల్లడిస్తారని.. కౌంటింగ్‌ హాల్‌లో, మీడియా సెంటర్‌ వద్ద ప్రకటిస్తామని, వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్‌ చేస్తామని తెలిపారు. ఆదివారం జరిగే ఉమ్మడి మహబూబ్‌నగర్‌ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ అక్కడి ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలో జరుగుతుందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ దుప్పలపల్లిలోని తెలంగాణ వేర్‌హౌజ్‌ కార్పొరేషన్‌ గోదాం ఆవరణలో జరుగుతుందని వికాస్‌రాజ్‌ వెల్లడించారు.



ఇదిగో త్వరగా వచ్చుచున్నాను.
వానివాని క్రియచొప్పున ప్రతివానికిచ్చుటకు
నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది.
– క్రైస్తవ ధర్మం

విజయం సరే... విలువలు?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఈ నేల మీద భగవంతుడి ప్రస్థానమే రాజ్యం. సుప్రసిద్ధ జర్మన్ తత్త్వవేత్త హెగెల్ చేసిన సూత్రీకరణ ఇది. హెగెల్ నుంచి స్ఫూర్తి పొందిన వారిలో కార్ల్ మార్క్స్ వంటి తత్త్వవేత్తలే కాదు, మన ప్రధాని మోదీ వంటి వారు కూడా ఉన్నారు. ఇది నిన్న మొన్ననే నిగ్గు తేలినటువంటి ఒక నగ్నసత్యం. హెగెల్ సూత్రీకరణను మోదీ మరింత విస్తృతీకరించారు.

ఒక ప్రత్యేక కార్యం కోసం దేవుడు పంపగా వచ్చిన దూతను తానని ఈమధ్యనే ఒక ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. ఆ దేవుని తరఫున ఈ భూమ్మీద తన ప్రస్థానమే రాజ్యమని ఆయన భావన కావచ్చు. ఇందుకోసం ఆయన ఫ్రాన్స్ చక్రవర్తి పద్నాలుగో లూయీని అరువు తెచ్చుకున్నారు. 'ఐయామ్ ది స్టేట్' (నేనే రాజ్యం) అనే కొటేషన్‌తో పద్నాలుగో లూయీ చరిత్రలో నిలబడిపోయిన సంగతి తెలిసిందే.

హెగెల్ గతితర్కాన్ని, లూయీ నిరంకుశత్వాన్ని గ్రైండర్‌లో వేయగా వచ్చిన సింథసిస్‌నే మోదీ తనే దేవదూత కార్యంగా ప్రకటించారనుకోవాలి. తాను పొలిటికల్ సైన్స్‌తో ఎమ్మే చదివానని ఏదో సందర్భంలో ఆయనే చెప్పుకున్నారు. కనుక థామస్ హాబ్స్ తత్త్వధారను కూడా ఆయన అనివార్యంగా చదివుండాలి. హాబ్స్ ప్రతిపాదించిన సంపూర్ణ సార్వభౌమాధికార ప్రతిపాదన మోదీ మనసును రంజింపజేసి ఉండవచ్చు.

''నేను అందరిలానే పుట్టానని అమ్మ చనిపోయేంతవరకు అనుకునేవాడిని. కానీ, ఆ తర్వాత అర్థమైంది నాకు. దేవుడు ఏదో ప్రత్యేక కార్యం కోసం నన్ను పంపించాడు. నా ద్వారా ఆయన అమలు చేయానుకుంటున్న పథకం సమగ్ర స్వరూపం నాక్కూడా తెలియదు. ఆయన ఆదేశిస్తాడు, నేను అమలు చేస్తాన''ని ప్రధానమంత్రి ఆ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. బహుశా దేవుడు ఆశిస్తున్న సమగ్ర పథకాన్ని అమలు చేయాలంటే పార్లమెంట్‌లో బీజేపీకి మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలేమో! అంతవరకే దేవుడు చెప్పి ఉంటాడు. అందుకోసమే ఈ ఎన్నికల్లో 'అబ్ కీ బార్... చార్ సౌ పార్' అనే నినాదాన్ని మోదీ ఎత్తుకున్నారు. ఆ నినాదం కేవలం దైవ సంకల్పం!

అధికారంలోకి రావడానికి సాధారణ మెజారిటీ (272) చాలు. మరి 'చార్ సౌ పార్' కోసం ఎందుకింత ధ్యాస. ఎందుకిన్ని ధ్యానాలు, ఎందుకిన్ని దండాలు? ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా రాజ్యాంగాన్ని మార్చడానికేనా? రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిస్టు పదాలను ఎత్తివేయడానికా? బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించిన రాజ్యాంగ ఆదేశాలను తుంగలో తొక్కడానికా? రిజర్వేషన్లు ఎత్తివేయడానికా?... అవి ప్రతిపక్షాలు కాబట్టి ఉద్దేశపూర్వకంగా ఇటువంటి ఆరోపణలు చేస్తాయని కూడా అనుకోవచ్చు.

భారీ మెజారిటీ ఉంటే ప్రభుత్వం మరింత బలంగా ఉండవచ్చన్నది బీజేపీ నేతల తలపోత కావచ్చు. ఇప్పటికే పట్టుబిగించిన ప్రజాస్వామ్య వ్యవస్థలపై మరింత బిగువుగా పెత్తనం కొనసాగించవచ్చు. ప్రతిపక్షాలను నలిపేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలను స్థానిక సంస్థల స్థాయికి దిగజార్చి కేంద్ర సార్వభౌమాధికారాన్ని పటిష్ఠం చేయవచ్చు. ఏమో... దేవుడు ఆదేశిస్తే పార్లమెంటరీ వ్యవస్థ కొమ్ములు నరికి అధ్యక్ష పాలనను అంటుకట్టవచ్చు. ఈ రకమైన బృహత్కార్యాలను అమలు చేయాలంటే ఎన్డీఏ కూటమికి ఆ మాత్రం మెజారిటీ అవసరమవుతుంది.


కానీ, ఎన్డీఏ 400 మార్కును దాటే అవకాశం కనిపించడం లేదు. ఎగ్జిట్ పోల్స్ లెక్కల ప్రకారం గతంలో ఉన్న బలాన్నే యథాతథంగా కాపాడుకునే అవకాశం కనిపిస్తున్నది. ఇది మూడింట రెండొంతుల మెజారిటీకి ఓ రెండడుగుల దూరం. జాతీయ మీడియా పూర్తిగా బీజేపీకి అనుకూలంగా ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఇచ్చిందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రచార ఘట్టంలో ఎన్డీఏ నాయకత్వంలో కనిపించిన అసహనం, ప్రతిపక్షాలపై వారు అవధులు దాటి చేసిన ఆరోపణలు, మైనారిటీ మతాన్ని టార్గెట్‌గా చేసుకొని సాగించిన అనైతిక ప్రచారం వగైరాలు మారుతున్న రాజకీయ వాతావరణానికి సంకేతాలుగా చాలామంది భావించారు.

ప్రతిపక్షాలను నిందించడం కోసం మహాత్మాగాంధీ పేరును మోదీ వాడుకున్న తీరు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. 'గాంధీ సినిమా (1982) వచ్చేవరకూ ఆయన గురించి ప్రపంచంలో పెద్దగా తెలియదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆయన్ను ప్రమోట్ చేయలేదు. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా కంటే గాంధీ ఏం తక్కువ? వాళ్లకొచ్చినంత పేరు గాంధీకి రాలేదంటే అప్పటి ప్రభుత్వాలే కారణమ'ని ఆయన ఏబీపీ ఇంటర్వ్యూలో ఆక్షేపించారు.

ప్రతిపక్షాల మీద ప్రధాని వివక్షణా రహితంగా చేసిన దాడుల్లో భాగంగానే దీన్ని పరిగణించాలేమో! ఎందుకంటే గాంధీకి దేశదేశాల్లో ఉన్న ప్రాచుర్యం గురించి ప్రధానికి తెలియదనుకోవడం నమ్మశక్యంగా లేదు. గాంధీ మరణాన్ని ఆ రోజుల్లోనే సకల దేశాల్లోని వార్తా పత్రికలు బ్యానర్ వార్తగా ప్రకటించాయి. మోదీ ఉదాహరించిన మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలాలే స్వయంగా తాము గాంధీ నుంచి స్ఫూర్తి పొందామని పలుమార్లు ప్రకటించారు. గాంధీ ప్రవచించిన అహింసాయుత ఆందోళనా పద్ధతులనే మార్టిన్ లూథర్ కింగ్ అమెరికాలో ఆచరణలో పెట్టారు.

గాంధీ పుట్టిన భారతదేశాన్ని సందర్శించాలన్న ఆకాంక్షను కూడా ఆ రోజుల్లో కింగ్ వెల్లడించారు. పండిత్ నెహ్రూ ఆహ్వానంపై 1956లో ఆయన ఇండియాలో దిగిన వెంటనే చెప్పిన మాట ఎన్నటికీ మరపునకు రాదు. 'నేను విదేశాలకు పర్యాటకునిగా వెళ్తుంటాను. కానీ, ఈ దేశానికి ఒక యాత్రికునిగా వచ్చాన'న్నారు. అన్యాయానికి, వివక్షకు గురయ్యే సకల దేశాల ప్రజానీకానికి సత్యాగ్రహమనే దివ్యాస్త్రాన్ని ప్రసాదించిన మహాత్మాగాంధీ పుట్టిన దేశం ఆనాటి మహోన్నతుల దృష్టిలో ఒక యాత్రాస్థలమే. నల్ల సూర్యుడు మండేలా కూడా తన స్ఫూర్తిప్రదాతగా గాంధీని పేర్కొన్నారు. 'గాంధీ ఆఫ్ సౌతాఫ్రికా'గా తనను పరిగణించడాన్ని గర్వంగా భావించారు.

రిచర్డ్ అటెన్‌బరో తీసిన సినిమా చూసేవరకూ ప్రపంచానికి గాంధీ తెలియదన్న మోదీ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాంధీపై ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ లాంటి సుప్రసిద్ధ శాస్త్రవేత్తలు, విజ్ఞానులు, దేశాధినేతలు చేసిన వ్యాఖ్యానాలను వారు ఉటంకిస్తున్నారు. 'ఇటువంటి వ్యక్తి (గాంధీ) ఒకరు ఈ నేల మీద రక్తమాంసాలతో నడయాడాడంటే భవిష్యత్తు తరాలు నమ్మకపోవచ్చ'ని ఐన్‌స్టీన్ చెప్పిన మాటలు మనకు సుపరిచితమైనవే. ప్రపంచంలోనే ఆల్‌టైమ్ అగ్రశ్రేణి నవలాకారుడు, రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్ – గాంధీల మధ్యనున్న స్నేహబంధం, నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాల గురించి కూడా ప్రపంచానికి తెలుసు.



విఐ లెనిన్, విన్‌స్టన్ చర్చిల్, ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్, మార్టిన్ లూథర్‌కింగ్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, అడాల్ఫ్ హిట్లర్, మావో జెడాంగ్, నెల్సన్ మండేలా, పండిత్ నెహ్రూ, మదర్ థెరిసా, మార్గరెట్ థాచర్ తదితర శక్తిమంతమైన, ప్రభావవంతమైన వ్యక్తులు ఇరవయ్యో శతాబ్దాన్ని శాసించారు. వీరందరిలోకి అత్యంత శక్తిమంతుడిగా మహాత్మాగాంధీ గుర్తింపు పొందడమే కాకుండా ఈ జాబితాలోని పలువురి అభిమానాన్ని, గౌరవాన్ని కూడా ఆయన చూరగొన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇరవయ్యో శతాబ్దం – గాంధీ శతాబ్దం!

అటువంటి గాంధీ మహాత్ముడిని సరిగ్గా ప్రమోట్ చేయలేకపోయారని ప్రధాని వాపోవడం ఒక ప్రకృతి వైచిత్రి. కార్పొరేట్ శక్తులన్నీ కలిసి ప్రమోట్ చేసి గద్దెనెక్కించడానికి ఆయనేమన్నా గుజరాత్ మోడలా? గాంధీ పుట్టింది గుజరాతే. కానీ ఆయన భారతీయ ఆత్మకు ప్రతీక. భారతీయ సహజీవనానికి ప్రతీక. భారతీయ సంస్కృతికి, భారతీయ సమైక్యతకు ప్రతీక. పల్లె స్వరాజ్యాన్ని ప్రేమించినవాడు. ఈశ్వరుడూ – అల్లా ఒకరేనని భజనలు చేసినవాడు. విద్వేషాన్ని ప్రేమతో జయించినవాడాయన. ఆయనే ఒక మూర్తీభవించిన భారతీయత. ఆయనను ప్రభుత్వాలు ప్రమోట్ చేయడమేమిటి? ఇన్నేళ్ల తర్వాత ఈ విషయంలో ప్రధాని వ్యాకులత చెందడం ప్రజలకు అసహజంగా అనిపించింది.

మోదీజీ తీసిన 'గాంధీ బాణం' ఎన్నికల కోసమేనన్నది అందరికీ అర్థమవుతూనే ఉన్నది. ఈసారి ఎన్నికల ప్రచారంలో ఆయన ఊహించని కొత్త పుంతలు తొక్కారు. ఫైవ్ ట్రిలియన్ ఎకానమీ ఊసే లేదు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌పై చర్చే లేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని అటకపై నుంచి మళ్లీ కిందికి దించలేదు. విదేశాల నుంచి బ్లాక్ మనీని తీసుకొస్తానన్న పదేళ్ల కిందటి హామీని పొరపాటున కూడా మళ్లీ ప్రస్తావించలేదు. రైతులకు గిట్టుబాటు ధరలపై స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని పదేళ్ల కింద ఇచ్చిన హామీకి చెదలు పట్టాయి. కీలకమైన ప్రజా సమస్యల ప్రస్తావనకు సమయం సరిపోలేదు.

జనజీవన స్రవంతి నుంచి ముస్లిం మతస్థులను వేరు చేసే ప్రయత్నం ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు ముమ్మరంగా చేశారు. ఈ విధ్వంసకర ధోరణికి సాక్షాత్తు ప్రధానే నాయకత్వం వహించారు. ప్రతిపక్షాలను 'ముజ్రా' డ్యాన్సర్లుగా అభివర్ణించారు. బీజేపీ గెలవకపోతే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ముస్లింలు లాగేసుకుంటారని రెచ్చగొట్టారు. ప్రతిపక్షాలు గెలిస్తే హిందువుల మంగళ సూత్రాలు లాక్కొని ముస్లింలకు పంచుతారని దారుణమైన ఆరోపణలు చేశారు. సమాజాన్ని విభజించే విత్తన బంతులను యథేచ్ఛగా వెదజల్లారు. ఈ పని చేసినందుకు యావత్తు భారతదేశం చింతించవలసిన రోజు రావచ్చు. ఇదంతా చేసింది 'చార్ సౌ పార్' కోసమేనా?

ఒకవేళ ఎన్డీఏ కూటమి 400 సీట్ల మార్కు దాటినా, అందుకు కారణం ఈ విద్వేష ప్రచారం కాబోదు. ప్రత్యామ్నాయ కూటమి సమర్థతపై జనానికి నమ్మకం కుదరకపోవడం కావచ్చు. ఈసారి కూడా గెలిస్తే నెహ్రూ తర్వాత వరసగా మూడు ఎన్నికల్లో గెలిచిన ప్రధానిగా ఆయన రికార్డును మోదీ సమం చేస్తారు. కానీ, జనంలో నాటిన విద్వేష బీజాలు ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయన్నదే బుద్ధిజీవుల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న.

> గాంధీ మహాత్ముడిని సరిగ్గా ప్రమోట్ చేయలేకపోయారని ప్రధాని వాపోవడం ఒక ప్రకృతి వైచిత్రి. కార్పొరేట్ శక్తులన్నీ కలిసి ప్రమోట్ చేసి గద్దెనెక్కించడానికి ఆయనేమన్నా గుజరాత్ మోడలా? గాంధీ పుట్టింది గుజరాతే. కానీ ఆయన భారతీయ ఆత్మకు ప్రతీక. భారతీయ సహజీవనానికి ప్రతీక. భారతీయ సంస్కృతికి, భారతీయ సమైక్యతకు ప్రతీక. పల్లె స్వరాజ్యాన్ని ప్రేమించినవాడు. ఈశ్వరుడూ – అల్లా ఒకరేనని భజనలు చేసిన వాడు. విద్వేషాన్ని ప్రేమతో జయించినవాడాయన. ఆయనే ఒక మూర్తీభవించిన భారతీయత. ఆయనను ప్రభుత్వాలు ప్రమోట్ చేయడమేమిటి? ఇన్నేళ్ల తర్వాత ఈ విషయంలో ప్రధాని వ్యాకులత చెందడం ప్రజలకు అసహజంగా అనిపించింది.
>
> మోదీజీ తీసిన 'గాంధీ బాణం' ఎన్నికల కోసమేనన్నది అందరికీ అర్థమవుతూనే ఉన్నది. ఈసారి ఎన్నికల ప్రచారంలో ఆయన ఊహించని కొత్త పుంతలు తొక్కారు. ఫైవ్ ట్రిలియన్ ఎకానమీ ఊసే లేదు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌పై చర్చే లేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని అటకపై నుంచి మళ్లీ కిందికి దించలేదు. విదేశాల నుంచి బ్లాక్ మనీని తీసుకొస్తానన్న పదేళ్ల కిందటి హామీని పొరపాటున కూడా మళ్లీ ప్రస్తావించలేదు. రైతులకు గిట్టుబాటు ధరలపై స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని పదేళ్ల కింద ఇచ్చిన హామీకి చెదలు పట్టాయి. కీలకమైన ప్రజాసమస్యల ప్రస్తావనకు సమయం సరిపోలేదు.

vardhelli1959@gmail.com

సందర్భం



కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సోనియమ్మ వల్లనే ప్రత్యేక తెలంగాణ

తెలంగాణ ప్రాంత ప్రజల సామూహిక స్వప్నం, సుదీర్ఘ ఆకాంక్ష, సబ్బండ జాతుల సమష్టి ధ్యేయం ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం! ఐదారు దశాబ్దాల కాలం అనేక రూపాల్లో కొనసాగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్ష... సోనియా గాంధీ వల్లనే సాధ్యమైంది.

రాష్ట్ర ఏర్పాటుకు అవసరమైన రాజకీయ ప్రక్రియకు అంకురార్పణ చేసి అంచెలంచెలుగా ఒక్కొక్క చిక్కుముడిని విప్పుకుంటూ, జాతీయస్థాయిలో అనేక సైద్ధాంతిక, భావ సారూప్యం లేని పార్టీల మధ్య విస్తృత అంగీకారం కుదిర్చి, తెలంగాణను సాధించి పెట్టారు సోనియాగాంధీ. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ద్వారా ఎంత రాజకీయ నష్టం కలిగినా సరే, చిరునవ్వుతో ఎదుర్కొని చారిత్రక నిర్ణయాన్ని ప్రకటించిన ఒకే ఒక్క ధీశాలి సోనియమ్మ.

తెలంగాణ ఏర్పాటు జరిగిన తర్వాత పదేళ్లలో సోనియమ్మ దయతోనే తెలంగాణ వచ్చిందనీ, సోనియమ్మ లేకుంటే తెలంగాణ లేదనీ అసెంబ్లీ సాక్షిగా చెప్పుకుంటూనే, ఆమె చరిత్రను చెరిపివేసే ప్రయత్నం జరిగింది. 2000 ఆగస్టు 11... చరిత్రను మలుపు తిప్పిన రోజు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక కీలకమైన రోజు.

ఏఐసీసీ అధ్యక్షురాలిగా, లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకురాలిగా బాధ్యతలు చేపట్టిన సోనియా గాంధీ, ఎన్ఎస్‌యూఐ సదస్సులో పాల్గొనడానికి వచ్చారు. నాటి పీసీసీ అధ్యక్షులు, శాసనసభ నాయకులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతో 41 మంది తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుతూ లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న సోనియా గాంధీకి వినతి పత్రం అందజేశారు. నూతనంగా శాసన సభ్యుడిగా ఎన్నికైన నేను కూడా ఆ బృందంలో ఒక సభ్యుడిని.

మా వినతి పత్రం స్వీకరించి, 'మీ సమస్యలు నాకు తెలుసు... తప్పకుండా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి ఆలోచిద్దాం' అని సోనియమ్మ సానుకూలంగా స్పందించిన తీరు తెలంగాణ రాజకీయ నాయకత్వానికి వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. ఇదే చరిత్రను మలుపు తిప్పిన రోజు. ఆ తర్వాత 41 మంది తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులం ఢిల్లీకి వెళ్లి ప్రణబ్ ముఖర్జీతో పాటు కాంగ్రెస్ పెద్దలను కలిసి తెలంగాణ అవసరాన్ని వివరించాం. తెలంగాణకు ప్రత్యేక పీసీసీ ఉండాలని ఢిల్లీ పెద్దలను కోరాము. ఆ తర్వాత సోనియా గాంధీ నాయకత్వంలోని ఏఐసీసీ నాటి ఎన్డీయే ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుతూ, రెండవ రాష్ట్ర పునర్విభజన సంఘాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ, ఇతర చిన్న రాష్ట్రాల సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరింది. కానీ అప్పటి హోంమంత్రి ఎల్ కే అద్వానీ ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చారు.

లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌లో నాడు తెలంగాణ శాసనసభ్యులకు ఇచ్చిన మాట, నాటి ఎన్డీయే ప్రభుత్వానికి ఏఐసీసీ అధ్యక్షురాలిగా ఆమె రాసిన లేఖల వల్ల సోనియాజీకి తెలంగాణ ఏర్పాటు పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. 2004లో టీఆర్ఎస్‌తో పొత్తు కుదిర్చిందే సోనియమ్మ. 1999లో తెలంగాణలో 41 స్థానాలు గెలిచి అనేక స్థానాల్లో తక్కువ మెజార్టీతో సీట్లు కోల్పోయి బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ 2004లో టీఆర్ఎస్‌తో ఎన్నికల పొత్తుకు చొరవ చూపించడానికి కారణం సోనియమ్మకు తెలంగాణ పట్ల ఉన్న అభిమానమే. 2004లో కరీంనగర్‌లో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి ఆమె విస్పష్ట ప్రకటన చేశారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణ పట్ల తన చిత్తశుద్ధిని అనేక విధాలుగా ప్రదర్శించింది.

సోనియా గాంధీ యూపీఏ చైర్ పర్సన్‌గా కామన్ మినిమం ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ గూర్చి ప్రస్తావించడం, యూపీఏ భాగస్వామ్య పక్షాలను ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలు, ప్రణబ్ ముఖర్జీ కమిటీ ఏర్పాటు, తదితర అంశాలన్నీ తెలంగాణ పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న వైఖరిని స్పష్టం చేశాయి.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆలస్యానికి కారణం కేసీఆరే! ఒకవైపు యూపీఏ భాగస్వామ్య పక్షాల మధ్య విస్తృత అంగీకారానికి సోనియా గాంధీ ప్రయత్నాలు చేస్తుంటే, తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న యూపీఏ అతిపెద్ద భాగస్వామ్య పార్టీ సీపీఎంనూ, ప్రధాన ప్రతిపక్షం బీజేపీని ఒప్పించడానికి ప్రయత్నాలు జరుగుతుంటే, ఎలక్షన్ కలెక్షన్ విధానానికి తెరలేపిన కేసీఆర్ దానికి ఉద్యమ రంగు పూశారు.

రెండోసారి కరీంనగర్ ఉప ఎన్నిక, 2007 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు వచ్చిన ఫలితాలు తెలంగాణ వాదం బలహీన పడిందనే వాదనలకు ఊతమిచ్చాయి. 2009లో ఆయన మహాకూటమి పేరిట తెలంగాణను తీవ్రంగా వ్యతిరేకించే తెలుగుదేశం, సీపీఎం లాంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడం, ఆ ఎన్నికల్లో ఘోరంగా దెబ్బ తినడం తదితర కారణాలు తెలంగాణ ఆలస్యానికి కారణమయ్యాయి.



తెలంగాణ కోసం పదవుల్ని తృణప్రాయంగా వదులుకున్నది కాంగ్రెస్ పార్టీ వారే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు అధిష్ఠానాన్ని ఎంతగా ధిక్కరించినా, ఏనాడు చర్యలు తీసుకోలేదు. దానికి కారణం తెలంగాణ ఏర్పాటు పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధే!

యూపీఏ భాగస్వామ్య పక్షాల మధ్య విస్తృత అంగీకారం కుదిర్చిన సోనియమ్మ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీని ఒప్పించడానికి కూడా ఎన్నో ప్రయత్నాలు చేసింది. 2009 డిసెంబర్ 9న చిదంబరం చేసిన ప్రకటన, తెలంగాణ రాష్ట్రానికి రోడ్డు మ్యాపు సుగమం చేస్తూ 'జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ' ఏర్పాటు, అద్వానీ, సుష్మా స్వరాజ్‌లను ప్రధాని మన్మోహన్ సింగ్ ఇంటికి భోజనానికి పిలిపించి, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదానికి సహకారాన్ని కోరిన సంగతి రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉన్నవారందరికీ తెలిసినవే కదా! సీడబ్ల్యూసీ తీర్మానం, జీవోఎం ఏర్పాటు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ఆమోదించి ఏపీ శాసనసభకు పంపడం, మూజువాణి ఓటుతో వీగిపోయిన ఆ తీర్మానాన్ని పట్టించుకోకుండా, సొంత పార్టీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ధిక్కార స్వరాన్ని, పార్లమెంట్‌లో బిల్లు రాకుండా సీమాంధ్ర ఎంపీలు ఇచ్చిన అవిశ్వాసాన్నీ ఖాతరు చేయకుండా, వారిని సస్పెండ్ చేసి ఇచ్చిన మాట కొరకు తెలంగాణ ఏర్పాటు చేసింది సోనియమ్మ.

తెలంగాణ అసలు ఉద్యమకారుల త్యాగాలనూ, కాంగ్రెస్ పార్టీ పాత్రనూ పేర్కొనకుండా చరిత్రకు కేసీఆర్ మసిపూసి మారేడుకాయ చేశారు. అయినా ప్రజలు కాంగ్రెస్ పార్టీని మరువలేదు. అందుకే 2023లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. కచ్చితంగా ఎందుకోసం ప్రజలు తెలంగాణ కోరుకున్నారో వాటన్నింటినీ నెరవేర్చుతుంది ఈ ప్రభుత్వం. అలాగే వక్రీకరణకు గురైన చరిత్రను సరిచేసి రాయవలసిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యావత్ తెలంగాణ ప్రజల పక్షాన సోనియమ్మకు హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు!

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు

సందర్భం



జూలకంటి రంగారెడ్డి

విభజన... అసమాన అంతరాలు పెంచడానికా?

రాష్ట్ర విభజన జరిగి జూన్ 2 నాటికి పదేళ్లు గడిచాయి. పాలకుల వైఫల్యం వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతాల మధ్య ఏర్పడిన అసమాన అభివృద్ధి విధానాలు విభజన తర్వాత కూడా కొనసాగుతున్నాయి. దశాబ్దాలుగా జరిగిన పోరాటాలు, ఉద్యమాలు, అమరవీరుల త్యాగాల నెత్తుటి మరకలను పాలకులు తమ తిరోగమన విధానాలతో తుడిపేస్తున్నారు. ఈ పదేళ్ల కేంద్ర ప్రభుత్వ పోకడ భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి గండి కొట్టేలా వెళ్లింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడదీసిన తర్వాత ఏర్పడే రెండు తెలుగు రాష్ట్రాలకు పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చకుండా తన పబ్బం గడుపుకోవడం మీదనే కేంద్రం దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి చివరికి ఎగ్గొట్టారు. తెలంగాణకు స్పెషల్ ప్యాకేజీ ప్రకటిస్తామని మొండిచేయి చూపించారు.

ఇక, విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కూడా పాక్షికంగానే అమలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని పూర్తి కావడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించకుండా ప్రేక్షక పాత్ర వహించింది. ఒక్క మాటలో చెప్పాలంటే రెండు రాష్ట్రాలను ఏర్పాటు చేశారు కానీ కేంద్ర ప్రభుత్వం చేయాల్సిన పనులు, నిర్వహించాల్సిన బాధ్యతలను నిర్వహించలేదు. పదేళ్ల పాటు చేతులు దులుపుకునే ప్రయత్నమే జరిగింది. కృష్ణా, గోదావరీ నదీజలాల వ్యవహారంలో ఎటూ తేల్చకపోగా, కేంద్రమే స్వయంగా గొడవలు పెడుతోంది. విద్యుత్ బకాయిల చెల్లింపులు, ఉద్యోగుల విభజన లాంటి ముఖ్యమైన అంశాలను కూడా తేల్చలేదు. ద్రవ్యలోటు పూడ్చే విధంగా ఆర్థికంగా ఆదుకోవాల్సిన కేంద్రం అసలు తాను ఇవ్వాల్సిన నిధులను కూడా ఇవ్వడం లేదు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించకపోగా, సాగునీటి రంగానికి ఉపయోగపడే విధంగా ఎలాంటి నిధులు ఇవ్వడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలను ఉపయోగించుకోవడమే తప్ప ఎనిమిది కోట్ల తెలుగు ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదు.

మలివిడత ఉద్యమంలో పాల్గొన్న వారెవరూ నాటి టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) పార్టీ అధికారంలో వుండగా ప్రాతినిధ్యంలోకి రాలేదు. చివరికి తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ కుటుంబ కృషిగానే మలిచే ప్రయత్నం చేశారు. దీని ఫలితమే టీఆర్ఎస్ గడిచిన 10 ఏళ్ల పాలన ఏకఛత్రాధిపత్యంగా సాగడానికి కారణమైంది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, దోపిడి, పీడనకు వ్యతిరేకంగా జరిగింది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛనూ, ప్రశ్నించే గొంతులనూ అణచివేస్తూ కేసీఆర్ నయా నిజాంలా వ్యవహరించారు.



పార్లమెంటులో విభజన చట్టంపై చర్చ జరుతున్న సందర్భంలో ప్రతిపక్షం (బీజేపీ) నుండి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విభజన హామీగా రెండు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. పోలవరం, ప్రాణహిత, చేవెళ్ళ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించి పూర్తి చేయాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారు మంత్రిగా, ఉపరాష్ట్రపతిగా ప్రధాన బాధ్యతలు చేపట్టి తను డిమాండ్ చేసిన ప్రత్యేక హోదాలు ఈ 10 ఏండ్లలో పట్టించుకోకుండా గాలికొదిలేశారు.

రెండు రాష్ట్రాల మధ్య ఇప్పటికీ నీటి యుద్ధం కొనసాగుతూనే వుంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీకి నీటిని క్రమబద్ధీకరించటం, రివర్ బోర్డు ఏర్పాటు, ద్రవ్యలోటు పూడ్చడం, ఉద్యోగులను సొంత రాష్ట్రాలకు పంపడం, ఆంధ్రలో కలిపిన ఏడు తెలంగాణ గ్రామాల ఉమ్మడి సమస్యలు వంటివి పరిష్కారం కాలేదు. తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ఎన్టీపీసీలో మిగిలివున్న 3 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి ముఖ్యమైన హామీలు అమలు జరుగలేదు. 9, 10 షెడ్యూల్‌లో వున్న 91 ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లలో 71 సంస్థలను విభజించినట్లు ప్రకటించి, నేటికీ ఉమ్మడిగానే కొనసాగిస్తున్నారు.

రాష్ట్రం ఏర్పడక ముందు పాలకుల విధానాల వల్ల ప్రాంతాలు, ప్రజల మధ్య ఏర్పడిన ఆర్థిక, సామాజిక అంతరాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రజలకు దీర్ఘకాలిక అభివృద్ధికి ఉపకరించే భూమి, ఉపాధి, నీటి వనరులు, ఉద్యోగాలు, వేతనాలు వంటి అంశాలను పట్టించుకోలేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా ప్రజల జీవితాల్లో అభివృద్ధి భూమిక ఏర్పడలేదు. భూములు పంచుతామన్న పాలకులు ఉన్న భూములను బినామీ పేర్లతో ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా మారారు. వ్యవసాయానికి ప్రోత్సాహం లేక చిన్న, మధ్యతరగతి రైతులు వ్యవసాయాన్ని వదులుకొని కార్పొరేట్ సంస్థల వద్ద అతితక్కువ వేతనాలకు వాచ్‌మెన్లుగా, గార్డెన్లలో పనిచేసే కూలీలుగా మారినారు.

తెలంగాణ ఏర్పడితే ఈ పరిస్థితులు వస్తాయని ప్రజలు భావించలేదు. ఉద్యోగాలు వస్తాయనీ, ఉపాధి సౌకర్యాలు మెరుగుపడుతాయనీ, అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి అయితే స్థానికంగా ఉపాధి పొందుతామనీ భావించారు. కానీ, వారి ఆశలు అడియాసలయ్యాయి. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య తీవ్రమైన అంతరాలు పెరుగుతూనే వున్నాయి. ఇది సామాజిక దోపిడి, వివక్షకు దారితీసింది. దీని ఫలితమే బీఆర్ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో గద్దెదించి, ప్రత్యామ్నాయంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజారంజక పాలన కొనసాగించవలసిన అవసరం వున్నది. రాష్ట్రంలో, దేశంలో అస్తిత్వ రాజకీయాల ప్రభావం పెరుగుతున్నది. ప్రజల ప్రధాన సమస్యలైన భూమి, కూలి, ఉద్యోగ సమస్యలను తీర్చాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సమర్థవంతంగా అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఏ ప్రయోజనాల కొరకైతే రాష్ట్రం ఏర్పడిందో ఆ లక్ష్యాన్ని నెరవేర్చాలి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వివిధ వర్గాల ప్రజల మధ్య అంతరాలు తగ్గించే విధంగా ప్రతిపక్షాలను పరిగణలోకి తీసుకొని తెలంగాణ అభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు తీసుకొని పరిపాలన సాగించాలి. రాష్ట్రాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి వైపు నడిపించాల్సిన బాధ్యత అధికార పార్టీపై వుంది. రెండు రాష్ట్రాల ప్రజలు ఆశించినట్టు ఇప్పటి నుంచైనా అధికారంలోకి వచ్చే, వచ్చిన పార్టీల ప్రభుత్వాలు, కేంద్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వం కలిసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధి కనబరచాలి.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు

(నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం. తిథి: బ.ఏకాదశి రా.1.22 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం: రేవతి రా.12.49 వరకు, తదుపరి అశ్విని. వర్జ్యం: ప.1.38 నుండి 3.07 వరకు. దుర్ముహూర్తం: సా.4.45 నుండి 5.37 వరకు. అమృతఘడియలు: రా.10.40 నుండి 12.10 వరకు; సూర్యోదయం: 5.28; సూర్యాస్తమయం: 6.27; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు; యమగండం: ప.12.00 నుండి 1.30 వరకు

తెలంగాణలో పోటాపోటీ!

కాంగ్రెస్, బీజేపీలకు అటూ ఇటుగా సమానంగా సీట్లిచ్చిన పలు సంస్థలు

- కొన్ని ఎగ్జిట్‌పోల్స్ బీజేపీ వైపు మొగ్గు
- దేశవ్యాప్తంగా మోదీ హవా ప్రభావం తెలంగాణలోనూ
- కాంగ్రెస్ పట్టు నిలుపుకొంటుందని చెప్పిన మరికొన్ని సంస్థలు
- తెలంగాణ లోక్‌సభ ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ ఉత్కంఠ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వెలువడుతున్న వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు భిన్నంగా, జాతీయపార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మధ్య తెలంగాణలో పోటాపోటీ వాతావరణం ఏర్పడేట్టు కనిపిస్తోంది. ఈ రెండుపార్టీలు నువ్వా, నేనా అన్నంత స్థాయిలో పోటీపడినట్టుగా ఆయా సంస్థల ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలోని మొత్తం 17 ఎంపీ సీట్లకు గాను.. బీజేపీ అధిక ఎంపీ సీట్లలో గెలుస్తుందని కొన్ని సంస్థలు అంచనా వేస్తే.. అదేస్థాయిలో అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందంటూ మరికొన్ని సంస్థలు లెక్క వేశాయి.

బీజేపీ, కాంగ్రెస్‌లు ఎన్నేసి గెలుస్తాయంటే..

ఇండియాటుడే- యాక్సిస్ మై ఇండియా ఏకంగా బీజేపీ 11–12 సీట్లలో, జన్‌కీబాత్ 9–12 సీట్లలో బీజేపీ గెలుపొందుతుందనిఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వెల్లడించాయి. బీజేపీ అధిక సీట్లు సాధిస్తుందని ఆరా(08–09), ఇండియాటీవీ-సీఎన్ఎక్స్ (08–10), న్యూస్ 18 సంస్థ (07–10) అంచనా వేశాయి. ఇక కాంగ్రెస్ పార్టీ అవకాశాలపై చాణక్య స్ట్రాటజీ సంస్థ 09–10,, ఏబీసీ-సీ ఓటర్ 07–09, పీపుల్స్ పల్స్ 07–09, ఆరా 07–08 స్థానాలు లెక్కన సర్వే ఫలితాలు వెల్లడించాయి.

మొత్తంగా వివిధ సంస్థల అంచనాల్లో...కొంచెం అటూ ఇటుగా బీజేపీ, కాంగ్రెస్‌లకు దాదాపు సగం సీట్ల మేర గెలుచుకోవచ్చనే విధంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వెల్లడైంది. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ ఇమేజీ ప్రభావంతో బీజేపీకి మంచి ఫలితాలు సాధిస్తుందనే అంచనాలు వెలువడ్డాయి. ఇక అన్ని సంస్థల ఎగ్జిట్‌పోల్స్ బీఆర్ఎస్‌కు నిరాశాజనక ఫలితాలే రాబోతున్నట్టుగా అంచనా వేస్తున్నాయి. దాదాపుగా అన్ని మెజారిటీ సర్వే సంస్థలు హైదరాబాద్ ఎంపీ సీటును ఎంఐఎం నిలుపుకుంటుందని పేర్కొనడం గమనార్హం.

వివిధసంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఇలా... (ఆయా పార్టీల సీట్ల గెలుపుపై అంచనాలు)

సర్వే సంస్థ	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	ఎంఐఎం
ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా	11-12	04-06	00-01	01
ఏబీసీ-సీ ఓటర్	07-09	07-09	00	01
ఆరా	08-09	07-08	00	01
ఇండియాటీవీ-సీఎన్ఎక్స్	08-10	06-08	01	01
న్యూస్ 18	07-10	05-08	02-05	00-01
పీపుల్స్ పల్స్	06-08	07-09	00-01	01
చాణక్య స్ట్రాటజీ	05-06	09-10	00-01	01
జన్‌కీబాత్	09-12	04-07	0-01	01

వైఎస్సార్‌సీపీదే ఏపీ



అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తూ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని సింహభాగం మీడియా, సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ తేల్చి చెప్పాయి. సంక్షేమాభివృద్ధి పథకాలు.. సుపరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెచ్చిన విప్లవాత్మక మార్పులకు జనం జై కొట్టారని స్పష్టం చేశాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కంటే మహిళలు 12 శాతం అధికంగా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి, ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడానికి దోహదం చేశారని ఆరా (మస్తాన్), చాణక్య (పార్థదాస్) తేల్చాయి. జాతీయ, రాష్ట్ర మీడియా, సర్వే సంస్థలు, సెఫాలజిస్టులు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్, పోస్ట్ పోల్స్ సర్వేలను క్రోడీకరించి శనివారం ఫలితాలను వెల్లడించాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆరా సంస్థ అధినేత మస్తాన్ నిర్వహించే సర్వే, ఎగ్జిట్ పోల్స్‌కు అత్యంత విశ్వసనీయత ఉంది. గతేడాది ఆఖర్లో తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని.. కామారెడ్డిలో అప్పటి సీఎం కేసీఆర్, ఇప్పటి సీఎం రేవంతరెడ్డిలు ఇద్దరూ ఓడిపోతారని.. బీజేపీ అభ్యర్థి కె.వెంకటరమణారెడ్డి విజయం సాధిస్తారని ఎగ్జిట్ పోల్, పోస్ట్ పోల్ సర్వేలో బల్లగుద్ది చెప్పారు. ఎన్నికల ఫలితాల్లో అదే వెల్లడైంది. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్, పోస్ట్ పోల్ సర్వేను ఆరా మస్తాన్ విస్తృత స్థాయిలో నిర్వహించారు. 49.41 శాతం (మహిళలు 54.76 శాతం, పురుషులు 45.35 శాతం) ఓట్లతో 94 నుంచి 104 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని తాము నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్, పోస్ట్ పోల్ సర్వేల్లో వెల్లడైందని ఆరా మస్తాన్ వెల్లడించారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి 47.55 శాతం ఓట్లతో 71–81 శాసనసభ స్థానాలకే పరిమితం అవుతుందని తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాల్లో 13–15 సీట్లలో వైఎస్సార్‌సీపీ, 10–12 స్థానాల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని వెల్లడించారు. సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలు.. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దకే ప్రజలకు అందించడం వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి దోహదం చేశాయని ఆరా మస్తాన్ స్పష్టం చేశారు. మహిళలు సీఎం జగన్ నాయకత్వానికి బ్రహ్మరథం పట్టడం వల్ల ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని తేల్చి చెప్పారు. ప్రతిష్టాత్మక చాణక్య సంస్థ అధినేత పార్థదాస్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లోనూ అదే వెల్లడైంది. 50 శాతం ఓట్లతో 110–120 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, అధికారంలోకి రావడం ఖాయమని తేల్చి చెప్పారు. ఎన్డీఏ కూటమి 55–65 స్థానాలకే పరిమితమవుతుందని స్పష్టం చేశారు. ఆత్మసాక్షి, రేస్, ఆపరేషన్ చాణక్య, పోల్ స్ట్రాటజీ, అగ్నివీర్, పోల్ లాబొరేటరీ, జన్మత్ పోల్, సీపీఎస్ తదితర సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని వెల్లడైంది. కాగా, టైమ్స్ నౌ ఈటీజీ సంస్థ రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లలో వైఎస్సార్‌సీపీ 11 సీట్లలో కూటమి విజయం సాధిస్తుందని స్పష్టం చేసింది.

బీజేపీ బాణీ విన్పించిన జాతీయ మీడియా

దేశ వ్యాప్తంగా పార్లమెంట్ స్థానాల్లో జాతీయ మీడియా బీజేపీ బాణీ వినిపించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సింహభాగం స్థానాల్లో విజయం సాధిస్తుందని.. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని జోస్యం చెప్పాయి. ఇండియా టుడే, ఎన్డీటీవీ, న్యూస్-18 వంటి జాతీయ మీడియా సంస్థలు ఎన్డీఏకే పట్టం కడుతూ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వెల్లడించాయి. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఎన్డీఏకు 400 లోక్‌సభ స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేస్తే.. ఒకట్రెండు జాతీయ మీడియా సంస్థలు ఎన్డీఏకు 401 స్థానాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడించడం గమనార్హం.

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పిన జాతీయ మీడియా లెక్కలు

గతేడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు పూర్తిగా తప్పాయి. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా, ఎన్డీటీవీ, ఈటీజీ, జన్‌కీ భాత్, పోల్‌స్టార్, టుడేస్ చాణక్య, మ్యాట్రిజ్, సీ ఓటర్, సీఎన్ఎక్స్, దైనిక్ భాస్కర్ తదితర సంస్థలు తేల్చి చెప్పాయి. కానీ ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, అధికారంలోకి వచ్చింది. జాతీయ మీడియా సంస్థలు రాష్ట్రంలో ప్రజల నాడి పట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నది ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ఫలితాలతో నిరూపితమైంది.

ఫలితాలు వెల్లడించొద్దంటూ సెఫాలజిస్టులపై ఒత్తిళ్లు

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ.. ఏ పార్టీ బలం పుంజుకుంది.. ఏ పార్టీ విజయం సాధిస్తుందన్నది కచ్చితంగా అంచనా వేయగలిగే సెఫాలజిస్టులు పదుల సంఖ్యలో ఉన్నారు. వారు తమ సంస్థల ద్వారా రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించి, శనివారం ఫలితాలను వెల్లడించేందుకు సిద్ధమయ్యారు. ఆ సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని వెల్లడైందని తెలుసుకున్న టీడీపీ నేతలు.. వాటిని వెల్లడించవద్దంటూ సెఫాలజిస్టులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఆ ఒత్తిళ్లకు తలొగ్గిన ఓ సెఫాలజిస్టు ఫలితాలను తారుమారు చేసి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ 93 స్థానాల్లో, టీడీపీ కూటమి 80 స్థానాల్లో, ఇతరులు రెండు స్థానాల్లో విజయం సాధిస్తారని తాము నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైతే.. టీడీపీ నేతల ఒత్తిడి తాళలేక వాటిని తారుమారు చేసి చెప్పాల్సి వచ్చిందని వాపోయినట్లు ఆయన సన్నిహితులు వెల్లడించారు. దీన్ని బట్టి చూస్తే కౌంటింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడైనా సరే దొడ్డిదారిన విజయం సాధించడానికి టీడీపీ కుట్రలు చేస్తోందని మరోసారి నిరూపితమైంది.

సర్వే సంస్థ	వైఎస్సార్‌సీపీ	కూటమి
ఆరా	94-104	71-81
పార్థదాస్ (చాణక్య)	110-120	55-65
సీపీఎస్	97-108	66-78
పోల్ స్ట్రాటజీ గ్రూప్	115-125	50-60
ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్	119	56
ఆత్మసాక్షి	98-116	59-77
రేస్	117-128	48-58
అగ్నివీర్	124-128	46-49
జన్‌మత్	95-103	67-75
ఆపరేషన్ చాణక్య	95-102	64-68

ఎగ్జిట్ పోల్స్‌లోనూ వైఎస్సార్‌సీపీకి సానుకూలత

- సీఎం జగన్ పాజిటివ్ ప్రచారం ఎన్నికల్లో బాగా పనిచేసింది
- మహిళా ఓటర్లు మా వైపే నిలబడ్డారని స్పష్టమైంది: సజ్జల

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీ సీఎంగా రెండోసారి వైఎస్ జగనే

- పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు
- మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు



డిచ్‌పల్లి (నిజామాబాద్ రూరల్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి పదవి చేపట్టడం ఖాయమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ శివారులోని హోటల్ కృష్ణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలోని తన స్నేహితులు, బంధువుల నుంచి అందిన సమాచారం మేరకు జగన్ మళ్లీ సీఎం అవుతారని, ఎగ్జిట్ పోల్స్ కూడా అవే చెబుతున్నాయన్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నామన్నారు.

బీఆర్ఎస్ గల్లంతు..

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదని, జూన్ 4న ఫలితాల తర్వాత తెలంగాణలో ఆ పార్టీ అడ్రస్ గల్లంతు కానుందని కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో నిజామాబాద్‌తో పాటు కాంగ్రెస్ 13 ఎంపీ సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీగా కవితను గెలిపిస్తే లిక్కర్ దందాతో ఢిల్లీలో తెలంగాణ పరువు తీసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ఆగస్ట్ 15 నాటికి రైతులకు రూ.2 లక్షలు రుణ మాఫీ చేసి తీరుతామన్నారు. రాష్ట్ర చిహ్నం, గీతంపై ఎలాంటి వివాదం లేదని, దీనిపై పనిలేని వాళ్లు రాద్ధాంతం చేస్తున్నారని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతమంది జైలుకు వెళ్తారనేది త్వరలోనే తెలుస్తుందన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు మించి సీట్లు సాధిస్తాం

బీజేపీ నేత ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై వస్తున్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాల కంటే ఎక్కువగా తమ పార్టీకి సీట్లు వస్తాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా 350 – 370 సీట్లు బీజేపీకి, మిత్ర పక్షాలకు రాబోతున్నాయని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయన్నారు. 4న వెలువడనున్న ఫలితాల్లో తెలంగాణలో బీజేపీ 10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఈటల బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆరు మాసాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ కరెంట్ కోతలపై బుకాయించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

చంద్రబాబు ఏజెంట్ రేవంత్

పాశం యాదగిరి



పంజగుట్ట (హైదరాబాద్): తెలంగాణలో జరిగే అన్ని పరిణామాలకూ సూత్రధారి చంద్రబాబు నాయుడు, పాత్రధారి రేవంత్‌రెడ్డి అని సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ ఉద్యమకారుడు పాశం యాదగిరి అన్నారు. చంద్రబాబు ఏజెంట్ రేవంత్ రెడ్డి అని ఆయన ఆరోపించారు. తెలంగాణ సినీ మ్యుజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కళాకారుల ఆత్మగౌరవ గర్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కళాకారుడు, కానిస్టేబుల్ మద్దెల క్రిష్ణబాబు గౌడ్ రూపొందించిన 'వందనాలు వందనాలు తెలంగాణ తల్లి'ఆడియో సీడీని వేదికపై ఆవిష్కరించారు. పాశం యాదగిరి మాట్లాడుతూ .. తెలంగాణ గొంతుక గద్దర్‌పై కాల్పులు జరిపించిన చరిత్ర, బెల్లిలలిత లాంటి తెలంగాణ ఉద్యమకారిణి, గాయణిని 17 ముక్కలు చేయించిన ఘనత చంద్రబాబుదే అని ఆరోపించారు. తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, తెలంగాణ సినీ మ్యుజీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లెపల్లి మోహన్, సినీ దర్శకులు ప్రేమ్‌రాజ్, సినీ నిర్మాత ఆలూరి సుధాకర్, సంగీత దర్శకులు విష్ణుకిషోర్‌లు మాట్లాడుతూ .. తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రసమయి, దేశపతి శ్రీనివాస్ తెలంగాణ కళాకారులకు అడ్డుపడితే, ఇప్పుడు కాంగ్రెస్‌లో అందెశ్రీ అనుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైట్ హౌస్‌ను సందర్శించిన బృహత్ సోమ సహా స్పెల్ బీ ఫైనలిస్టులు



వాషింగ్టన్: ప్రఖ్యాత స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ విజేత భారతీయ అమెరికన్ బృహత్ సోమ(12), మరో ఏడుగురు ఇతర ఫైనలిస్టులు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమిది. వీరందరికీ అధ్యక్ష భవనాన్ని సందర్శించే అరుదైన అవకాశం లభించింది. ఫ్లోరిడాకు చెందిన సెవెన్త్ గ్రేడ్ విద్యార్థి బృహత్ సోమ గురువారం జరిగిన స్క్రిప్స్ స్పెల్ బీ తుది పోరులో 90 సెకన్ల సమయంలో 30 పదాలకుగాను 29, తన ప్రత్యర్థి ఫైజాన్ జకి కంటే 9 పదాలను కరెక్టుగా చెప్పి విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఫైనల్‌కు చేరుకున్న మిగతా ఏడుగురిలో నలుగురు భారతీయ అమెరికన్ చిన్నారులే కావడం. వీరు కాలిఫోర్నియాకు చెందిన రిషబ్ సాహ(14), శ్రేయ్ పారిఖ్(12), కొలరాడోకు చెందిన అదితి ముత్తుకుమార్(13), నార్త్ కరోలినాకు చెందిన అనన్య రావ్ ప్రసన్న(13). తల్లిదండ్రులతో కలిసి వచ్చిన వీరందరికీ వైట్ హౌస్ సౌత్ లాన్స్‌లో జరిగిన వేడుకకు అధికారులు ఆహ్వానం పలికారు. ఇదే కార్యక్రమానికి హాజరైన సూపర్ బౌల్ చాంపియన్ కాన్సాస్ సిటీ చీఫ్స్ జట్టుకు అధ్యక్షుడు జో బైడెన్ స్వాగతం పలికారు. స్పెల్ బీ ఫైనలిస్ట్‌లకు అధ్యక్షుడు బైడెన్‌తో మాట్లాడేందుకు అవకాశం రాలేదు. కానీ, వారంతా అధ్యక్ష భవనం పరిసరాల్లో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.



కాషాయ 'గట్టు'

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు కాషాయమయంగా మారింది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం అర్ధరాత్రి వరకు సుమారు రెండు లక్షల మంది మాలధారులు, భక్తులు తరలివచ్చారు. దీంతో దర్శనం, మాల విరమణకు మూడు గంటల సమయం పట్టింది. భక్తులను అదుపు చేసేందుకు పోలీసులు అవస్థలు పడ్డారు. పెద్ద జయంతి ఉత్సవాలు ఆదివారం మధ్యాహ్నంతో ముగియనున్నాయి.

'లోగో మార్చినట్లే పట్టణాల పేర్లనూ మార్చాలి'



సాక్షి,హైదరాబాద్: రాచరికపు ఆనవాళ్లున్నాయని ప్రభుత్వ లోగోను మారుస్తున్నట్లే అలాంటి ఆనవాళ్లు ఉన్న కొన్ని జిల్లాలు, పట్టణాల పేర్లనూ మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశా రు. ఆదిలాబాద్‌ను ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్ ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్‌ను మానుకోటగా మార్చాలని ప్రభుత్వానికి సూచించారు. బీజేపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పేర్లను కాంగ్రెస్ సర్కారు అధికారికంగా పునరుద్ధరించి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని సూచించారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సోనియాను ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వానికి.... తెలంగాణ ఏర్పాటుకు కీలకంగా వ్యవహరించిన బీజేపీ నేతలను విస్మరించడం సరికాదన్నారు.

సీఎం జగన్‌కు ఘనస్వాగతం

- విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి
- స్వాగతం పలికిన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



సాక్షి, అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): కుటుంబ సమేతంగా విదేశీ పర్య టనను పూర్తి చేసుకుని శనివారం రాష్ట్రా నికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో ఘనస్వాగతం లభించింది. లండన్ నుండి ఆయన తెల్లవారుజామున 5.07 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఎంపీలు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో పోటీచేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, ముఖ్య నాయకులు, సలహాదారులు సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు.

రేపే టీఎస్ లాసెట్-2024

- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ లాసెట్–2024 సోమవారం జరగనుంది. పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించరని లాసెట్–2024 కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చని పేర్కొన్నారు.

తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు రూ.4,986 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: జీఎస్టీ వసూళ్లు మే నెలలో రూ.1.73 లక్షల కోట్లుగా నమోదైనట్టు కేంద్ర ఆర్థిక శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గతేడాది మే నెలతో పోలిస్తే 15 శాతం వసూళ్లు అధికంగా వచ్చినట్లు తెలిపింది. ఏపీలో గతేడాది కంటే 15శాతం అధికంగా రూ.3890 కోట్లు, తెలంగాణలో గతేడాది కంటే 11 శాతం అధికంగా రూ.4,986 కోట్ల వసూళ్లు సాధించినట్లు వివరించింది.

హైకోర్టులో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నేడు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలు ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరుగుతాయని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. న్యాయవాదులంతా తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో కోరారు.

ఏపీలో మళ్లీ వైఎస్సార్‌సీపీ

పక్కా తేల్చి చెప్పిన క్యూ మెగా ఎగ్జిట్ పోల్ సర్వే

పంజగుట్ట: ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 120కి పైగా అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకుని మరోమారు అధికారం చేపట్టడం ఖాయమని క్యూ మెగా అమేజీ పొలిటికల్ సొల్యూషన్స్ సీఈవో ఖాదర్ ఖాన్ పఠాన్ తెలిపారు. 22 పార్లమెంట్ స్థానాలు పక్కాగా వైసీపీ కైవసం చేసుకుంటుందని మరో రెండు స్థానాల్లో గట్టి పోటీ ఉందని అవి కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎగ్జిట్ పోల్ సర్వే 2024 రిపోర్టును పఠాన్ విడుదల చేశారు. ప్రతి పేద, మధ్య తరగతి వారి ఇంటికి సంక్షేమ పథకాలు అందడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ వైపు నిలిచారని తెలిపారు. చంద్రబాబు ఆఖరినిమిషంలో బీఫాంలు మార్చడం, ఎన్నికల కోడ్ వచ్చాక వాలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టించి సంక్షేమ పథకాలు ఇంటికి రాకుండా చెయ్యడం, బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ఎంతో నష్టం చేకూరిందన్నారు. పులివెందులలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 60 వేలకు పైగా భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఆయన తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిపించాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ డిమాండ్
- విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ లేఖ



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్.. సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలోకి సీబీఐని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలన్నారు. ట్యాపింగ్ ద్వారా ప్రతిపక్షాలపై సైబర్దాడికి కారకులైన కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులిచ్చి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బండి సంజయ్ శనివారం ముఖ్యమంత్రికి బహిరంగలేఖ రాశారు. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిద్దరూ ఎమ్మెల్యే పదవులకు అనర్హులని, ఈ మేరకు స్పీకర్‌కు సీఎం లేఖ రాయాలన్నారు. విపక్షాలను దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా కేసీఆర్, కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించారని విచారణలో తెలిసినా.. ఇంతవరకు వారికి కనీసం నోటీసులు ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు కూడా చేతులు మారినట్లు తెలుస్తోందని సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేసీఆర్ కుటుంబాన్ని కాంగ్రెస్ కాపాడే యత్నాలు చేస్తోందనే చర్చతో ప్రజల్లో ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతిన్నదన్నారు.

ఏఐసీసీకి రాష్ట్రం ఏటీఎంగా మారింది

ఏఐసీసీకి తెలంగాణ రాష్ట్రం ఏటీఎంగా మారిందని బండి సంజయ్ ఆరోపించారు. కేసీఆర్ ఢిల్లీకి వచ్చి కాంగ్రెస్ అధినాయకత్వాన్ని ఒప్పించి, మెప్పించారు కాబట్టే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి వస్తోందని, అందుకే ఆయా కేసుల విచారణ ముందుకు వెళ్లడం లేదన్నారు. శనివారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్‌ను విలీనం చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. దశాబ్ది వేడుకలకు సోనియాను ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి, తెలంగాణ బిల్లు ఆమోదంలో కీలకపాత్ర పోషించిన బీజేపీ నాయకులను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. కాగా, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు

- రాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్
- పార్టీ కార్యాలయంలో బీజేపీ ఉన్నతస్థాయి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: పార్టీలో పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు అంటూ తేడాల్లేవని, పార్టీ పురోగతికి ఎవరు పాటుపడుతున్నారనేదే ముఖ్యమని రాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం, అభ్యర్థుల గెలుపు కోసం ఎవరెవరు పనిచేశారన్న దాని ప్రాతిపదికనే రాబోయే రోజుల్లో పార్టీపరంగా గుర్తింపు, పదవులు లభిస్తాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి భవిష్యత్ ఉంటుందని పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ చెప్పారు. శనివారం ఉదయం నుంచి రాత్రి దాకా పార్టీ కార్యాలయంలో జరిగిన నాలుగు వేర్వేరు సమావేశాల్లో... లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలిచే సీట్లు, అభ్యర్థుల ప్రభావంపై సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ఎన్నికలు.. పార్టీ పరిస్థితిపై జాతీయ నాయకత్వానికి అభయ్ పాటిల్ నివేదిక సమర్పించనున్నారు. ఈ భేటీల్లో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నేతలు చంద్రశేఖర్ తివారీ, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు, ఎస్.రామచంద్రరావు, పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటి మోహన్‌రావు పాల్గొన్నారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులతో జరిగిన సమావేశంలో బీబీపాటిల్, ఎం.రఘునందన్‌రావు, బూర నర్సయ్యగౌడ్, గోడెం నగేశ్, ఎస్.సైదిరెడ్డి, భరత్‌ప్రసాద్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో ఎన్డీఏ హ్యాట్రిక్

ఎగ్జిట్ పోల్స్ అంచనా

- ఎన్డీఏకు 350 నుంచి 400
- ఇండియా కూటమికి 200లోపే
- కాంగ్రెస్ 40 నుంచి 70కు పరిమితం



న్యూఢిల్లీ: కేంద్రంలో పాలక ఎన్డీఏ కూటమిదే మళ్లీ అధికారమని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. భారీ మెజారిటీతో కూటమి హ్యాట్రిక్ కొట్టడం, నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధాని కావడం ఖాయమని అభిప్రాయపడ్డాయి. శనివారం సాయంత్రం సార్వత్రిక ఎన్నికల తుది విడత పోలింగ్ ముగుస్తూనే ఎగ్జిట్ పోల్స్ వెల్లువెత్తాయి. గుజరాత్, మధ్యప్రదేశ్‌ల్లో మరోసారి బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని వాటిలో చాలావరకు పేర్కొన్నాయి. కర్నాటకలో కూడా బీజేపీ హవాయే కొనసాగుతుందని, పశ్చిమబెంగాల్లో మరింతగా చొచ్చుకుపోతుందని వెల్లడించడం విశేషం. బిహార్, రాజస్తాన్, హరియాణాల్లో మాత్రం ఎన్డీఏకు సీట్లు కాస్త తగ్గుతాయని అంచనా వేశాయి. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. విపక్షాల అవకాశవాద రాజకీయాలను జనం పూర్తిగా తిరస్కరించారన్నారు. వాస్తవ ఫలితాల్లో తమకు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి వస్తాయని ధీమా వెలిబుచ్చారు. కాంగ్రెస్ మాత్రం ఎగ్జిట్ పోల్స్‌ను మోదీ ప్రభావితం చేశారని ఆరోపించింది. వాస్తవ ఫలితాలు చాలా భిన్నంగా రాను న్నాయని విశ్వాసం వెలిబుచ్చింది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డ నేపథ్యంలో ఇప్పుడిక అందరి కళ్లూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు జరిగాక రాబోయే అసలు ఫలితాలపైనే కేంద్రీకృతమయ్యాయి.

ఏ సర్వే ఏం చెప్పింది...?

ఇండియాటుడే-మై యాక్సిస్ ఎగ్జిట్ పోల్ ఎన్డీఏకు 361 నుంచి 401 స్థానాలిచ్చింది. ఇండియా కూటమికి 131 నుంచి గరిష్ఠంగా 166 రావచ్చని తెలిపింది. ఎన్డీఏకు 368 దాకా వస్తాయని రిపబ్లిక్ భారత్–మార్టైజ్ సర్వే పేర్కొంది. ఇండియా కూటమికి 133, ఇతరులకు 48 రావచ్చని తెలిపింది. ఎన్డీఏకు 392 దాకా, ఇండియాకు 161, ఇతరులకు 20 దాకా రావచ్చని జన్ కీ బాత్ అభిప్రాయపడింది. ఎన్డీఏకు బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్న మేరకు 401 స్థానాలు దక్కుతాయని ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ అంచనా వేయడం విశేషం. ఇండియా కూటమికి 139, ఇతరులకు 38 స్థానాలు రావచ్చని తెలిపింది. టుడేస్ చాణక్య కూడా కూడా ఎన్డీఏకు 385 నుంచి ఏకంగా 415 సీట్లిచ్చింది! ఇండియా కూటమి 96 నుంచి 118 మధ్య సాధిస్తుందని పేర్కొంది. న్యూస్ నేషన్ ఎన్డీఏకు 378, ఇండియా కూటమికి 169 స్థానాలిచ్చింది. దైనిక్ భాస్కర్ ఎన్డీఏ కూటమికి 350 దాకా, ఇండియా కూటమికి గరిష్ఠంగా 201, ఇతరులకు 49 సీట్లిచ్చింది. రిపబ్లిక్ టీవీ సర్వేలో ఎన్డీఏకు 359, ఇండియాకు 154, ఇతరులకు 30 స్థానాలొచ్చాయి. ఏబీపీ న్యూస్-సీ వోటర్ ఎన్డీఏకు 353–383, ఇండియాకు 152 నుంచి 182 సీట్లిచ్చింది. ఎన్డీఏకు 371, ఇండియాకు 125 రావచ్చని ఇండియా న్యూస్ పేర్కొంది. టైమ్స్ నౌ–ఈటీజీ సర్వే ఎన్డీఏకు 358, ఇండియా కూటమికి 152 స్థానాలిచ్చింది.

2019లో ఏం జరిగింది?

2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ ఎన్డీఏ గెలుస్తుందనే జోస్యం చెప్పాయి. మొత్తం 13 ఎగ్జిట్ పోల్స్ సగటును చూస్తే ఎన్డీఏకు 306, యూపీఏకు 120 సీట్లొస్తాయని పేర్కొన్నాయి. చివరికి ఎన్డీఏకు 353 స్థానాలు రాగా యూపీఏ కేవలం 93 సీట్లతో సరిపెట్టుకుంది. బీజేపీకి సొంతంగానే 303 స్థానాలు రాగా కాంగ్రెస్ కేవలం 53 సీట్లు నెగ్గింది.

రాష్ట్రాల్లో ఇలా...

కేంద్రంలో అధికార సాధనకు అత్యంత కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌పై బీజేపీ మరోసారి పట్టు నిలుపుకుంటోందని సర్వేలన్నీ తెలిపాయి. బీజేపీకి యూపీలో ఏకంగా 67 సీట్ల దాకా రావచ్చని ఇండియాటుడే వెల్లడించింది. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ సింగిల్ డిజిట్లకే పరిమితమవుతాయని తెలిపింది. కర్నాటకలో ఈసారి కూడా బీజేపీకి 23, భాగస్వామి జేడీ(యూ)కు 3 సీట్లు వస్తాయని తెలిపింది. ఇక పశ్చిమబెంగాల్లోనైతే పాలక తృణమూల్ కాంగ్రెస్‌ను తోసిరాజని 23 నుంచి 27 స్థానాలతో బీజేపీ తొలిసారిగా రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా అవతరించనుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఇండియాటుడే అయితే బెంగాల్లో బీజేపీకి 30 పైచిలుకు, తృణమూల్‌కు 11 నుంచి 12 స్థానాలివ్వడం విశేషం. కీలకమైన మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమికి సీట్లు 2019తో పోలిస్తే కాస్త తగ్గి 30 నుంచి 32 దాకా రావచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. సర్వత్రా ఆసక్తి నెలకొన్న ఒడిశాలోనైతే 21 సీట్లకు గాను ఎన్డీఏకు ఏకంగా 18 నుంచి 20 వస్తాయని, అధికార బిజూ జనతాదళ్ ఒకట్రెండు సీట్లకు మించబోదని ఇండియాటుడే పేర్కొనడం విశేషం. దక్షిణాదిన కేరళలోనూ తొలిసారి కమలవికాసం ఖాయమని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. అక్కడ బీజేపీకి 3 సీట్ల దాకా ఖాయమని పేర్కొన్నాయి. లెఫ్ట్ ఫ్రంట్ కుదేలవుతుందని, కాంగ్రెస్‌కే మెజారిటీ సీట్లు వస్తాయని తెలిపాయి. రాజస్తాన్, బిహార్లలో ఎన్డీఏకు ఐదారు స్థానాలు తగ్గి ఆ మేరకు ఇండియా కూటమికి పెరగవచ్చని పేర్కొన్నాయి. ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడమే గాక మెజారిటీ లోక్‌సభ స్థానాలూ నెగ్గుతుందని కొన్ని ఎగ్జిట్ పోల్స్, ఎన్డీఏ కూటమిదే విజయమని మరికొన్ని పేర్కొన్నాయి. తెలంగాణలో బీజేపీకే ఎక్కువ లోక్‌సభ స్థానాలొస్తాయని తెలిపాయి.



శనివారం కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ప్రధాని మోదీ

ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

సాక్షి, చెన్నై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యానం విరమించారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలో వివేకానంద రాక్ మెమోరియల్ ధ్యాన మండపంలో గురువారం సాయంత్రం మొదలైన మోదీ ధ్యానం శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ముగిసింది. ఆయన దాదాపు 45 గంటలపాటు ధ్యానంలో నిమగ్నమయ్యారు. రెండు రోజులపాటు కేవలం ద్రవాహారం తీసుకున్నారు. ధ్యానం ముగిసిన తర్వాత మోదీ రాక్ మెమోరియల్ నుంచి పడవలో అక్కడికి సమీపంలోని తమిళ కవి తిరువళ్లువర్ విగ్రహం కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. తిరవళ్లువర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తీరానికి చేరుకున్న మోదీ హెలికాప్టర్‌లో తిరువనంతపురం బయలుదేరివెళ్లారు. అక్కడి నుంచి ఢిల్లీకి చేరుకున్నారు.

మరోసారి ఎన్డీఏకే పట్టం

'ఎక్స్'లో ప్రధానమంత్రి మోదీ

న్యూఢిల్లీ: కేంద్రంలో మరోసారి ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టబోతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. అవకాశవాద 'ఇండియా' కూటమిని ప్రజలు నమ్మలేదని పేర్కొన్నారు. విపక్ష కూటమి తిరోగమన రాజకీయాలను జనం తిరస్కరించారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆఖరి విడత పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో ప్రధాని మోదీ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. తమ ప్రభుత్వ ట్రాక్ రికార్డును ప్రజలు చూశారని, తమకు మళ్లీ అధికారం అప్పగించబోతున్నారని వెల్లడించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలతో మన దేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజల క్రియాశీల భాగస్వామ్యమే మూలస్తంభమని ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు తోడ్పడిన భద్రతా దళాలకు సైతం ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇండియా కూటమికి 295 సీట్లకు పైనే

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా
- ఖర్గే నివాసంలో 'ఇండియా' కూటమి నేతల భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి 295కుపైగా స్థానాలు కచ్చితంగా లభిస్తాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలు తెలుసున్న తర్వాతే ఈ సంఖ్య చెబుతున్నామని వెల్లడించారు. తమది ప్రజల సర్వే అని, బీజేపీది ప్రభుత్వ సర్వే అని చెప్పారు. శనివారం ఢిల్లీలో ఖర్గే నివాసంలో ఇండియా కూటమి పార్టీల అగ్రనేతలు సమావేశమయ్యారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫలితాల సరళి, ఆ తర్వాత అనుసరించాల్సిన వ్యూహాలపై రెండున్నర గంటలపాటు విస్తృతంగా చర్చించారు. ఈ భేటీలో మల్లికార్జున ఖర్గేతోపాటు కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కె.సి.వేణుగోపాల్ పాల్గొన్నారు. ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ ముఖ్య నాయకుడు తేజస్వీ యాదవ్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, రాఘవ్ చద్దా, జేఎంఎం నాయకులు చంపయ్ సోరెన్, కల్పనా సోరెన్, డీఎంకే నేత టి.ఆర్.బాలు, జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత ఫరూక్ అబ్దుల్లా, సీపీఐ నాయకుడు డి.రాజా, సీపీఐ(ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం స్టాలిన్, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ హాజరు కాలేదు. సమావేశం అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని విమర్శించారు. ఫలితాల పేరిట బీజేపీ మీడియా మిత్రులు తప్పుడు అంకెలను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిచే అవకాశాలు ఎంతమాత్రం లేవని స్పష్టం చేశారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం పూర్తయ్యేదాకా కౌంటింగ్ హాళ్ల నుంచి బయటకు వెళ్లొద్దంటూ తమ పార్టీ కార్యకర్తలను ఆదేశించామని ఖర్గే తెలిపారు. ఇండియా కూటమిలో తామంతా ఐక్యంగా ఉన్నామని, తమను విభజించే ప్రయత్నం చేయవద్దని మీడియాను కోరారు.

బీజేపీ 220 సీట్లకే పరిమితం: కేజ్రీవాల్

ఈ ఎన్నికల్లో ఇండియా కూటమికి 295కుపైగా, బీజేపీకి 220 సీట్లు వస్తాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మొత్తం 235 స్థానాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వ ఏర్పాటు దిశగా తమ కూటమి ముందుకు సాగుతోందని తెలిపారు.

మళ్లీ వాయిదా పడిన బోయింగ్ రోదసీ యాత్ర

కేప్ కనావెరల్: భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ రోదసీ యాత్ర మరోసారి ఆగింది. బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో రోదసీలోకి వ్యోమగాములు వెళ్లేందుకు ఉద్దేశించిన ప్రయోగం శనివారం చివరినిమిషంలో వాయిదాపడింది. అమెరికాలోని కేప్ కనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి నింగిలోకి దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న అట్లాస్ 5 రాకెట్ కౌంట్‌డౌన్‌ను ఇంకా మూడు నిమిషాల 50 సెకన్లు ఉందనగా కంప్యూటర్ ఆపేసింది. ప్రయోగం ఆపేయడానికి కారణాలు ఇంకా వెల్లడికాలేదు. మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో కలిసి సునీత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు వెళ్లాల్సి ఉంది. ఆదివారంలోగా మరోసారి ప్రయోగానికి ప్రయత్నిస్తామని యునైటెడ్ లాంచ్ అలయన్స్ ఇంజనీర్ డిలియన్ రైస్ చెప్పారు. ప్రయోగం ఆగిపోవడంతో క్యాప్సూల్‌లోని సునీత, విల్మోర్‌లను టెక్నీషియన్లు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.



ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్.. హిమాచల్‌ప్రదేశ్‌లోని తషిగంగ్ వద్ద బారులు తీరిన ఓటర్లు

ఏడో విడతలో 62 శాతం పోలింగ్

- 57 స్థానాలకు ముగిసిన ఓటింగ్
- బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు
- చివరి విడతతో ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

న్యూఢిల్లీ/కోల్‌కతా/దుమ్కా: ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య పండగగా పేరొందిన భారత సార్వత్రిక ఎన్నికల పర్వం శనివారంతో ముగిసింది. లోక్‌సభ ఎన్నికల్లో చివరిదైన ఏడో దశ పోలింగ్ శనివారం పూర్తయింది. శనివారం రాత్రి 11.50 గంటలకు అందిన సమాచారం మేరకు 62 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నిర్ణీత పోలింగ్ సమయం ముగిసేలోపు క్యూ లైన్లలో నిల్చున్న వారిని ఓటింగ్‌కు అనుమతించారు. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముంది. ఏడో దశలో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతం సహా ఏడు రాష్ట్రాల్లోని 57 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. మూడోసారి అధికారం చేపట్టాలని ఉవ్విళూరుతున్న ప్రధాని మోదీ పోటీచేసిన వారణాసి నియోజకవర్గంలోనూ శనివారం పోలింగ్ నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 73.47 శాతం పోలింగ్ నమోదైంది. తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ దక్షిణ కోల్‌కతాలోని భవానీపూర్ ప్రాంతంలోని మిత్ర ఇన్‌స్టిట్యూట్ స్కూల్ బూత్‌లో ఓటేశారు.

బేరామరీలో బాహాబాహీ

పశ్చిమబెంగాల్‌లో పలు చోట్ల ఘర్షణలు జరిగాయి. బసీర్‌హాట్ లోక్‌సభ నియోజకవర్గంలోని సందేశ్‌ఖాలీ పరిధిలోని బేరామరీలో అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. భాంగర్‌లో టీఎంసీ, ఐఎస్ఎఫ్ మద్దతుదారులు ఒకరిపై ఒకరు నాటుబాంబులతో దాడిచేసుకున్నారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగి భాష్పవాయుగోళాలు ప్రయోగించారు. లాఠీచార్జ్ చేశారు. తర్వాత కొన్ని నాటుబాంబులను స్వాధీనం చేసుకున్నారు. బెంగాల్ నుంచి మధ్యాహ్నం రెండుగంటల్లోపు 1,900 ఫిర్యాదులు వచ్చాయని ఈసీ తెలిపింది. ఈవీఎంలు మొరాయించడం, బూత్‌లోకి రాకుండా ఓటర్లు, పోలింగ్ ఏజెంట్లను ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలు అడ్డుకోవడం వంటి ఘటనలు జరిగాయని టీఎంసీ, బీజేపీ తదితర పార్టీలు ఫిర్యాదుచేశాయి.

రాష్ట్రం	పోలింగ్ శాతం
పంజాబ్	59.92
ఉత్తరప్రదేశ్	55.59
పశ్చిమబెంగాల్	73.47
బిహార్	51.92
ఒడిశా	70.67
హిమాచల్ ప్రదేశ్	69.87
జార్ఖండ్	70.66
చండీగఢ్	67.90

కుటుంబాన్ని మించిన కర్తవ్యం

80 ఏళ్ల తల్లి మరణం ఓవైపు, తప్పక ఓటేయాల్సిన బాధ్యత మరోవైపు ఉన్నా తొలుత ఓటేసి కన్నతల్లికన్నా భరతమాతకు ఎక్కువ గౌరవం ఇచ్చారు ఒక వ్యక్తి. బిహార్‌లోని జెహనాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో దేవ్‌కులీ గ్రామంలో మిథిలేశ్ యాదవ్ తల్లి శనివారం కన్నుమూశారు. 'చనిపోయిన అమ్మ ఎలాగూ తిరిగిరాదు. అంత్యక్రియల్ని కొద్దిసేపు ఆపొచ్చు. కానీ పోలింగ్‌ను ఆపలేం. ఎన్నికలు మళ్లీ ఐదేళ్లదాకా రావు. అందుకే ఓటేశాక అంతిమయాత్ర చేపట్టాలని మా కుటుంబం మొత్తం నిర్ణయించుకున్నాం' అని మిథిలేశ్ చెప్పారు. ఓటేశాక వెంటనే ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

దక్షిణాఫ్రికాలో వచ్చేది సంకీర్ణమే!

మెజారిటీ మార్కు దాటలేకపోయిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ

జోహన్నెస్‌బర్గ్: వర్ణవివక్షపై పోరు తర్వాత నెల్సన్ మండేలా నేతృత్వంలో దక్షిణాఫ్రికాలో అధికారం చేపట్టి 30 ఏళ్లపాటు పాలించిన ది ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) పార్టీ తొలిసారిగా తక్కువ ఓట్లతో సరిపెట్టుకుంది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలైన ఓట్లలో ఇప్పటిదాకా 99.80 శాతం ఓట్లు లెక్కించారు. శనివారం అనధికారికంగా వెల్లడైన గణాంకాల ప్రకారం ఏఎన్‌సీకి 40 శాతానికిపైగా మాత్రమే ఓట్లు పడ్డాయి. తీవ్ర పేదరికం, అసమానతలకు నెలవైన దేశంలో గొప్ప మార్పు మొదలైందని విపక్షాలు ఆనందం వ్యక్తంచేశాయి. మిగతా పార్టీలకు ఇంతకంటే తక్కువ ఓట్లు పడ్డాయి. దీంతో ఏఎన్‌సీ ఇప్పటికీ అతిపెద్ద పార్టీగా ఉన్నప్పటికీ మెజారిటీ మార్కు(50 శాతానికి మించి ఓట్లు) దాటని కారణంగా మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకోవాలంటే ఇతర పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాల్సిన పరిస్థితి తలెత్తింది. విపక్ష డెమొక్రటిక్ అలయన్స్(డీఏ)కు 21.72 శాతం, మాజీ దేశాధ్యక్షుడు జాకబ్ జూమా నేతృత్వంలోని అమ్‌కోంటో వీ సిజ్వే(ఎంకే) పార్టీకి 14 శాతం ఓట్లు పడ్డాయి.

నేడే అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఫలితాలు

ఈటానగర్/గ్యాంగ్‌టక్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు రెండు రోజుల ముందే అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల కల్లా ఓట్ల లెక్కింపు మొదలయ్యేలా కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. 60 స్థానాలున్న అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో ఇప్పటికే 10 చోట్ల బీజేపీ ఏకగ్రీవంగా గెలిచింది. మిగిలిన 50 స్థానాలకు ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఈవీఎంలలో నిక్షిప్తమైన 133 మంది అభ్యర్థుల భవితవ్యం నేటితో తేలనుంది. తక్కువ స్థానాలు కావడంతో ఆదివారం మధ్యాహ్నంకల్లా తుది ఫలితాలు వెల్లడికానున్నాయని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈఓ) పవన్‌కుమార్ సైన్ శనివారం చెప్పారు.

అరుణాచల్ ప్రదేశ్: 2019లో బలాబలాలు	
బీజేపీ	41
జేడీ(యూ)	7
ఎన్‌పీపీ	5
కాంగ్రెస్	4
పీపీఏ	1
స్వతంత్రులు	2

సిక్కింలోనూ..

సిక్కింలోని 32 అసెంబ్లీ స్థానాలకు ఆదివారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. మరోసారి అధికారం చేపట్టాలని అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా(ఎస్‌కేఎం) ఉవ్విళ్లూరుతుండగా ఎలాగైనా విజయం సాధించాలని సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్(ఎస్‌డీఎఫ్), బీజేపీ, కాంగ్రెస్, సిటిజెన్ యాక్షన్ పార్టీ–సిక్కిం ఆశపడుతున్నాయి. ఈసారి ఏప్రిల్ 19న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 80 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 146 మంది అభ్యర్థులు ఈసారి పోటీపడ్డారు.

2019లో బలాబలాలు	
సిక్కిం క్రాంతికారి మోర్చా	17
సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్	15

సెన్సార్ల లోపం వల్లే ఎక్కువ ఉష్ణోగ్రతలు

నాగ్‌పూర్, ముంగేష్‌పుర్‌లో ఉష్ణోగ్రతలపై వాతావరణ శాఖ వివరణ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో మే 30వ తేదీన నమోదైన 56, వాయవ్య ఢిల్లీలోని ముంగేష్‌పుర్‌లో మే 29వ తేదీన నమోదైన 52.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తప్పు అని భారత వాతావరణ శాఖ శనివారం స్పష్టంచేసింది. మే 29న ముంగేష్‌పుర్‌లో వాస్తవ గరిష్ఠ ఉష్ణోగ్రత 45.2 ఉంటే సెన్సార్ దానిని 52.9 డిగ్రీల సెల్సియస్‌గా చూపించింది. ముంగేష్‌పుర్, నాగ్‌పూర్ స్టేషన్లలో ఉష్ణోగ్రతను లెక్కగట్టే సెన్సార్‌లలో లోపాలు తలెత్తడం వల్లే అసాధారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ వివరణ ఇచ్చింది. '' ఈ రెండు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్(ఏడబ్ల్యూఎస్)లో బిగించిన సెన్సార్‌లను త్వరలోనే పరిశీలిస్తాం. ఢిల్లీలోని ఇతర ఆటోమేటిక్, మాన్యువల్ అబ్జర్వేటరీల్లో నమోదైన ఉష్ణోగ్రతలతో పోలిస్తే ముంగేష్‌పుర్ ఏడబ్ల్యూఎస్‌లో అసాధారణ ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడికి ఇప్పటికే నిపుణుల బృందాన్ని పంపించాం. ముంగేష్‌పుర్‌లో స్టాండర్డ్ ఇన్‌స్ట్రుమెంట్ నమోదుచేసిన దానికంటే ఈ సెన్సార్ మూడు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను ఎక్కువ చూపించింది. లోపాలున్న సెన్సార్‌ను త్వరలోనే మార్చేస్తాం'' అని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర చెప్పారు.

మెక్సికో పీఠంపై తొలిసారి మహిళ!

నేడే కీలక అధ్యక్ష ఎన్నికలు

- ప్రధాన అభ్యర్థులిద్దరూ మహిళలే

మెక్సికో. లాటిన్ అమెరికాలో రెండో అతి పెద్ద దేశం. పురుషాధిపత్య భావజాలానికి పెట్టింది పేరు. మహిళలపై హింస, హత్య, యాసిడ్ దాడులు నిత్యకృత్యం. మెక్సికోలో ఇదే అతి పెద్ద సమస్య కూడా. అలాంటి దేశంలో తొలిసారి ఓ మహిళ అధ్యక్ష పదవి చేపట్టనున్నారు! ఆదివారం జరిగే ఎన్నికల్లో అధ్యక్ష పదవితో పాటు 128 మంది సెనేటర్, 500 మంది కాంగ్రెస్ ప్రతినిధులతో పాటు దాదాపు 20 వేల స్థానిక సంస్థల స్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి పాలక, ప్రధాన సంకీర్ణాలు రెండింటి నుంచీ మహిళలే బరిలో ఉండటం విశేషం. పాలక 'మోరెనా' సంకీర్ణం తరఫున పోటీ చేస్తున్న క్లాడియా షేన్‌బామ్ గెలుపు ఖాయమేనని పరిశీలకులు చెబుతున్నారు. నేషనల్ యాక్షన్ పార్టీ సారథ్యంలోని విపక్ష కూటమి అభ్యర్థి సోచిల్ గాల్వెజ్‌పై ఆమె కనీసం 20 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నట్టు అన్ని సర్వేల్లోనూ తేలింది. మహిళలపై మితిమీరిన హింసకు పెట్టింది పేరైన ఆ దేశంలో వారికి రాజకీయ ప్రాతినిధ్యం కూడా నానాటికీ బాగా పెరుగుతుండటం విశేషం. దిగువ సభ (కాంగ్రెస్)లో అన్ని పార్టీలూ మహిళలకు కనీసం 50 శాతం టికెట్లివ్వడాన్ని ఇప్పటికే తప్పనిసరి చేశారు. ఫలితంగా కాంగ్రెస్‌లో సగం మంది సభ్యులు మహిళలే ఉన్నారు. మెక్సికో జనాభా 13 కోట్లు కాగా దాదాపు 10 కోట్ల మంది ఓటర్లున్నారు. ఆదివారం పోలింగ్ ముగిశాక రాత్రికల్లా ఫలితాలు వెలువడే అవకాశముంది.

సోచిల్ గాల్వెజ్



61 ఏళ్ల గాల్వెజ్ సెనేట్ సభ్యురాలు. పారిశ్రామికవేత్త. ఎన్ఏపీ, పీఆర్ఐ, పీఏఎన్, ఆర్‌పీడీ సహా పలు పార్టీలతో కూడిన విపక్ష కూటమి తరఫున బరిలో ఉన్నారు. లోపెజ్ ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం వంటివాటిని తాను కూడా కొనసాగిస్తానని చెబుతూ పలు వర్గాలను ఆకట్టుకున్నారు. దాంతోపాటు మధ్య, దిగువ తరగతి ప్రజల కోసం సార్వత్రిక సామాజిక రక్షణ వ్యవస్థ తెస్తానంటున్నారు. పోలీస్ వ్యవస్థను పటిష్ఠపరిచి నేరాలపై ఉక్కుపాదం మోపుతానని చెబుతున్నారు.

క్లాడియా షేన్‌బామ్



ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త. 2007లో నోబెల్ గ్రహీత. మెక్సికో సిటీ మాజీ మేయర్. గెలిస్తే తొలి అధ్యక్షురాలిగానే గాక యూదు మూలాలున్న తొలి వ్యక్తిగా కూడా రికార్డు సృష్టించే అవకాశముంది. అధ్యక్షుడు ఆంద్రెజ్ మాన్యుయెల్ లోపెజ్ అబ్రేడర్‌కున్న విశేషమైన జనాదరణ ఉన్నా రెండోసారి పదవి చేపట్టేందుకు మెక్సికో రాజ్యాంగ ప్రకారం అనుమతించని కారణంగా పాలక సంకీర్ణ అభ్యర్థిగా షేన్‌బామ్ బరిలో దిగారు. కనీస వేతనాలను రెట్టింపు చేయడం, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల పెంపు, రైతులకు సబ్సిడీ, వర్సిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, నిరుద్యోగులకు భృతి వంటివి నేరుగా నగదు రూపంలో చెల్లించడం, సీనియర్ సిటిజన్లకు సార్వత్రిక పెన్షన్ సదుపాయం వంటివాటితో లోపెజ్ తన ఆరేళ్ల పదవీకాలంలో అందరి మన్ననలు పొందారు. ఇదంతా 61 ఏళ్ల షేన్‌బామ్‌కు బాగా కలిసి రానుంది. డ్రగ్ మాఫియా, వ్యవస్థీకృత నేరాలు మెక్సికో ఎదుర్కొంటున్న సమస్యల్లో ముఖ్యమైనవి. వీటి కట్టడికి లోపెజ్ పెద్దగా ప్రయత్నాలు చేయలేదన్న ఆరోపణలున్నాయి. తాను వాటిపైనా ప్రధానంగా దృష్టి సారిస్తానని ఆమె చెబుతున్నారు. లోపెజ్ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఆయన ప్రభావానికి అతీతంగా పాలిస్తానంటున్నారు.

జార్జ్ అల్వారెజ్ మైనేజ్



రాజకీయాలకు కొత్త ముఖం. స్మాల్ సిటిజన్ మూవ్‌మెంట్ పార్టీ తరఫున బరిలో ఉన్నారు. నేరాలపై ఉక్కుపాదం మోపుతానని హామీ ఇచ్చారు. డ్రగ్స్‌ను నిర్మూలించడం అసాధ్యమని, వాటిని బాగా కట్టడి చేస్తానని చెబుతున్నారు. 38 ఏళ్ల మైనేజ్ ప్రతిపాదించిన పలు ఆర్థిక సంస్కరణలపై ప్రజల నుంచి మంచి స్పందన రావడం విశేషం. ఈసారి గెలవకపోయినా మున్ముందు మెక్సికో రాజకీయాల్లో ఆయన ప్రబల శక్తిగా ఎదగడం ఖాయమంటున్నారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై తీర్పు 5కు వాయిదా

నేడు మళ్లీ తీహార్ జైలుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట దక్కలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఈ కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును ఈ నెల 5వ తేదీకి రిజర్వ్ చేసింది. దీంతో కేజ్రీవాల్ ఆదివారం తీహార్ జైలులో లొంగిపోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.

'అగ్నిపథ్'లో వివక్షను అడ్డుకోండి

రాష్ట్రపతి ముర్ముకు రాహుల్ లేఖ

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకం అమలులో జోక్యం చేసుకుని అమర జవాన్ల కుటుంబాలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయమే అయినప్పటికీ జాతి భద్రతపై ప్రభావం కలిగించే ఈ అంశంపై సాయుధ బలగాల సుప్రీం కమాండర్‌గా ప్రత్యేక పరిస్థితుల్లో జోక్యం చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు శనివారం రాహుల్ ఒక లేఖ రాశారు. దేశం కోసం జీవితాలనే త్యాగం చేస్తున్న అగ్నివీర్‌లకు మిగతా సైనికుల మాదిరిగానే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరారు.

సాక్షి
కరీంనగర్

ఆదివారం । 2 । జూన్ । 2024

వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబు

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర అవతరణ దినోత్సవ సంబరాలకు కలెక్టరేట్ ముస్తాబైంది. ఆదివారం కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9గంటలకు కలెక్టర్ పమేలా సత్పతి పతాకావిష్కరణ చేయనుండగా 9.02గంటలకు వందన స్వీకారం, 9.10 గంటలకు సందేశం, 9.20గంటల నుంచి 9.30 వరకు తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించనున్నారు. అరగంట పాటు రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించనున్నారు.



న్యూస్‌రీల్

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొడిగించాలి



కరీంనగర్ కార్పొరేషన్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణను పొడిగించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఎస్సీ అభ్యర్థులకు ఎస్సీ స్టడీసర్కిల్ ద్వారా ప్రభుత్వం ఉచిత శిక్షణ అందిస్తోందని తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం రెండు నెలలు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారని, ఆ గడువు మే 31తో ముగిసిందన్నారు. జూలై 17వ తేదీన డీఎస్సీ పరీక్ష ఉంది కాబట్టి, గడువు మరికొన్ని రోజులు పొడిగించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించిన ఎస్సీ అభ్యర్థులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ మేరకు ఉచిత శిక్షణను కొనసాగించాలని కోరారు. స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ కొనసాగేలా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పినట్లు అడ్లూరి వివరించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలకు ఉద్యమకారుడికి ఆహ్వానం



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన గంప సంపత్‌కుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన దశాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలని ప్రభుత్వం నుంచి పిలుపు అందింది. గంప సంపత్‌కుమార్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించాడు. విద్యావంతుల వేదిక జిల్లా ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. స్వగ్రామంలో వెయ్యిమంది మహిళలతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. బొమ్మనపల్లి నుంచి హుస్నాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించారు. సంపత్‌కుమార్‌కు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికలకు పచ్చజెండా

- ఈ నెల 6నుంచి 28లోపు నిర్వహణ
- మత్స్యకారులు, గొర్రెల పెంపకందారుల్లో మొదలైన సందడి

కరీంనగర్ అర్బన్: ఎట్టకేలకు మత్స్యకారులు, గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు జిల్లా సహకార శాఖ తదనుగుణ కసరత్తు మొదలెట్టింది. జిల్లాలో 313 గ్రామ పంచాయతీలుండగా 276 గ్రామాల్లో గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలున్నాయి. మత్స్యకారుల సహకార సంఘాలు 310 వరకు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో ఈ నెల 6నుంచి 28లోపు ఎన్నికల నిర్వహణకు త్వరలోనే ప్రకటన విడుదల చేయనున్నట్లు జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి ఎస్.రామానుజాచార్య వివరించారు. ఈ నేపథ్యంలో 60 రోజుల ముందుగానే ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా రూపొందిస్తున్నారు. ఇప్పటికే సహకార సంఘాలకు ఆదేశాలు జారీ చేయగా కొలిక్కి వచ్చినట్లు సమాచారం.

పదేళ్ల ప్రగతి.. స్మార్ట్ సిటీ ఖ్యాతి

తెలంగాణ మలిదశ ఉద్యమానికి, కరీంనగర్ జిల్లాకు విడదీయలేని అనుబంధం ఉంది. 2001లో ఉద్యమం రాజకీయంగా ఇక్కడే ఊపిరిపోసుకుంది. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి, 2009లో రాష్ట్రమంతా భగ్గుమనేలా చేసి, 2014లో పార్లమెంట్‌లో బిల్లు పెట్టేవరకు జిల్లాది ప్రత్యేక స్థానం. తెలంగాణ స్వప్నం ఫలించాక స్వపరిపాలన మొదలైంది. ఈ క్రమంలో నేటికి రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్నాయి. ఈ దశాబ్ద కాలంలో మౌలిక వసతులు, అభివృద్ధి, విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయ రంగాల్లో ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. పలు ప్రభుత్వ రంగాలు మంచి ఫలితాలతో కేంద్రం నుంచి పలు అవార్డులు, ప్రశంసలు అందుకున్నాయి.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

- స్వరాష్ట్రంలో మారిన జిల్లా రూపురేఖలు
- విద్య, వైద్య రంగాల్లో గణనీయ మార్పు
- ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట
- రైతుబంధు, దళితబంధు ఇక్కడే శ్రీకారం
- స్మార్ట్ సిటీ ఏర్పాటు, తీగల వంతెన సొబగులు
- నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం





వ్యవసాయ రంగం..

2014–15 సంవత్సరంలో వానాకాలం, యాసంగికి కరీంనగర్ జిల్లాలో మొత్తం 1,67,483 ఎకరాలు సాగవగా, 2022–23 నాటికి అది 6,37,885 ఎకరాలకు చేరుకుంది. ఈ దశాబ్ద కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి మూడింతలు పెరిగింది. విత్తనోత్పత్తుల విలువ రూ.123.18 కోట్ల నుంచి రూ. 539.53 కోట్లకు చేరింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం కరీంనగర్ వేదికగా ప్రారంభమైంది. దీని ద్వారా జిల్లాలో 2018 నుంచి ఇప్పటివరకు 1,81,908 మంది రైతులకు రూ.1,556.63 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.



కరీంనగర్ జిల్లాలో రైతుబీమా పథకం ద్వారా ఆగస్టు 15, 2018 నుంచి ఇప్పటివరకు 2,377 మంది రైతులకు రూ.118.85 కోట్లను బీమా రూపంలో అందించింది. ఇవి కాకుండా జిల్లావ్యాప్తంగా 76 రైతువేదికలు నిర్మించారు.

పురపాలిక నుంచి స్మార్ట్‌సిటీ దాకా..

2014 నుంచి 2024 వరకు కరీంనగర్ రూపురేఖలు మారిపోయాయి. 2014లో రూ.107 కోట్లున్న వార్షిక అంచనా బడ్జెట్ 2024 నాటికి రూ.577 కోట్లకు చేరింది. అప్పుడు జనాభా దాదాపు రూ.2.5 లక్షలుండగా, ప్రస్తుతం 4.25 లక్షలకు చేరింది. 2017లో స్మార్ట్ సిటీగా ఎంపిక చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.1,000 కోట్లు కేటాయించి, రూ.715 కోట్లు చెల్లించారు. వీటికి తోడు ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) సుమారు రూ.300 కోట్లు కేటాయించారు. స్మార్ట్‌సిటీగా ఎంపికవడంతో నగరంలో రోడ్లు, కూడళ్లు, పార్కులు తదితర అభివృద్ధి పనులు జరిగాయి. 2019లో 8 గ్రామాల విలీనంతో 50గా ఉన్న డివిజన్లు 60కి పెరిగాయి. నగర పంచాయతీలుగా ఉన్న జమ్మికుంట, కొత్తపల్లి, చొప్పదండి 2018లో మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. ఫలితంగా ఆయా పురపాలికల్లో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు మెరుగయ్యాయి.

నీటిపారుదల రంగం..

ఉమ్మడి జిల్లాలో గోదావరి లాంటి జీవనది, మానేరు లాంటి ఉపనదులు ఉన్నా.. ఉమ్మడి రాష్ట్రంలో పూర్తిస్థాయిలో నీటి వినియోగం జరగలేదు. తర్వాత కరీంనగర్ జిల్లాలో మిడ్‌మానేరు, కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల నిర్మాణం రాష్ట్ర సాగునీటి పారుదల రంగాన్ని కొత్త పుంతలు తొక్కించింది. దీనికితోడు మిషన్ కాకతీయతో నీటి లభ్యత, భూగర్భ జలాలను పెరిగాయి. మిషన్ కాకతీయ ద్వారా జిల్లాలో మెజారిటీ ఇళ్లకు తాగునీటి సదుపాయం కలిగింది. కరీంనగర్ జిల్లాలోని 494 గ్రామీణ ఆవాసాలకు 3 సెగ్మెంట్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. రూ.1,492 కోట్లతో 22 కట్టడాలు, 1,231.96 కి.మీ. పైపులైన్ పనులు పూర్తి చేశారు. అంతర్గత మంచినీటి పంపిణీ కోసం రూసా పథకం కింద రూ.231.85 కోట్లు ఇచ్చారు. ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు 398 కొత్తవి నిర్మించి, 509 పాతవి పునరుద్ధరించారు. జిల్లాలో 1,95,252 ఇళ్లకు మంచినీటి సరఫరా జరుగుతోంది.

ప్రజాపంపిణీ వ్యవస్థ..



జిల్లాలో 33,720 మంది రైతులు పండించిన ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, హెచ్ఏసీఏ కేంద్రాలు 336 ద్వారా రూ.440.38 కోట్ల విలువైన 2,13,777.226 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. జిల్లాలో 2,78,411 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు, 566 రేషన్ షాపుల ద్వారా ప్రజలకు ఉచితంగా బియ్యం పంపిణీ జరుగుతోంది. అలాగే, 21 ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల నుంచి సింగిల్, డబుల్, దీపం, సీఎస్ఆర్, ఉజ్వల కనెక్షన్ల ద్వారా 4,10,618 గ్యాస్ కనెక్షన్లు అందించారు.

సంక్షేమం.. ఆసరా పింఛన్లు

తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్ కింద ఇచ్చే మొత్తాన్ని రూ.2,016కు, దివ్యాంగులకు రూ.3,016కు పెంచింది. బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, ఫైలేరియా బాధితులకు, డయాలసిస్ పేషెంట్లకు సైతం రూ.2,016 పింఛన్ ప్రతినెలా అందిస్తోంది.

- దళితజాతి సామాజిక, ఆర్థిక పురోభివృద్ధికి దళితబంధు పథకాన్ని హుజూరాబాద్‌లోని శాలపల్లి వేదికగా ప్రవేశపెట్టింది. ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం అందించారు. జిల్లాలో ఇప్పటివరకు 18,231 ఎస్సీ కుటుంబాలకు దళితబంధు ద్వారా రూ.1,823 కోట్లు విడుదల చేశారు.
- దళిత విద్యార్థులకు జిల్లాలో 22 వసతి గృహాలు, 9 కళాశాల వసతి గృహాలు నిర్వహిస్తున్నారు.
- జిల్లాలో గొర్రెల పంపిణీ పథకం ద్వారా 2017–18 నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో 16,724 మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ జరిగింది. పాడిపశువుల పంపిణీ పథకం ద్వారా 2017–18, 2020–21, 2023–24లలో 4,800 మంది లబ్ధిదారులకు పశువులు అందించారు.



- జిల్లాలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా 32,693 మంది లబ్ధిదారులకు రూ.298 కోట్లకు పైగా చెల్లించారు.

వైద్యారోగ్య రంగం..

జిల్లాలో పదేళ్ల కాలంలో వైద్యారోగ్య రంగానికి పెద్దపీట వేశారు. కంటివెలుగు ద్వారా 10,15,875 మందికి కంటి పరీక్షలు చేశారు. కరీంనగర్ జిల్లాకు ప్రభుత్వం మెడికల్ కళాశాల మంజూరు చేసింది. ఫలితంగా 100 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి.



మౌలిక సదుపాయాలు..

జిల్లాలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులు, భవనాలు, రహదారుల నిర్మాణం చేపట్టారు. రూ.200 కోట్లకు పైగా నిధులతో తీగల వంతెన, రూ.410 కోట్ల అంచనా వ్యయంతో మానేరు రివర్ ఫ్రంట్(ఎంఆర్ఎఫ్) వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 2014–15 నుంచి 2022–23 వరకు 144.02 కి.మీ. నూతన సీసీ రోడ్లు నిర్మించారు. 179.68 కి.మీ నూతన తారు రోడ్ల నిర్మాణం జరిగింది. 2014–23లో ఎంజీఎన్ఆర్ఎస్ ద్వారా రూ.260 కోట్లతో 280 కి.మీ. సీసీ రోడ్లు నిర్మించారు. రూ.51 కోట్లతో సమీకృత కలెక్టరేట్ భవనం మంజూరై, పనులు ప్రగతిలో ఉన్నాయి.

అంతా రామమయం

- హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు తరలివచ్చిన 2లక్షల మంది భక్తులు
- నేటితో ముగియనున్న వేడుకలు
- ఊపిరిపీల్చుకున్న అధికారులు



ఆంజనేయస్వామివారి దర్శనం కోసం క్యూలో వేచిఉన్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు పరిసరాలన్నీ శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా ఉదయమే అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. యాగశాలలో తిరుమంజనం, ద్రవిడ, ప్రభంద పారాయణం, హవణము, పంచామృత అభిషేకం, సహస్ర నాగవలి అర్చన, తులసీ దాలల అర్చన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, ఊయల సేవ, మంత్రపుష్పం, మహానివేదన చేపట్టారు.

రెండు లక్షల మంది భక్తుల రాక

హనుమాన్ జయంతి పురస్కరించుకుని కొండగట్టుకు సుమారుగా రెండు లక్షల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దర్శనం, మాల విరమణకు మూడు గంటల సమయం పట్టింది. భక్తులను అదుపు చేసేందుకు పోలీసులు అవస్థలు పడ్డారు. సీఐ నీలం రవి, ఈవో చంద్రశేఖర్ అప్రమత్తంగా ఉంటూ భక్తులను దర్శనాలకు పంపించారు.

ప్రముఖుల రాక.. నేటితో ముగింపు

స్వామి వారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయ రమణారావు దర్శించుకున్నారు. మల్యాల ఎంపీపీ రవళి, కొడిమ్యాల ప్యాక్స్ చైర్మన్ రాజనర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో జయంతి ఉత్సవాలు ఆదివారం మధ్యాహ్నంతో ముగియనున్నాయి.



ఆలయంలోకి వెళ్తున్న స్వాములు



కొండగట్టు ఆంజనేయస్వామి

స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ

అంజన్నకు జిల్లా వైశ్య సంఘం నాయకులు పోచమల ప్రవీణ్‌కుమార్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. సికింద్రాబాద్‌కు చెందిన నేత కార్మికులు వారం రోజులుగా మగ్గంపై ప్రత్యేకంగా నేసిన వస్త్రాలను స్థానిక హరిత హోటల్ నుంచి శోభాయాత్రగా తీసుకెళ్లారు.

మంత్రి 'పొన్నం'కు స్వాగతం

కరీంనగర్ కార్పొరేషన్: అమెరికా పర్యటన ముగించుకుని శనివారం హైదరాబాద్ చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు శంషాబాద్ విమానాశ్రయం, ఆయన నివాసంలో స్వాగతం పలికారు. ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, పడాల రాహుల్, రాచకొండ చక్రధర్ రావు, ఫహాద్, అనిల్ ముదిరాజ్, సుజిత్‌కుమార్, గోపాల్‌రెడ్డి, దొంతి గోపి పాల్గొన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

- శాంపిళ్ల సేకరణకు ప్రభుత్వం ఆదేశం
- కరీంనగర్ పరీక్ష కేంద్రం యాక్టివ్ అయ్యేనా?
- పక్కాగా సాగితేనే ప్రయోజనం

నకిలీ విత్తనాలపై నజర్

కరీంనగర్ అర్బన్: నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల క్రమంలో జిల్లాలోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. పత్తి, వరి, ఇతర విత్తనాల శాంపిళ్లను సేకరిస్తున్నారు. ఈ మేరకు వానాకాలం సీజన్ ముందు నుంచి 2025 ఫిబ్రవరి వరకు అన్ని సీడ్, ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తన నమూనాలు సేకరించాలని సర్కారు నిర్దేశించింది. ఈ క్రమంలో డీఏవో, ఏడీఏ, ఏవో, ఏఈవోలు తమ తమ పరిధిలో తనిఖీలు ప్రారంభించారు.

పక్షం రోజుల్లో ఫలితాలు

గతంలో నకిలీ విత్తనాలు లభించడంతో జిల్లాలోని కొందరు డీలర్లపై కేసులు నమోదు చేశారు. తాజాగా నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా పెంచారు. పోలీసు, వ్యవసాయశాఖ అధికారులతో తనిఖీ బృందాలను నియమించారు. పంటల సాగు విస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో విత్తనాల పంపిణీపై దృష్టి సారిస్తున్నారు. లక్ష్యాలకు అనుగుణంగా సేకరించిన విత్తన నమూనాలను హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించనున్నారు. 15 రోజుల తర్వాత ల్యాబ్ నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా విత్తనాలు సాగుకు అనుకూలం కాకపోతే సదరు దుకాణాల్లో విక్రయాలను నిలిపేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు.

కరీంనగర్ కేంద్రం నామమాత్రమేనా.?

ఉమ్మడి రాష్ట్రంలో భూసారం, విత్తన, ఎరువుల పరీక్ష కేంద్రమున్న ప్రాంతాలు ఐదు మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో తాడేపల్లిగూడెం, అనంతపురం, బాపట్లలో పరీక్ష కేంద్రాలుండగా తెలంగాణలో హైదరాబాద్, వరంగల్‌లో ఉన్నాయి. ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో విత్తన, ఎరువుల నమూనాలు సేకరించడం వాటిని పరీక్షల నిమిత్తం వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉత్తర తెలంగాణలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది సాగు ఎక్కువగా ఉండటంతో కరీంనగర్ ఉమ్మడిజిల్లాకేంద్రంగా కొత్తపల్లి సీడ్‌ఫామ్‌లో విత్తన, ఎరువుల పరీక్ష కేంద్రాన్ని నిర్మించారు. విత్తన, ఎరువులకు సంబంధించిన నమూనాలను సేకరించేలా ఏటా రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. ఆయా కంపనీల పత్తి, మొక్కజొన్న, వరి, కంది, ఇతర విత్తనాలను సేకరించి పరీక్షలకు పంపడం,. ఫలితాల తదుపరి చర్యలు తీసుకోవడం జరిగే ప్రక్రియ. ఈ సారి ఖరీఫ్‌కు గానూ జిల్లాకు 530 ఎరువులు, 120 పత్తి విత్తనాలు, వరి 220, ఇతర విత్తనాలు 111 నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించింది. గత ఐదేళ్లలో ఎరువులు, విత్తనాల్లో నాణ్యత లేదని 20 వరకు నమూనాల్లో తేలింది. ప్రస్తుతం కోర్టులో కేసులు నడుస్తుండగా నమూనా ఫలితాలు రావడం మాత్రం ఆలస్యమవుతోంది. సేకరించిన విత్తన, ఎరువుల నమూనాలను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు పంపిస్తున్నారు. విత్తన పరీక్షలో రెండు రకాల పరీక్షలు నిర్వహిస్తుంటారు. సర్వీస్ టెస్ట్, ఆక్టివ్ టెస్ట్‌లు ఉండగా సర్వీస్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. యాక్టివ్ టెస్ట్‌కు సంబంధించి ప్రతిపాదనల దశలో ఉండగా నామమాత్రంగా మిగిలింది. యాక్టివ్ టెస్ట్ జరిగితేనే శాంపిళ్లను ఇక్కడికిక్కడే ఫలితాలను తేల్చొచ్చు..తక్షణమే చర్యలు చేపట్టొచ్చు.



ఎరువులు, విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారి(ఫైల్)

రైతులూ.. జాగ్రత్త

లైసెన్స్ దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి. విత్తన ప్యాకెట్, బస్తాలపై లాట్ నంబర్, కంపెనీ పేరు, ప్యాకింగ్ తేదీ వంటి వివరాలు ఉన్నాయో లేదా చూసుకోవాలి. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదును భద్రపరచుకోవాలి. అనుమతులు లేకుండా విడిగా విక్రయించే గింజలను కొనొద్దు. దళారుల మాటలు నమ్మొద్దు. విత్తన నాణ్యతపై సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

సీజన్ మొత్తం తనిఖీలు..

వ్యవసాయ సీజన్ జూన్ నుంచి ఫిబ్రవరి వరకు ఉంటుంది. విత్తన, ఎరువుల విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించేలా వ్యవసాయాధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో ఏఓలు నమూనాలు సేకరించి ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌కు తరలించనున్నారు. నెలవారీ లక్ష్యాల ప్రకారం నమూనాలు సేకరించటంతో డీలర్లు నకిలీ విత్తనాలను విక్రయించే ఆస్కారం ఉండబోదని అధికారులు చెబుతున్నారు. ఏదైనా దుకాణంపై అనుమానమొచ్చినా, ఫిర్యాదులందినా రెండు, మూడుసార్లు నమూనాలు సేకరిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి బత్తుల శ్రీనివాస్ స్పష్టం చేశారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలి పారు. మృతుడి వయసు 30 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. గుర్తుపట్టిన వారు 87126 56508 నంబర్‌కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని కోరారు. వడదెబ్బతోనే మరణించి ఉంటాడని స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..


వినోద (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన లక్కాకుల వినోద(54) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వినోద కొంత కాలంగా తలనొప్పితో బాధ పడుతోంది. ఆస్పత్రులకు వెళ్లి, మందులు వాడినా నయం కాక పోవడంతో జీవితంపై విరక్తి చెంది, గత నెల 25న ఇంట్లో క్రిమిసంహార మందు తాగింది. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బొంతుపల్లి వాసి..

- గత నెల 25న ఆత్మహత్యాయత్నం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బొంతుపల్లికి చెందిన చదువు వాసుదేవరెడ్డి (58) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వాసుదేవరెడ్డికి, బొంతుపల్లికే చెందిన చదువు నరసింహారెడ్డి మధ్య గొడవలున్నాయి. నరసింహారెడ్డితోపాటు కోరుకంటి శారద, కోరుకంటి ఓదెలు, జునూతుల మనోహర్‌రెడ్డి, జునూతుల మంజుల, కోరుకంటి శంకర్ అతన్ని ఇబ్బందులకు గురిచేయాలనుకున్నారు. శారదకు రూ.5 లక్షలతోపాటు 20 గుంటల భూమి ఇవ్వాలని వాసుదేవరెడ్డితో బలవంతంగా కాగితం రాయించారు. తర్వాత డబ్బులు, భూమి కోసం మానసికంగా వేధించారు. దీంతో మనస్తాపం చెందిన అతను గత నెల 25న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు వినయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

స్వరాష్ట్ర కాంక్షను రగిల్చిన గీతం

- 'జయ జయహే తెలంగాణ'కు కొత్త వెర్షన్
- స్వాగతించిన సాహితీవేత్తలు
- రాష్ట్ర గీతంగా ఆమోదించిన ప్రభుత్వం
- నేడు ప్రజల ముందుకు..

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర సాధన విజయ గీతిక అయిన జయ జయహే తెలంగాణ అనే పాటను గీత రచయిత అందెశ్రీ రాశారు. ఉద్యమ సమయంలో ఊరువాడా ఏకమై, రాష్ట్ర కాంక్షను ఎలుగెత్తి చాటాయి. ఉద్యమకారుల్లో ఈ పాట నూతన ఉత్సాహాన్ని నింపి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, అందరినీ సంఘటితం చేసింది. 2003 మార్చి 2న కామారెడ్డిలో జరిగిన తెలంగాణ ధూంధాం కార్యక్రమంలో మనకంటూ ఓ పాట ఉండకూడదా అనే ఆలోచన అందెశ్రీకి వచ్చింది. ఆ వెంటనే నాలుగు చరణాలు రాశారు. తర్వాత అదే సంవత్సరం నవంబర్ 11న ఆదిలాబాద్‌లో జరిగిన తెలంగాణ రచయితల వేదిక జెండా వందనంలో వాటిని ఆలపించారు. తెలంగాణ ఘన కీర్తిని ఈ పాటలో పొందుపరచగా 12 చరణాలతో ఉద్యమకారుల నోట చేరి, తెలంగాణ ప్రజల నరనరాన స్వరాష్ట్ర ఆకాంక్షను నింపింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీన్ని రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామని నాయకులు, ఉద్యమ నేతలు పలు వేదికలపై చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించలేదన్న విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ 2021 మార్చి 16న అసెంబ్లీ సమావేశంలో స్పష్టం చేశారు.

రాష్ట్రం వచ్చిన పదేళ్లకు..

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పదేళ్ల తర్వాత గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించగా మిత్రపక్షాలు ఆమోదం తెలిపాయి. పాట కొత్త వెర్షన్‌ను సాహితీవేత్తలు స్వాగతించారు. రికార్డింగ్ పూర్తవగా ఆదివారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని, ప్రజల ముందుకు రానుంది. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు తమ మనోభావాలను వెల్లడించారు.

మహత్తర గీతం



రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహత్తర గీతం జయ జయహే తెలంగాణ. పదేళ్లుగా ప్రజల్లోకి రాకుండా బంధించబడింది. ఇప్పుడు అధికారికంగా ప్రకటించడం అ అభినందనీయం. కీరవాణి తెలంగానేతరుడు అని చెప్పడానికి ఇది తెలంగాణ ఉద్యమ సందర్భం కాదు. రాష్ట్రం వచ్చింది. కీరవాణి స్వర కల్పన చేయడంలో అభ్యంతరం లేదు.

– అన్నవరం దేవేందర్, కవి, రచయిత, భగత్‌నగర్, కరీంనగర్

ఉద్యమానికి ఊపిరినిచ్చింది



కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతం తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చింది. ప్రజల్లో స్వరాష్ట్ర కాంక్షను రగిల్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధన వైపు అడుగులు వేయించింది. మన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. రాష్ట్ర గీతంగా ప్రజల మనోభీష్టానికి ఇచ్చిన గౌరవమిది. చాలా సంతోషంగా ఉంది.

– కొత్త అనిల్‌కుమార్, కవి, జ్యోతినగర్, కరీంనగర్

నిడివి తగ్గించాలి



రాష్ట్ర గీతం నిడివి తగ్గించాలి. ఇందులో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ఔన్నత్యాన్ని చాటే చరణాలు ఉంటే సరిపోతుంది. పాఠశాలల్లో, సభల్లో గానం చేయడానికి యోగ్యంగా ఉండాలి. నేటి తరానికే కాకుండా భావితరాలకు స్ఫూర్తినిచ్చే అంశాలకు చోటివ్వాలి.

– దాస్యం సేనాధిపతి, కవి, రచయిత, విమర్శకుడు, కరీంనగర్

సంస్కృతికి అద్దం పడుతుంది



అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతం మన గొప్పదనం, సంస్కృతికి అద్దం పడుతుంది. పండితులు, పామరులను సైతం పరవశింపజేసిన ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించి, ప్రజల్లోకి తీసుకురావడం అందరూ హర్షించాల్సిన విషయం.

– వేములవాడ ద్రోణాచారి, కవి, రచయిత, రాఘవేంద్ర నగర్, కరీంనగర్

ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చింది



జయ జయహే తెలంగాణ గీతం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చింది. ప్రజాకవి అందెశ్రీ తెలంగాణ ఘనతను చాటుతూ దీన్ని రాశారు. ఉద్యమ నేతలు గుర్తించకున్నా పదేళ్ల తర్వాత అయినా కొత్త ప్రభుత్వం గుర్తించి, రాష్ట్ర గీతంగా ప్రకటించడం అభినందనీయం.

– కేఎస్.అనంతాచార్య, తెలుగు పండితుడు, మంకమ్మతోట, కరీంనగర్

ఎరుకలగూడెంలో వివాహిత బలవన్మరణం

- వేధించిన వ్యక్తితోపాటు అత్తింటివారిపై మృతురాలి తల్లి ఫిర్యాదు

మంథని: మున్సిపల్ పరిధిలోని ఎరుకల గూడెంలో పర్శవేన కల్యాణి(28) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన మామిడి సమ్మక్క–కొంరయ్యల రెండో కూతురు కల్యాణికి మంథని మండలంలోని ఖానాపూర్‌కు చెందిన పర్శవేన శంకర్‌తో 2013లో వివాహం జరిగింది. వీరు ఐదేళ్లుగా స్థానిక ఎరుకలగూడెంలో నివాసం ఉంటున్నారు. కాగా, కోటపర్తి రవిశ్యామ్ అనే వ్యక్తి కల్యాణికి ఫోన్ ద్వారా పరిచయమయ్యాడు. ఆమెతో ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో ఒకరి జోలికి ఒకరు వెళ్లకుండా పాబందీ రాసుకున్నారు. కానీ, రవిశ్యామ్ గత వారం రోజులు గా ఆమెను మళ్లీ వేధించడంతోపాటు డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని కల్యాణి తన భర్త శంకర్, అత్త రాజమ్మకు చెప్పినా వారు పట్టించుకోలేదు. దీంతో ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుంది. తమ కూతురు మృతికి కారణమైన భర్త శంకర్, అత్త రాజమ్మ, కోటపర్తి రవిశ్యామ్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి సమ్మక్క ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.


కల్యాణి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- జమ్మికుంటలోని స్నేహితుడి వద్దకు వచ్చి, వెళ్తుండగా ఘటన
- మృతుడి స్వస్థలం జనగాం జిల్లా గిద్దెబండ తండా

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం గిద్దెబండ తండాకు చెందిన దీరావత్ రాకేశ్(17) తన స్నేహితులు లోతు రామ్‌చరణ్, పసుమతి నిఖిల్‌లతో కలిసి జమ్మికుంటలో ఉండే స్నేహితుడి వద్దకు శుక్రవారం బైక్‌పై వచ్చాడు. వీరిలో రామ్‌చరణ్ ఇక్కడే ఉండగా రాకేశ్, నిఖిల్‌లు అదేరోజు రాత్రి తిరుగుపయనమయ్యారు. రాకేశ్ బైక్‌ను అతివేగంగా నడపడంతో హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారి స్నేహితులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బాధితులను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా రాకేశ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి జనహర్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


రాకేశ్ (ఫైల్)

కాశీకి వెళ్లొచ్చి.. తనువు చాలించి

- ఉరేసుకున్న వృద్ధుడు
- కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో విషాదం

కరీంనగర్‌క్రైం: కాశీకి వెళ్లొచ్చాడు.. అదేరోజు రాత్రి ఉరేసుకొని, తనువు చాలించాడు ఓ వృద్ధుడు. ఈ ఘటన కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో విషాదం నింపింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. గణేశ్‌నగర్‌కు చెందిన మాదూరి భూమయ్య అలియాస్ రమేశ్(70) 30 ఏళ్లుగా ఎల్ఎండీ కాలనీలో కిరాణా షాపు నడుపుతున్నాడు. 10 రోజుల క్రితం కాశీకి వెళ్లి, శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. అలసిపోయానని, నిద్రపోతానని చెప్పి, రాత్రి తన గదిలోకి వెళ్లాడు. శనివారం ఉదయం చూసిన కు టుంబసభ్యులకు ఆయన కనిపించలేదు. ఇంటిపైన రేకుల షెడ్డులో చూడగా ఉరేసుకొని కని పించాడు. కాశీ దర్శనం చేసుకున్నాడని, జీవితం ధన్యమైందని, ఇక బతికింది చాలనుకొని, ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు మృతుడి భార్య వినోద తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

రెండు బైక్‌లను ఢీకొన్న ఆటో

- ఐదుగురికి గాయాలు
- కొండగట్టులో మాల విరమణ చేసి వస్తుండగా ఘటన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రెండు బైక్‌లను ఓ ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యా యి. స్థానికులు, పోలీసు ల వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌కు చెందిన చిట్యాల గణేశ్ హనుమాన్ మాల వేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి శనివారం రెండు ద్విచక్రవాహనాలపై కొండగట్టు వెళ్లాడు. మాల విరమణ చేసి, రాత్రి తిరిగి పయనమయ్యారు. తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఎలక్ట్రిక్ గూడ్స్ ఆటో వేగంగా వచ్చి, వీరి వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ రాకేశ్‌తోపాటు గణేశ్, అతని కుటుంబసభ్యులు పూజ, జశ్వంత్, మధులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహన టెక్నీషియన్ ప్రవీణ్, పైలట్ నరేశ్‌లు క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు సిరిసిల్ల కేసు

సాక్షి, హైదరాబాద్: కాల్ సెంటర్లో ఉద్యోగం పేరుతో బలవంతంగా సైబర్ నేరాలు చేయించేందుకు ప్రయత్నించిన ముఠాపై సిరిసిల్ల పోలీసులు నమోదు చేసిన కేసు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ అయింది. ఉద్యోగం కోసం కంబోడియాకు వెళ్లిన సిరిసిల్ల యువకుడిని బలవంతంగా సైబర్ నేరాల ముఠాలో చేర్చిన విషయం తెలిసిందే. చైనా దేశస్తుడు సదరు యువకుడికి బలవంతంగా కాల్ సెంటర్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించి భారత మొబైల్ నంబర్లకు కొరియర్ సంస్థ పేరిట కాల్స్ చేసి మోసాలు చేయాలని ఒత్తిడి తెచ్చాడు. మూడు నెలల తర్వాత అక్కడి నుంచి తప్పించుకున్న యువకుడు భారత ఎంబసీ అధికారుల సహకారంతో స్వస్థలానికి చేరుకున్నాడు. ఈ మొత్తం వ్యవహారంపై సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఆ కేసు దర్యాప్తు నిమిత్తం టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ చేసినట్లు ఆ విభాగం డైరెక్టర్ షికా గోయెల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

'భాగ్యనగర్'.. మళ్లీ రద్దు

ఓదెల(పెద్దపల్లి): సికింద్రాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఫాస్ట్ ప్యాసింజర్ రైలును శనివారం నుంచి రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 1, 2, 5, 6, 8, 9వ తేదీల్లో అప్ అండ్ డౌన్.. రెండువైపులా రైలు రాకపోకలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆసిఫాబాద్ – రేచిని రైల్వేస్టేషన్ల మధ్య మూడోలైన్ మరమ్మతుల దృష్ట్యా భాగ్యనగర్ రైలు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

గోశాలలో ఆవులు మృతి



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని గోశాలలో శనివారం మూడు ఆవులు మృతి చెందాయి. శుక్రవారం మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 67 ఆవులు, ఎడ్లను బసంత్‌నగర్ పోలీసులు పట్టుకొని, గోశాలకు తరలించారు. వాటికి టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్షణ కల్పించారు. ఆ జీవాల్లో అస్వస్థకు గురై, అపస్మారక స్థితికి చేరిన పలు ఆవులకు, ఎడ్లకు పశువైద్యులు చికిత్స అందించారు. అయినా, మూడు ఆవులు చనిపోయాయి.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మంగళ్లపల్లిలో ఆది ఆశయ్య (80) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేయగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఆశయ్య మృతిపై అనుమానాలున్నాయని ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులును వివరణ కోరగా మృతిపై అనుమానాలను తొలగించేందుకే పోస్టుమార్టం కోసం పంపించామన్నారు. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కిరాణ దుకాణానికి రూ.74,947 కరెంట్ బిల్లు

జగిత్యాల: జగిత్యాల జిల్లా కొండగట్టులో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న చిన్న కిరాణ కొట్టుకు రూ.74,947 కరెంట్ బిల్లు రావడంతో కంగుతిన్నాడు. రమేశ్ అనే వ్యక్తి కొండగట్టులో ఓ గదిని అద్దెకు తీసుకుని కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. మే నెలకు సంబంధించి 168 యూనిట్లే కాలినప్పటికీ రూ.74,947 బిల్లు రావడంతో బెంబేలెత్తిపోయాడు. విద్యుత్ అధికారులను సంప్రదించగా..అంది అంతే అన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


రూ.74,947 వచ్చిన కరెంట్ బిల్లు


రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

వేములవాడకు వీకెండ్ తాకిడి

వేములవాడ: ఎములాడ రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. ఉదయం నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ జయంతి, శనివారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాలకు చెందినవారు రాజన్నను దర్శించుకున్నారు. తర్వాత బద్ది పోచమ్మకు బోనం మొక్కు చెల్లించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈవో ప్రతాప రామకృష్ణ, ఇతర అధికారులు పరిశీలించారు.

ప్రభుత్వ విప్ పూజలు

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్ర త్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వే దోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట ము న్సిపల్ వైస్ చైర్మన్ బింగి మ హేశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, రాష్ట్ర మహిళా ప్ర.దాన కార్యదర్శి పాత సత్యలక్ష్మి, నాయకులు కనికరపు రాకేశ్, ధర్మపురి శ్రీనివాస్, సాయి తదితరులున్నారు.


ఆలయ ఆవరణలో భక్తులు

70 కిలోల గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు


నిందుతులు వీరే..

- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం: గంజాయి తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు శనివారం బైపాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కారులో విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన సెరకనం రామకృష్ణ, కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన దొడ్డి మణికంఠ, మహారాష్ట్ర పబ్బని జిల్లా భీమ్‌నగర్‌కు చెందిన ధర్మేంద్రకుమార్ అలియాస్ సల్మాన్ అన్సారీలు 70 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసుల విచారణలో ఒడిశా నుంచి మహారాష్ట్రకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. వారు గంజాయి ఎవరి వద్ద కొనుగోలు చేశారు.. ఈ దందా ఎన్ని రోజులుగా కొనసాగిస్తున్నారు.. తదితర అంశాలపై లోతుగా విచారణ చేపడతామన్నారు. నిందితులను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్, ఎస్సై స్వామి, సిబ్బందిని అభినందించారు.

కొట్టి, డబ్బులు కాజేసిన ఏడుగురి అరెస్టు

జగిత్యాల క్రైం: కారు అద్దె డబ్బులు అడిగిన వ్యక్తిని కొట్టి, అతని అకౌంట్‌లోని రూ.46 వేలను కాజేసిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన నక్క అజయ్ కార్లు అద్దెకిస్తుంటాడు. పెగడపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన బొల్లారపు సురేశ్ అతని వద్ద కారు అద్దెకు తీసుకున్నాడు. కానీ, డబ్బులివ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మార్చి 5న అజయ్ సురేశ్‌కు ఫోన్ చేయగా డబ్బులిస్తానని, జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉండమని చెప్పాడు. దీంతో అజయ్ అక్కడికి వెళ్లాడు. నంబర్ లేని కారులో బొల్లారపు సురేశ్, అతని మిత్రులు ఆరెల్లి సునీల్, ఎరెల్లి సాగర్, రాధ నవీన్, తరాల శ్రీకాంత్, ఆరె రాకేశ్, మంత్రి విజయ్‌లు వచ్చి, అతన్ని బలవంతంగా కారులో ఎక్కించుకొని వెళ్లారు. అజయ్‌ని కొట్టి, చంపుతామని బెదిరించడంతోపాటు అతని ఫోన్ నుంచి ఫోన్ పే ద్వారా రూ.46 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. జగిత్యాలలో దింపి, వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం జగిత్యాల బట్టివాడ, పెగడపల్లి మండలం లింగాపూర్‌లో ఆ ఏడుగురిని అరెస్టు చేసి, రూ.8,800 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

వెల్గటూర్‌లో దొంగల బీభత్సం

- అర్ధరాత్రి ఐదిళ్లలో, ఒక షాపులో చొరబడిన వైనం
- బంగారం, వెండి, నగదు చోరీ

వెల్గటూర్ (ధర్మపురి): వెల్గటూర్ మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేరోజు ఐదిళ్లతోపాటు ఒక షాపులో చొరబడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి దాటాక దుండగులు తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసి చోరీలు చేశారు. బెస్తవాడకు చెందిన గుమ్ముల నరేశ్ ఇంట్లో చొరబడి, 4 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.5 వేలు ఎత్తుకెళ్లారు. అతను ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా, భార్య వేసవికాలం కావడంతో పిల్లలను తీసుకొని, పుట్టింటికి వెళ్లింది. అలాగే, జోగం చిలుకలయ్య, ధర్మాజీ లింగన్న, తూపుకారి శివాజీ, మరుపాక విష్ణు ఇళ్లలోనూ చోరీకి ప్రయత్నించారు. శివాజీకి చెందిన బైక్‌ను దొంగిలించేందుకు విఫలయత్నం చేశారు. ఆ వాహనంలో పెట్రోల్ లేకపోవడంతో కొంత దూరంలోని పొలాల్లో పడేసి, వెళ్లిపోయారు. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని రాష్ట్ర రహదారి పక్కన ఉన్న శ్రీవేంకటేశ్వర ఆటో మొబైల్ షాపులోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. అందులో ఏమీ దొరక్కపోవడంతో సీసీ టీవీ డీవీఆర్ బాక్స్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులు శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ పేర్కొన్నారు. పోలీసులు నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. వరుస ఘటనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాళం వేయకుండా ప్రజలెవరూ బయట పడుకోకూడదని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.


చిందరవందరగా బీరువాలోని దుస్తులు


విద్యానగర్‌లోని బాల భక్తాంజనేయ ఆలయంలో 108 కలశాల పూజ


పాతబజార్ చిన్నహనుమాన్ ఆలయంలో హోమం


కాశ్మీర్‌గడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మేయర్ పూజలు


ఆదర్శనగర్ రాజరాజేశ్వర అభయాంజనేస్వామి ఆలయంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అంజన్‌కుమార్ యాదవ్

హోమాలు.. అర్చనలు.. అభిషేకాలు

వైభవంగా హనుమాన్ పెద్ద జయంతోత్సవం


ఆంజనాద్రి గుట్టపై ప్రత్యేకాలంకరణలో స్వామివారు

కరీంనగర్‌కల్చరల్: హనుమాన్ పెద్ద జయంతి పురస్కరించుకొని శనివారం నగరంలోని పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. హనుమాన్ ఆలయాలు భక్తులు, దీక్షాపరులతో కిటకిటలాడాయి. హనుమ నామస్మరణ, భజనలు, కీర్తనలతో మార్మోగాయి. పలు ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, హోమాలు, విశేషాలంకరణలు చేశారు. నగరంలోని హెలీప్యాడ్, కాశ్మీర్‌గడ్డలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో మేయర్ సునీల్‌రావు పూజలు జరిపారు. రాంనగర్ రమా సత్యనారాయణస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్, చైర్మన్ చల్ల హరికృష్ణ, భగత్‌నగర్ అంజనాద్రిపై చిలకపాటి హనుమంతరావు పాల్గొన్నారు. విద్యానగర్ నవీనా కూర్మావాడలోని బాల భక్తాంజనేయ స్వామి ఆలయంలో మయూరగిరి పీఠాధిపతి, జ్యోతిష్యవాస్తు ఆగమశాస్త్ర పండితులు నమిలికొండ రమణాచారి స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, మండప ఆరాధనలు, 108 కలశాల ఆరాధన మహాపూర్ణాహుతి, 11సార్లు భక్తులతో హనుమాన్ చాలీసా పారాయణ వైభవంగా జరిగింది. కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి, ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో ఈవో నాగారపు శ్రీనివాస్, రామేశ్వరాలయ ఆంజనేయస్వామి సన్నిధిలో కార్పొరేటర్ కొలిపాక అంజయ్య, బీజేపీ నాయకుడు కొలిపాక శ్రీనివాస్, చైర్మన్ వెంకటేశ్వరశర్మ, ఆదర్శనగర్ రాజరాజేశ్వర అభయాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మెతుకు కనకయ్య, భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాతబజార్ చిన్నహనుమాన్ ఆలయంలో స్వామి వారికి అరటిపండ్లు సమర్పణ


ఆంజనాద్రి గుట్టపై హారతి తీసుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

ముగిసిన బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం



పతకాలు ప్రదానం చేస్తున్న ఎస్ఈ గంగాధర్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ విద్యుత్ శాఖ, షూటర్స్ బాస్కెట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. సాయంత్రం శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ట్రోఫీలు, పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ విజేందర్‌రెడ్డి, కోచ్ జీవన్ కుమార్, అనిల్‌కుమార్, రాజు, రాజ్ కుమార్, సుధీర్ కుమార్, వెంకట్ నాని, సునీల్ కుమార్, సత్యానంద్, శ్రీధర్ రావు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్య సమ్మేళనంలో కరీంనగర్ వాసులు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మే 29, 30 తేదీల్లో దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనంలో కరీంనగర్‌కు చెందిన కవులు డాక్టర్ బీవీఎన్.స్వామి, కూకట్ల తిరుపతి వక్తలుగా, ఉపాధ్యాయుడు కాసు మహేందర్ రాజు గాయకుడిగా పాల్గొన్నారు. బడిలో తెలుగు భాష అంశంపై కూకట్ల ప్రసంగించగా, బాలసాహిత్యం–ప్రమాణాలు అంశంపై డాక్టర్ బీవీఎన్.స్వామి ప్రసంగించారు. మహేందర్ రాజు చిన్నారులను ఆకట్టుకునే విధానంపై పాటలు పాడి వినిపించారు. సదస్సులో అతిథులు,గా వివిధ విభాగాలకు చెందిన ప్రముఖులతో పాటు బాల సాహితీవేత్తలు, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మేయర్ సునీల్‌రావు

విద్యానగర్(కరీంనగర్): గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడైన కాశిపాక శంకర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మరణించాడు. గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాద బీమా సౌకర్యంతో వచ్చిన రూ.లక్ష చెక్కును శనివారం బాధితుడి భార్య శంకరవ్వకు నగర మేయర్ వై.సునీల్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ జి.అశోక్, జూనియర్ ఆఫీసర్ వి.విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి

జమ్మికుంట: ప్రత్యేక రాష్ట్రం సాధించుకొని పదేళ్లు పూర్తి చేసుకొని ఉత్సవాలు నిర్వహించుకుంటున్న సందర్భంగా అమరుల కుటుంబాలకు న్యాయం జరగాలని బీఎస్పీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి మొగిలయ్య శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వందల మంది అమరులయ్యారని, సామాజిక తెలంగాణ రాలేదు, భౌగోళిక తెలంగాణ వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని ఉచితాలకు ఖర్చు పెడితే పేదలు ఇంకా నిరుపేదలవుతారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆదాయం దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు.

హెల్త్ @ సైక్లింగ్

- ఒత్తిడి దూరం.. మానసికోల్లాసం
- నిత్య వ్యాయామంలో ఉద్యోగులు, వ్యాపారులు

సండే స్పెషల్


సైక్లింగ్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు.. అదే మాట అభిరుచిగా సాగుతున్నారీ ఉద్యోగులు. మానవ తప్పిదాలతో కాలానుగుణంగా వస్తున్న మార్పులు భవిష్యత్ తరాల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తుండగా.. ప్రస్తుతం పది మందిలో ఒకరికి ఏదో అనారోగ్యం వెంటాడుతోంది. వాయు, శబ్ద కాలుష్యంతో ప్రజలు నానాఇక్కట్లు పడుతుండగా నగరాల్లో మరింత జటిలం. వానాకాలంలో ఒకే రోజున మూడు కాలాలు కనిపించిన రోజులు ఎన్నెన్నో. ఒకే రోజులో ఎండ, చలి, వాన ఆందోళనకు గురిచేయగా పర్యావరణం ప్రమాదంలో ఉందనడానికి తార్కాణం. ఈ నేపథ్యంలో రోజురోజుకూ రోగాల సంఖ్య పెరుగుతుండటంతో వ్యాయామానికి క్రేజీ పెరుగుతోంది. సరికొత్తగా యువతతో పాటు ప్ర భుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, వ్యాపారులు సైక్లింగ్ చేస్తున్నారు. వేకువజామునే రహదారుల వెంట సైకిల్ సవారీ చేస్తూ ఒత్తిడిని దూరం చేసుకుంటున్నారు. కరోనా కాలం ఆరోగ్యంపై శ్రద్ధను చూపేలా చేయగా.. ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిత్యం సైకిల్ సవారీ

సైకిల్ నుంచి విమానం వరకు మానవుని అభివృద్ధి సాగగా తిరిగి మళ్లీ మొదటి దశ కీలకమంటున్నారు ఈ ఉద్యోగులు. శరీరానికి శ్రమ లేకుండా ఉంచితే వైద్యుల పరిచయాలు పెరుగుతుంటాయనేది ప్రస్తుతం ఆసుపత్రులను పరికిస్తే అర్థమవుతుంది. ఈ క్రమంలో నగరంలో పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, వ్యాపారులు సైకిల్ సవారీని అభిరుచిగా మలచుకున్నారు. అటు కుటుంబ పోషణలో విధులు నిర్వహిస్తూ ఇటు సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ, డ్యామ్, బొమ్మకల్ బైపాస్, జగిత్యాల రోడ్డు, చింతకుంట వంటి ప్రాంతాలను ఇందుకు అనుకూలంగా మలచుకుంటున్నారు. నిత్య వ్యాయామంతో ఒత్తిడి దూరమవుతుండగా మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.


రోడ్లపై రయ్ రయ్

ప్రతిరోజూ సైక్లింగ్



మూడేళ్ల క్రితం సైక్లింగ్ అలవాటైంది. మూగజీవాలకు వైద్యం అందించడంలో అవిశ్రాంత కృషి చేయాల్సి ఉంటుంది. ఒక్కోసారి మా నసిక ఆందోళన కలిగేది. అప్పుడే ఆరోగ్యంపై దృష్టిసారించా. అంతకుముందు జిమ్, ఇతర కసరత్తులు చేసేవాణ్ని. సైక్లింగ్ చేయ డం వల్ల శరీరంలోని ప్రతీ అవయవానికి వ్యాయామమే.

– తుమ్మల కిరణ్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి, కరీంనగర్

ఆరోగ్యమే మహాభాగ్యం



ఆరోగ్యమే మహాభాగ్యమని పుస్తకాల్లో చదివేవాడిని. కానీ బాధ్యతలు పెరుగుతున్న కొద్దీ అనారోగ్య సమస్యలు తప్పవని అర్థమైంది. ఆసుపత్రుల చుట్టూ తిరిగి వేలు, లక్షలు ఖర్చు చేసే బదులు రోజూ గంటసేపు శరీర శ్రమకు కేటాయించడం ఉత్తమం. సైక్లింగ్‌తోనే రైల్వేలో ఉద్యోగం సాధించా.

– సాయికృష్ణ, రైల్వే ఉద్యోగి, కరీంనగర్

ఆరోగ్యంపై శ్రద్ధ పెరగాలి



పోటీ ప్రపంచంలో ఒకరినొకరు పట్టించుకోని పరిస్థితి. బంధాలు, అనుబంధాలు ఆర్థిక బంధాలుగా మారాయి. ఇక ఆరోగ్యంపై శ్రద్ధ కరవవుతోంది. గతంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో మధుమేహం, క్యాన్సర్, రక్తపోటు, క్షయ తదితర రోగుల సంఖ్య పెరిగిందని తేలింది. వైద్యం కోసం అప్పులు చేయకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఉత్తమం.

– రమణారెడ్డి, వ్యాపారి, కరీంనగర్

ఆరోగ్యకర వాతావరణం ముఖ్యం



చేజేతులారా మన వినాశనాన్ని మనమే సృష్టిస్తున్నం. విచ్చలవిడిగా చెట్లు నరకడం, ప్లాస్టిక్ వాడటం, కాంక్రీట్ నగరంతో ఆహ్లాదమే కరవవుతోంది. ఉద్యానవనాలు, మైదానాల సంఖ్యను పెంచాలి. పునఃవైభవం దిశగా అడుగులు పడాలి. అప్పుడే పర్యావరణ సమతుల్యతను కాపాడొచ్చు.

– జితేందర్‌రెడ్డి, వ్యాపారి, కరీంనగర్

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు


తనిఖీ చేస్తున్న రంజిత్‌కుమార్

కొత్తపల్లి: రైతులకు నాసి రకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం కొత్తపల్లి మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. డీలర్లు లైసెన్స్ గడువు, విత్తన స్టాక్ రిజిస్టర్లు, విత్తన ధరల పట్టికలను రోజువారీగా మెయింటైన్ చేయాలని సూచించారు. రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తన డీలర్ల దగ్గర విత్తనాలు చేయాలని,, ఒకే రకం పత్తి విత్తనాలపై ఆధారపడొద్దని అన్నారు. అన్ని రకాల పత్తి విత్తనాలు దాదాపు ఒకే రకమైన దిగులు ఇస్తాయని తెలిపారు. రైతులు పాటించే యజమాని పద్ధతులు సస్యరక్షణ చర్యలు మీద ఆధారపడి పంట దిగుబడి వస్తుందని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో డీలర్ దగ్గర నుంచి రశీదు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. తక్కువ ధరకు వస్తుందని నాసిరకం విత్తనాలు కొని మోసపోకూడదని తెలిపారు.

మాయమైన ఫైళ్లపై విచారణ చేపట్టాలి


ఇన్‌చార్జి వీసీకి ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్

కరీంనగర్ సిటీ: కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో గతనెల 31న మాయమైన ఫైళ్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచాల శ్రీనివాస్ శనివారం యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ సురేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పెంచాల శ్రీనివాస్ మాట్లాడుతూ వర్సిటీలో మాయమైన ఫైల్స్ గురించి సీసీ కెమెరాలు తనిఖీ చేసి విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా ఐదుగురు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అక్రమ తొలగింపు, బిల్డింగ్ నిర్మాణంలో అవకతవకలు, పరీక్ష జవాబు పత్రాల స్కానింగ్‌లో అవినీతి, వాహనాల యాక్సిడెంట్లలో అక్రమాలు తదితర సమస్యలన్నింటిపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ పిల్లి శ్రీలత

కొత్తపల్లి: మండలంలోని ఆసిఫ్‌నగర్ జెడ్పీ హైస్కూల్‌లో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు–టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తపల్లి మండలస్థాయి క్రికెట్ టోర్నమేట్‌ను శనివారం ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ ప్రారంభించారు. విన్నర్ టీమ్‌కు రూ:15,000, రన్నర్ టీమ్‌కు రూ:8,000 ప్రైజ్‌మనీ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ రెడ్డవేణి మధు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు సాబీర్, ఎంపీటీసీ దామ కమలమనోహర్, నాయకులు కడారి శ్రీనివాస్, పెంచాల ఆంజనేయులు, తిరుపతి, దేవేందర్, గాలిపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

థల్ సైనిక్ గ్రూప్ ఫైరింగ్ పోటీలకు ఎన్‌సీసీ కేడెట్లు


కేడెట్లను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఆదివారం నుంచి ఈనెల 10 వరకు గజ్వేల్ జిల్లాలో జరుగనున్న థల్ సైనిక్ గ్రూప్ ఫైరింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల ఎన్‌సీసీ 9వ బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాణించిన సాయి వీక్షిత్, త్రిదేవ్, సాహిత్ లు ఎంపికయ్యారన్నారు. కేడెట్లను పారమిత విద్యాసంస్థల అధినేత ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనూకర్ రావు, వినోద్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమయాన్ని వృథా చేయొద్దు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేయర్ సునీల్‌రావు

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. నగరంలోని బ్లూమెన్ డ్యాన్స్ అకాడమీలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన జూనియర్స్‌కు శనివారం నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సల్వాజీ ప్రవీణ్, కర్ణాటక సంగీతం మాస్టర్ గొల్లపల్లి రవీందర్, డ్యాన్స్ మాస్టర్, డ్యాన్స్ అకాడమీ చైర్మన్ శ్రీరామోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలో సోమవారం నుంచి పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాయబోయే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు సకాలంలో పరీక్షకు విధిగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. రెండు ట్రాక్టర్లలో ఇసుకను జమ్మికుంటకు తరలిస్తుండగా నర్సింగాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని, ఇసుక రవాణకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ట్రాక్టర్లతో పాటు యజమానులు బండారి రమేశ్, ఐలవేని అనిల్‌పై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జమ్మికుంట: మండలంలోని కోరపల్లి ఉన్నత పాఠశాల 2000–01 పదో విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, విఠల్‌రావు, మహిపాల్ రెడ్డి, సారయ్య, శ్రీనివాస్, ప్రస్తుత ప్రిన్సిపల్ సమ్మయ్యను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు భాస్కర్, వీరస్వామి, సురేష్, రమేష్, మధుకర్, మొండయ్య, నాగరాజు, సునీత, సుజాత, మమత, నాగలక్ష్మి, త్రివేణి, రజిత ఆత్మీయ సమ్మేళనానికి అందరూ హాజరయ్యే విధంగా కృషి చేశారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన చాడ వెంకట్‌రెడ్డి


పరామర్శిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు సీపీఐ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, సింగిల్‌విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని పటేల్, మాజీ ఎంపీటీసీ కొండయ్య, నాయకులు తమ్మిశెట్టి రవీందర్, ప్రవీణ్, అంజయ్య పలువురు పాల్గొన్నారు.



గాయత్రి-ట్రెసా జోరుకు సెమీస్‌లో బ్రేక్

సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన విజయాలతో దూసుకెళ్తున్న పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి సెమీఫైనల్లో చుక్కెదురైంది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీస్‌లో భారత ద్వయం 21-23, 11-21తో ప్రపంచ నాలుగో ర్యాంకు జోడీ నమి మత్సుయామ-చిహారు షిదా (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది. 47 నిమిషాల పాటు జరిగిన ఈ పోరాటంలో గాయత్రి-ట్రెసా జంట తొలి గేమ్‌లో నాలుగో సీడ్ ప్రత్యర్థులతో హోరాహోరీగా తలపడింది. ఒక దశలో 5-10తో వెనుకబడిన వీరు చక్కటి ఆటతో స్కోరును 16-16 వరకు తీసుకొచ్చారు. ఆ తర్వాత జపాన్ జోడి 20-18తో గేమ్ పాయింట్ వద్ద నిలిచినా...భారత ద్వయం సులువుగా తలవంచలేదు. చివరకు ఈ గేమ్‌లో పోరాడి ఓడింది. రెండో గేమ్‌లో మాత్రం జపాన్ జంట జోరుకు ఎదురు నిలువ లేకపోయింది. చెలరేగిన ఈ జోడి 20-6తో తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకుపోయింది. గాయత్రి-ట్రెసా పట్టుదలగా ఆడి మరో 5 పాయింట్లు సాధించినా...ఆ తర్వాత పరాజయం తప్పలేదు. తాజా ఫలితంతో జపనీస్ ద్వయం ఫిబ్రవరిలో ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో గాయత్రి-ట్రెసా జోడీ చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకుంది.

'విశ్వ' వేదికపై ధనాధన్

పదిహేడేళ్ల క్రితం... ఐసీసీ తొలి టి20 ప్రపంచకప్‌ను నిర్వహించింది. ఆ మెగా ఈవెంట్‌లో విజేతగా నిలిచిన భారత్ టి20 ఫార్మాట్‌కు కొత్త దశ, దిశను చూపించింది. కానీ ఆ తర్వాత ఏడు ప్రయత్నాల్లోనూ మరో టైటిల్ సాధించడంలో విఫలమైంది. ఇప్పుడైనా మన అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెర పడుతుందా! మరో వైపు విధ్వంసక బ్యాటింగ్‌తో ఆట రూపు మార్చిన వెస్టిండీస్, ఇంగ్లండ్ రెండేసి ట్రోఫీలతో అగ్ర స్థానంలో నిలిచాయి. ఈ రెండు జట్లు తమకు తెలిసిన అదే విద్యతో మూడో టైటిల్‌పై కన్నేశాయి. ఆల్‌రౌండర్ల అడ్డా ఆస్ట్రేలియా, మరో మాజీ చాంపియన్ శ్రీలంక రెండో ట్రోఫీపై గురి పెట్టాయి. ఈ సారైనా తొలి టైటిల్ అందుకోవాలని న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా విశ్వప్రయత్నం చేసేందుకు సిద్ధమయ్యాయి. ఇక గత ఫైనలిస్ట్ పాకిస్తాన్ కూడా అనూహ్య ప్రదర్శనతో మరో సారి విజేతగా నిలుస్తుందా అనేది ఆసక్తికరం. ఈ ఎనిమిది అగ్రశ్రేణి జట్లకు తోడు మరో 12 టీమ్‌లు విశ్వ వేదికపై తమ ముద్ర చూపాలని పట్టుదలగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తొమ్మిదో టి20 ప్రపంచ కప్ సంగ్రామానికి నేటితో తెర లేవనుంది.



టి20 ప్రపంచకప్‌తో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

నేటి నుంచి టి20 వరల్డ్ కప్

- బరిలో 20 జట్లు
- తొలి పోరులో కెనడాతో అమెరికా ఢీ
- బుధవారం భారత్ మొదటి మ్యాచ్

న్యూయార్క్: తొలి సారి అగ్రరాజ్యం అమెరికా వేదికగా క్రికెట్ ప్రపంచకప్‌కు రంగం సిద్ధమైంది. వెస్టిండీస్‌తో కలిసి ఈ సారి అమెరికా టి20 వరల్డ్ కప్ టోర్నీకి ఆతిథ్యం ఇస్తోంది. వెస్టిండీస్‌లో 2010లోనే ఈ మెగా పోరు జరిగింది. క్రికెట్‌ను మరిన్ని దేశాలకు విస్తరింపజేయడంలో భాగంగా ఐసీసీ తొలి సారి 20 జట్లతో వరల్డ్ కప్ నిర్వహిస్తోంది. ర్యాంకింగ్, ఆతిథ్య జట్టు హోదాలో టీమ్‌లు ముందుగా అర్హత సాధించగా...క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా ఇతర జట్లు బరిలో నిలిచాయి. ఈ టోర్నీ కోసం అమెరికాలో ప్రత్యేకంగా క్రికెట్ మైదానాలను సిద్ధం చేశారు. అప్పటికి మల్టీ పర్పస్ స్టేడియాలుగా ఉన్నవాటిని బయటినుంచి తీసుకొచ్చిన 'డ్రాప్ ఇన్' పిచ్‌లతో క్రికెట్ మ్యాచ్‌ల వేదికలుగా మార్చారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ కూడా భాగంగా ఉండటంతో ఈ వరల్డ్ కప్ ద్వారా అక్కడి అభిమానులను ఆకర్షించేందుకు ఐసీసీ ప్రయత్నిస్తోంది. తొలి పోరులో ఆతిథ్య అమెరికా జట్టు తమ చిరకాల ప్రత్యర్థి కెనడాతో తలపడనుంది.

నాలుగు గ్రూప్‌లుగా...

మొత్తం 20 జట్లను 5 జట్ల చొప్పున 4 గ్రూప్‌లుగా విభజించారు. ఆయా జట్లు తమ గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో తలపడతాయి. టాప్-2లో నిలిచిన రెండు టీమ్‌లు ముందంజ వేస్తాయి. ఆ దశలో ఎనిమిది టీమ్‌లతో రెండు గ్రూప్‌లుగా విడదీసి సూపర్ ఎయిట్ నిర్వహిస్తారు. ఇక్కడ మరో మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుంది. ఆపై సెమీస్, ఫైనల్ జరుగుతాయి. వెస్టిండీస్‌లో ఆరు, అమెరికాలలో మూడు వేదికలలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

భారత్ ఎంత వరకు...

తొలి వరల్డ్ కప్ విజయాన్ని మినహాయిస్తే భారత్ మరో మూడు సార్లు చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబర్చింది. 2014లో ఫైనల్లో ఓడిన జట్టు...2016, 2022లలో సెమీ ఫైనల్ చేరింది. మిగిలిన నాలుగు సందర్భాల్లో లీగ్ దశకే పరిమితమైంది. ఈ సారి కూడా దాదాపుగా రెండేళ్ల క్రితం బరిలోకి దిగిన జట్టుతోనే టీమిండియా తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. రోహిత్ శర్మ కెప్టెన్సీ, రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా ఈ బృందం తమ అత్యుత్తమ ఆట తీరును కనబరిస్తే మంచి ఫలితాలు రాబట్టవచ్చు. మన జట్టు స్థాయి, ఆటగాళ్ల ఫామ్‌ను చూస్తే సెమీఫైనల్ వరకు వెళ్లడం ఖాయం. మిగిలిన రెండు నాకౌట్ మ్యాచ్‌లే కీలకమైనవి.

వరల్డ్ కప్‌లో నేటి మ్యాచ్‌లు

అమెరికా X కెనడా
ఉదయం.గం.6.00 నుంచి

వెస్టిండీస్ X పపువా న్యూగినియా
రాత్రి.గం. 8.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

అబ్రహామ్ లింకన్ బొమ్మతో...



ఆశ్చర్యకరమే అయినా క్రికెట్ చరిత్రలో అతి పురాతన సమరంగా అమెరికా, కెనడా మధ్య పోరుకు గుర్తింపు ఉంది. 1877లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు జరిగినా...దానికి చాలా ఏళ్ల క్రితమే 1844లో మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో అమెరికా, కెనడా తలపడినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. 180 సంవత్సరాల తర్వాత ఇప్పుడు అమెరికా, కెనడా మధ్య టి20 వరల్డ్ కప్‌లో సమరం జరగబోతోంది. ఇరు జట్లకు టి20 వరల్డ్ కప్ చరిత్రలో ఇదే తొలి మ్యాచ్ కావడం విశేషం. డాలస్‌కు ఈ మ్యాచ్ వేదికవుతోంది. స్థానికంగా క్రికెట్ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నంలో మార్కెటింగ్ నిపుణులు కొత్త తరహా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్యాడ్‌లు, బ్యాట్‌తో 'స్కోర్ ఫోర్' అని రాసి ఉన్న అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ బొమ్మ ముద్రించిన టీ షర్ట్‌లను పీజే గోడ్‌హాల్స్ అనే ఔత్సాహిక వ్యాపారి, క్రికెట్ అభిమాని ఈ మ్యాచ్ వేదికపై అమ్మకానికి ఉంచాడు. 1849లో చికాగో, మిల్‌వాకీ నగరాల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు లింకన్ అతిథిగా హాజరయ్యారు.

'సాధన' సరిపోయింది

- వామప్ మ్యాచ్‌లో భారత్ విజయం
- 60 పరుగులతో బంగ్లాదేశ్ చిత్తు
- టీమిండియా సమష్టి ప్రదర్శన

న్యూయార్క్: బ్యాటింగ్‌లో రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా తమదైన శైలిలో దూకుడుగా ఆడారు...సూర్యకుమార్, రోహిత్ శర్మ కూడా కీలక పరుగులు సాధించారు. దూబే, సామ్సన్ మాత్రం ఈ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు...బౌలింగ్‌లో కూడా ప్రధాన బౌలర్లంతా బరిలోకి దిగి ఆకట్టుకున్నారు...ఓవరాల్‌గా టి20 వరల్డ్ కప్‌లో ప్రధాన టోర్నీకి ముందు ఏకైక వామప్ మ్యాచ్‌లో భారత జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చింది. దీని ద్వారా టీమ్ తుది జట్టుపై ఒక అంచనా కూడా వచ్చింది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి ఆడలేదు. యశస్వికి మ్యాచ్ ఇవ్వకపోవడాన్ని బట్టి చూస్తే ప్రధాన జట్టులో అతను ఉండే అవకాశాలు దాదాపుగా లేకపోవడంతో పాటు రోహిత్, కోహ్లి ఓపెనర్లుగా బరిలోకి దిగవచ్చు. ఇక్కడ విఫలమైనా...టాపార్డర్‌లో సామ్సన్ పేరును టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలిస్తుండగా, దూబే బౌలింగ్ చేయడాన్ని బట్టి చూస్తే ఆల్‌రౌండర్‌గా జట్టుకు మంచి ప్రత్యామ్నాయం అందుబాటులో ఉన్నట్లే. మరో వైపు కొత్తగా నిర్మించిన నాసా కౌంటీ క్రికెట్ గ్రౌండ్ మాత్రం వరల్డ్ కప్ స్థాయికి తగినట్లుగా కనిపించలేదు. అవుట్‌ఫీల్డ్ బంతి పడ్డ ప్రతి చోటా దుమ్ము రేగడం చూస్తే ఈ స్టేడియంను సిద్ధం చేయడంలో ఐసీసీ తొందరపడినట్లు అనిపించింది. ఇదే వేదికపై భారత్ లీగ్ దశలో తమ తొలి మూడు మ్యాచ్‌లు ఆడనుంది. మ్యాచ్ ఫలితంతో సంతృప్తి చెందినట్లు, తాము అనుకున్న రీతిలో ప్రాక్టీస్ లభించినట్లు విజయం అనంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు.

శనివారం జరిగిన వామప్ పోరులో భారత్ 62 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. రిషభ్ పంత్ (32 బంతుల్లో 53 రిటైర్డ్ అవుట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. సూర్యకుమార్ యాదవ్ (18 బంతుల్లో 31; 4 ఫోర్లు) రాణించగా, రోహిత్ శర్మ (19 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించగా... శివమ్ దూబే (14), సంజు సామ్సన్ (1) విఫలమయ్యారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 122 పరుగులు చేసింది. మహ్మదుల్లా (28 బంతుల్లో 40 రిటైర్డ్ అవుట్; 4 ఫోర్లు, 1 సిక్స్), షకీబ్ అల్ హసన్ (34 బంతుల్లో 28; 2 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే చెరో 2 వికెట్లు పడగొట్టగా...అక్షర్ పటేల్, బుమ్రా, సిరాజ్, హార్దిక్ పాండ్యా ఒక్కో వికెట్ పడగొట్టారు.


పంత్

ప్రిక్వార్టర్స్ చేరిన రిబాకినా

- జ్వెరెవ్, అల్‌కరాజ్ కూడా...
- ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో కజకిస్తాన్ స్టార్ రిబాకినా, రెండో సీడ్ సబలెంక అలవోక విజయాలతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడోరౌండ్లో నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6-4, 6-2తో వరుస సెట్లలో ఎలైస్ మెర్టెన్స్ (బెల్జియం)ను చిత్తు చేయగా, రెండో సీడ్ సబలెంక (రష్యా) 7-5, 6-1తో బడొసా (స్పెయిన్)పై నెగ్గింది. ఆస్ట్రేలియా ఓపెన్ రన్నరప్, ఏడోసీడ్ క్వినెన్ జెంగ్‌కు రష్యా ప్లేయర్ ఎలీనా అవనెసియాన్ షాకిచ్చింది. మూడో రౌండ్లో అన్‌సీడెడ్ ఎలీనా 3-6, 6-3, 7-6 (10/6)తో చైనా స్టార్‌ను ఇంటిదారి పట్టించింది. మరో మ్యాచ్‌లో వింబుల్డన్ చాంపియన్ మార్కెటా వొండ్రొసొవా (చెక్ రిపబ్లిక్) 6-1, 6-3తో క్లో పాక్వెట్ (ఫ్రాన్స్)పై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరింది. పురుషుల సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్, అల్‌కరాజ్ ముందంజ వేశారు. మూడోరౌండ్లో నిరుటి సెమీఫైనలిస్ట్, నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 3-6, 6-4, 6-2, 4-6, 7-6 (10/3)తో టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)పై శ్రమించి నెగ్గాడు. స్పెయిన్ స్టార్, మూడో సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ 6-4, 7-6 (7/5), 6-3తో 27వ సీడ్ సెబాస్టియన్ కోర్డా (అమెరికా)పై గెలుపొందగా, సిట్సిపాస్ (గ్రీస్) 6-3, 6-3, 6-1తో జాంగ్ జిజెన్ (చైనా)ను ఓడించాడు. ఆస్ట్రేలియా ఓపెన్ రన్నరప్, ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 7-6 (7/4), 7-5, 1-6, 6-4తో థామస్ మచక్ (చెక్ రిపబ్లిక్)పై చెమటోడ్చి విజయం సాధించాడు.

శ్రీరామ్ బాలాజీ ముందంజ

భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ ఫ్రెంచ్ ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్నాడు. పురుషుల డబుల్స్‌లో మిగెల్ వరేలా (మెక్సికో)తో జోడీకట్టిన బాలాజీ మూడో రౌండ్లోకి ప్రవేశించాడు. రెండో రౌండ్లో భారత్-మెక్సికన్ ద్వయం 6-4, 3-6, 6-2తో డాన్ ఆడెడ్-థియో అరిబేజ్ (ఫ్రాన్స్) జంటపై గెలిచింది.


రిబాకినా


నాగ్ అశ్విన్, ప్రియాంక, అశ్వినీదత్, స్వప్న


'దిల్' రాజు, అనిల్ రావిపూడి


రవిశంకర్, నవీన్, సుకుమార్


బుచ్చిబాబు


సునీల్, రామ్మోహన్ రావు, శేఖర్ కమ్ముల

సినిమా

లెక్క కుదిరింది

కెప్టెన్ ఆఫ్ ది షిప్ (డైరెక్టర్)కి, షిప్ ఓనర్ (ప్రొడ్యూసర్)కి మధ్య మంచి రిలేషన్ ఉండాలి. షిప్ (సినిమా)ని జాగ్రత్తగా హ్యాండిల్ చేసి, యజమాని నష్టపోకుండా కెప్టెన్ చూసుకుంటే.. ఇక అతనికి, యజమానికీ మధ్య మంచి అవగాహన కుదురుతుంది. మళ్లీ మళ్లీ కలిసి ప్రయాణం చేయాలనుకుంటారు. అలా లెక్కలు కుదిరి కొన్ని కాంబినేషన్లు రిపీట్ అవుతున్నాయి. ఇలా ఓ దర్శకుడికి-నిర్మాతకి మధ్య స్నేహం కుదరడం, మళ్లీ కలిసి సినిమాలు చేయాలనుకోవడం ఓ ఆరోగ్యకరమైన వాతావరణం అని చెప్పాలి. రిపీట్ అవుతున్న ఆ దర్శక-నిర్మాతల కాంబినేషన్ గురించి తెలుసుకుందాం.

మూడోసారి 'దిల్' కలిసింది

కుటుంబ నేపథ్యంలో సినిమాలు తీసి విజయాలు అందుకునే నిర్మాతగా 'దిల్' రాజుకి పేరుంది. ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకునేలా సినిమా తెరకెక్కించగల దర్శకుడు అనిల్ రావిపూడి. వీరిద్దరి కాంబినేషన్‌లో సుప్రీమ్ (2016), 'రాజా ది గ్రేట్' (2017), 'ఎఫ్ 2' (2019), 'సరిలేరు నీకెవ్వరు' (2020), 'ఎఫ్ 3' (2022) వంటి హిట్ సినిమాలు వచ్చాయి. తాజాగా అనిల్-'దిల్' రాజు కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఇందులో వెంకటేశ్ హీరో. హిట్ చిత్రాలు 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' తర్వాత వెంకటేశ్-అనిల్ రావిపూడి-'దిల్' రాజు కాంబినేషన్‌లో రూపొందనున్న మూడో చిత్రమిది. ఈ సినిమాకి 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్ అనుకుంటున్నారట.

గురు-శిష్యులతో మైత్రీ

డైరెక్టర్ సుకుమార్-మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'రంగస్థలం' (2018). రామ్‌చరణ్, సమంత జోడీగా నటించిన ఈ మూవీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సుకుమార్-మైత్రీ కాంబినేషన్‌లో రూపొందిన రెండో చిత్రం 'పుష్ప: ది రైజ్' (2021). అల్లు అర్జున్, రష్మికా మందన్న జోడీగా నటించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో వసూళ్ల వర్షం కురిపించింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా సుకుమార్-నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ కాంబినేషన్‌లో 'పుష్ప 2: ది రూల్' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలోనూ అల్లు అర్జున్, రష్మికానే జోడీగా నటిస్తున్నారు. ఆగస్టు 15న ఈ సినిమా రిలీజ్ కానుంది.

- సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సనాని దర్శకునిగా పరిచయం చేస్తూ వైష్ణవ్ తేజ్, కృతీ శెట్టి జంటగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'ఉప్పెన' (2021) బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తన రెండో చిత్రాన్ని కూడా మైత్రీలోనే చేస్తున్నారు బుచ్చిబాబు. రామ్‌చరణ్ హీరోగా నవీన్, రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్.


టీజీ విశ్వప్రసాద్, కార్తీక్


శ్రీకాంత్ చెరుకూరి, శ్రీకాంత్ ఓదెల


నాగవంశీ, వెంకీ


ప్రశాంత్ వర్మ, నిరంజన్ రెడ్డి

హోమ్ బేనర్‌లో నాగ్ అశ్విన్

ఇంట్లోనే ఒక పెద్ద బేనర్ ఉంటే బయట బేనర్ల అవసరం అంతగా ఉండదు. డైరెక్టర్ నాగ్ అశ్విన్‌కి రెండు హోమ్ బేనర్లు వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఉన్నాయి. అశ్వినీదత్ రెండో కుమార్తె ప్రియాంక, నాగ్ అశ్విన్ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వైజయంతీ మూవీస్‌పై అశ్వినీదత్, స్వప్న సినిమాస్‌పై ఆయన కుమార్తెలు ప్రియాంక, స్వప్న సినిమాలు నిర్మిస్తున్నారు. ఈ బేనర్లలో 'ఎవడే సుబ్రమణ్యం' (2015), 'మహానటి' (2018) సినిమాలకు దర్శకత్వం వహించారు నాగ్ అశ్విన్. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ నిర్మించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ హీరోగా సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ నెల 27న రిలీజ్ కానుంది.

శేఖర్‌తో మరో సినిమా

ప్రేమకథలే కాదు.. కుటుంబ కథలనూ తనదైన శైలిలో తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు శేఖర్ కమ్ముల. ఆయన ప్రస్తుతం ధనుష్, నాగార్జున హీరోలుగా 'కుబేర' సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. కాగా శేఖర్, సునీల్ నారంగ్, రామ్మోహన్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న రెండో చిత్రం ఇది. ఈ కాంబినేషన్‌లో నాగచైతన్య, సాయి పల్లవి జంటగా వచ్చిన 'లవ్ స్టోరీ' (2021) సూపర్ హిట్టయింది.

సార్‌తో ఆరంభమై లక్కీతో మళ్లీ...

డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'సార్' (తమిళంలో వాత్తి). ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో గత ఏడాది విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ దర్శక-నిర్మాతల కాంబినేషన్‌లో తాజాగా 'లక్కీ భాస్కర్' సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జంటగా నటిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా సెప్టెంబరు 27న రిలీజ్ కానుంది.

హీరో కూడా రిపీట్

శ్రీకాంత్ ఓదెల దర్శకునిగా పరిచయమైన చిత్రం 'దసరా' (2023). తొలి చిత్రంతోనే నానిని దర్శకత్వం వహించే చక్కని అవకాశం అందుకుని సద్వినియోగం చేసుకున్నారు. నాని, కీర్తీ సురేష్ జోడీగా శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కాగా 'దసరా' కాంబినేషన్‌లోనే మరో సినిమా రానుంది. నాని కెరీర్‌లో ఇది 33వ చిత్రం. ఈ చిత్రాన్ని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తారు.

రెండోసారి రెండు భాగాలతో...

'ఈగల్' చిత్రం తర్వాత డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని-పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో 'మిరాయ్' సినిమా రూపొందుతోంది. రవితేజ, అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరో, హీరోయిన్లుగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన 'ఈగల్' ఈ ఏడాది విడుదలైంది. ప్రస్తుతం కార్తీక్-విశ్వప్రసాద్ కాంబినేషన్‌లో 'మిరాయ్' చిత్రం రూపొందుతోంది. తేజ సజ్జా, రితికా నాయక్ జంటగా నటిస్తున్న 'మిరాయ్'లో మంచు మనోజ్ కీలక పాత్ర చేస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా తొలి భాగం 2025 ఏప్రిల్ 18న రిలీజ్ కానుంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2డీ, 3డీ వెర్షన్లలోనూ రిలీజ్ కానుంది.

ఈసారి 'జై హనుమాన్'తో...

సంక్రాంతి అంటే స్టార్ హీరోల చిత్రాల పోటీ ఉంటుంది. అయితే ఈ ఏడాది సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాలతో పోటీ పడి, ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై బ్లాక్ బస్టర్ అయిన చిత్రం 'హనుమాన్'. తేజ సజ్జా హీరోగా ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో హిట్ అయింది. ఇక 'హనుమాన్'కి సీక్వెల్‌గా ప్రశాంత్ వర్మ-చైతన్య-నిరంజన్ రెడ్డి కాంబినేషన్‌లో 'జై హనుమాన్' రూపొందుతోంది. 2025లో ఈ చిత్రం విడుదల కానుంది.


వీరే కాదు.. మరికొందరు దర్శక-నిర్మాతల కాంబినేషన్స్ కూడా రిపీట్ అవుతున్నాయి.

బ్లాక్ బస్టర్ గ్యారెంటీ - హీరో శర్వానంద్

"'మనమే' ఫ్యామిలీ అంతా కలసి ఎంజాయ్ చేసే సినిమా. ఈ చిత్రాన్ని తల్లితండ్రులకు అంకితం ఇస్తున్నాం. ఈసారి బ్లాక్ బస్టర్ గ్యారెంటీ" అన్నారు హీరో శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'మనమే'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో రామ్‌చరణ్ లాంచ్ చేశారు. అనంతరం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ– "నా కెరీర్‌లో ఈ సినిమా ఓ మ్యాజిక్.. ఆ మ్యాజిక్‌ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు" అన్నారు. "'మనమే' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్" అన్నారు చిత్ర సహనిర్మాత వివేక్ కూఛిబొట్ల. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కృతీ ప్రసాద్, అసోసియేట్ ప్రొడ్యూసర్ ఏడిద రాజా మాట్లాడారు.


కృతీ శెట్టి, శర్వానంద్

హైదరాబాద్‌లో స్వయంభూ


నిఖిల్

నిఖిల్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియన్ చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లు. 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. కాగా శనివారం (జూన్ 1) నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా 'స్వయంభూ' మూవీ నుంచి స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. "ఈ చిత్రంలో లెజెండరీ వారియర్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు నిఖిల్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో వేసిన సెట్‌లో జరుగుతోంది. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' వంటి భారీ చిత్రాలకు పని చేసిన సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ 'స్వయంభూ'లో తన మ్యాజిక్ చూపించనున్నారు" అని యూనిట్ పేర్కొంది.

డూప్ లేకుండా కాజల్ ఫైట్ చేశారు - సుమన్ చిక్కాల



"'సత్యభామ' కథలో ఎమోషన్, యాక్షన్ రెండూ ఉన్నాయి. భావోద్వేగాలను పండించడంలో కాజల్ అగర్వాల్‌కి మంచి పేరుంది. ఆమె యాక్షన్ చేస్తే కొత్తగా ఉంటుందనిపించింది. ఎమోషన్, యాక్షన్ ఆమె చక్కగా చేశారు. ఈ రెండింటికీ ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు" అన్నారు డైరెక్టర్ సుమన్ చిక్కాల. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. డైరెక్టర్ శశికిరణ్ తిక్క సమర్పణలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమన్ చిక్కాల మాట్లాడుతూ– "శశికిరణ్ తిక్క వద్ద స్క్రిప్ట్ సైడ్ వర్క్ చేశాను. నాపై నమ్మకంతో దర్శకత్వం బాధ్యత అప్పగించాడు తను. 'సత్యభామ' పూర్తిగా ఫిక్షన్ కథ. ఒక కేసు విషయంలో బాధితురాలికి న్యాయం చేసే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కాజల్ పాత్రకి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్సులు చేశారామె. ఆంధ్రప్రదేశ్‌లోని దిశ యాప్, తెలంగాణలో షీ సేఫ్ యాప్ గురించి మా మూవీలో చూపించాం. ఎవరైనా ఈ యాప్స్ గురించి తెలుసుకుని ఆపదలో వాడితే వారికి మా సినిమా ద్వారా ఒక సందేశం చేరినట్లే" అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఆరేళ్ల తర్వాత పాత నేరస్తుడి అరెస్టు

- కెనడాలో ఉద్యోగాల పేరిట మోసం..

సాక్షి, హైదరాబాద్‌: కెనడాలో ఉద్యోగంతోపాటు జాబ్ వీసా ఇప్పిస్తానంటూ రూ.లక్షలు వసూలు చేసి ఉడాయించిన పాత నేరస్తుడిని సీఐడీ అధికారులు ఆరేళ్ల తర్వాత అరెస్టు చేశారు. నిందితుడు వికాస్ ఖిందార్‌ను సీఐడీ ఎస్‌టీడబ్ల్యూ అమలు ప్రత్యేక బృందం పోలీసులు మే 27న పంజాబ్‌లోని జలంధర్ పట్టణలో అరెస్టు చేసినట్టు సీఐడీ అడిషనల్ డీజీ శిఖాగోయల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో నిందితుడు వికాస్ ఖిందార్ మరో ఇద్దరితో కలిసి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి.. నిజామాబాద్ జిల్లా భీంగల్, ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొందరి నుంచి రూ.48 లక్షలు వసూలు చేసి మోసగించినట్టు ఫిర్యాదులు అందాయి. ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేశారు. పరారీలో ఉన్న నిందితుడు వికాస్ ఖిందార్‌పై నిజామాబాద్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. వికాస్ అరెస్టులో కీలకంగా పనిచేసిన ఇన్‌స్పెక్టర్ జె.ఆంజనేయులు, ఎస్‌ఐ ఎం.నరేశ్, ఏఎస్‌ఐలు యూనుస్‌ఖాన్, జె.రత్నాంజిరావు, మదన్‌మోహన్‌రెడ్డి, జె.శంకరయ్యలను శిఖాగోయల్ అభినందించారు.

గ్రూప్‌-1 పరీక్షలు నెలరోజులు వాయిదా వేయాలి: కృష్ణయ్య

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): గ్రూప్‌-1 పరీక్షలు ప్రభుత్వం నెల రోజులపాటు వాయిదా వేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నిరుద్యోగ సంఘాల నాయకులు, గ్రూప్‌-1 అభ్యర్థులతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 9న గ్రూప్‌-1, హెచ్‌ఏఎల్, ఐబీ పరీక్షలు ఉన్నాయి కాబట్టి గ్రూప్‌-1 వాయిదా వేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఇప్పటికే నిరుద్యోగుల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగాలు పెంచి నోటిఫికేషన్లు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చారని అందుకు తగ్గట్టుగా గ్రూప్‌-1 ఉద్యోగాలు పెంచి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు.


వడదెబ్బతో తొమ్మిది మంది మృతి

సాక్షి నెట్‌వర్క్‌: విపరీతమైన ఎండల దెబ్బకు శనివారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం మండలంలోని పాపటపల్లికి చెందిన పోతనబోయిన గురవయ్య(65), పుప్పాల రామయ్య(90), కూసుమంచికి చెందిన బొమ్మ దశరథ(70), తల్లాడ మండలం మంగాపురంలో గాదె వెంకటేశ్వర్లు(58), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం కొమ్ముగూడెంకు చెందిన సోయం రాముడు(56), సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంకి చెందిన బిక్కినేటి ఉపేంద్ర(52), కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన చిందం అన్నవ్వ(86), నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన అలకుంట్ల శాంతమ్మ(79), మాడుగులపల్లి మండలం గజలాపురం గ్రామానికి చెందిన మద్దిరాల వెంకట్‌రెడ్డి (60) వడదెబ్బ బారిన పడి మృతి చెందారు.

ఆ పిల్లల రోదన తీరేదెప్పుడు?

అటు కన్న పేగు.. ఇటు పెంచిన ప్రేమకు దూరం

- అనాథల్లా శిశు విహార్‌లో 13 మంది చిన్నారులు
- చుట్టూ కొత్తవారు కావడంతో గుక్కపెట్టి ఏడుపులు
- అసలు పేరెంట్స్ ఎవరనేది తేలే వరకూ తప్పని రోదన
- ప్రధాన నిందితులు చిక్కితేనే కేసు కొలిక్కి
- ఢిల్లీ, పుణేల్లో రెండు ప్రత్యేక బృందాల గాలింపు
- త్వరలోనే పెంపుడు తల్లిదండ్రుల అరెస్టు



సాక్షి, హైదరాబాద్‌: అప్పటివరకు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పసిపిల్లలను ఒక్కసారిగా తమ నుంచి దూరం చేశారని పెంపుడు తల్లిదండ్రుల ఆవేదన ఒకవైపు.. కన్నవాళ్లు, పెంపుడు తల్లిదండ్రులు.. ఎవరూ కనిపించక పిల్లల రోదన మరోవైపు.. వెరసి యూసుఫ్‌గూడలోని శిశు విహార్ వద్ద పరిస్థితి కంట నీరు తెప్పిస్తోంది. పరారీలో ఉన్న ఢిల్లీ, పుణేకు చెందిన ప్రధాన నిందితులు పోలీసులకు చిక్కి, పిల్లల అసలు తల్లిదండ్రులు ఎవరనేది తేలే వరకూ ఈ పసికందుల ఆక్రందన తప్పేలా లేదు.

–సంచలనం సృష్టించిన పిల్లల విక్రయం కేసును ఎలా కొలిక్కి వస్తుందనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. హైదరాబాద్, విజయవాడకు చెందిన పిల్లల విక్రయం ముఠా ఇప్పటివరకు 60కి పైగా చిన్నారులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విక్రయించగా.. వీరిలో 13 మంది శిశువులను పోలీసులు రక్షించి, శిశు విహార్‌లో చేర్పించ సంగతి తెలిసిందే. మధ్యవర్తులు ఢిల్లీ, పుణేలకు చెందిన కిరణ్, ప్రీతి, కన్నయ్య నుంచి పిల్లలను తీసుకొచ్చి, పెంపుడు తల్లిదండ్రులకు విక్రయించారు. ఈ పిల్లల అసలు తల్లిదండ్రులు ఎవరు? నిందితులు పేద తల్లిదండ్రుల నుంచి పిల్లల్ని కొనుగోలు చేశారా? లేక అపహరించి, మధ్యవర్తుల ద్వారా విక్రయించారా? అనే అంశాలపై స్పష్టత వస్తేనే కేసు దర్యాప్తు ముందుకెళుతుందని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. దీంతో కిరణ్, ప్రీతి, కన్నయ్యల కోసం నలుగురు సిబ్బంది చొప్పున రెండు ప్రత్యేక బృందాలు ఢిల్లీ, పుణేలలో గాలిస్తున్నాయి.

పేరెంట్స్ ఎవరనేది తేలితేనే..

ఈ చిన్నారుల అసలు తల్లిదండ్రులు ఎవరనేది తేల్చడం పోలీసులకు సవాల్‌గా మారింది. పిల్లల డీఎన్‌ఏలతో తల్లిదండ్రుల డీఎన్‌ఏ నమూనాలను సరిపోల్చుతామని, ఒకవేళ పిల్లల డీఎన్‌ఏతో సరిపోలితే అసలు తల్లిదండ్రులకే అప్పగిస్తామని, ఒకవేళ తేలని పక్షంలో పిల్లల్ని తిరిగి శిశు విహార్‌కే తరలిస్తామని అధికారులు స్పష్టం చేశారు. పిల్లలపై ఇష్టం లేని తల్లిదండ్రులకు బలవంతంగా ఇచ్చేయాలా? లేక పిల్లలంటే ప్రేమ చూపే పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించాలా? అనేది తేల్చలేని పరిస్థితి నెలకొంటుందని ఓ అధికారి తెలిపారు.

త్వరలోనే పెంపుడు తల్లిదండ్రుల అరెస్టు..

పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. ఇప్పటికే పిల్లలను విక్రయించిన 11 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఇక, పిల్లలను కొనుగోలు చేసిన దంపతులపై కూడా సీఆర్‌పీసీ, జువెనైల్ జస్టిస్ (జేజే) చట్టాల కింద కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. త్వరలోనే వీరిపై సెక్షన్ 370, 372, 373 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ, 81, 87, 88 జువెనైల్ జస్టిస్ యాక్ట్‌–1985 కింద కేసులు నమోదు చేసి, అరెస్టు చేయనున్నట్లు సమాచారం.

వందల కోట్ల గోల్‌మాల్!

గొర్రెల పంపిణీ కుంభకోణంపై ఏసీబీ నిర్ధారణ

- నిందితులు రాంచందర్, కల్యాణ్‌కుమార్‌ను కస్టడీకి తీసుకుని విచారించనున్న దర్యాప్తు సంస్థ



సాక్షి, హైదరాబాద్‌: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో రూ.వందల కోట్లు గోల్‌మాల్ అయినట్టు ఏసీబీ నిర్ధారణకు వచ్చింది. ఓవైపు కీలక ఆధారాలు సేకరిస్తూ.. మరోవైపు వరుస అరెస్టులతో ఏసీబీ అధికారులు ఈ కేసులో వేగం పెంచారు. తాజాగా శుక్రవారం ఏసీబీ అధికారులు తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దగ్గర ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్‌కుమార్‌ను అరెస్టు చేయడంతో ఈ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కుంభకోణం వెనక కీలక సూత్రధారులుగా ఈ ఇద్దరు వ్యవహరించినట్టు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులు గొర్రెల పంపిణీ పథకం అమలు వ్యవహారంలోకి తేవడంలో ఈ ఇద్దరు అధికారులది ముఖ్యపాత్ర అని నిర్ధారణ అయ్యింది.

ఇంకా ఎన్ని రూ.కోట్లు మింగారో?

తొలుత రూ.2.10 కోట్ల అవినీతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏసీబీ అధికారులు.. దర్యాప్తులో ఇప్పటి వరకు లభించిన ఆధారాల ప్రకారం రూ.700 కోట్లకుపైనే అవినీతి జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దర్యాప్తు ముందుకు వెళ్లే కొద్దీ ఇంకా ఎన్ని రూ.కోట్ల అవినీతి బయటికి వస్తుందోనన్న చర్చ జరుగుతోంది. శుక్రవారం అరెస్టయిన సబావత్ రాంచందర్, కల్యాణ్‌కుమార్‌ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వీరిద్దరినీ తిరిగి పోలీసుల అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ఇద్దరు నిందితులను కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది.

ఆ ఇద్దరి వెనుక ఎవరైనా ఉన్నారా?

కల్యాణ్‌కుమార్, రాంచందర్‌లే ఈ కుంభకోణానికి పాల్పడ్డారా..? వారి వెనుక ఇంకెవరైనా కీలక వ్యక్తులు ఉన్నారా..? అన్న కోణాల్లోనూ ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు అనుమతితో ఇద్దరు నిందితులను కస్టడీకి తీసుకుని విచారిస్తే ఇంకేవైనా కొత్త పేర్లు తెరపైకి వస్తాయా..?అన్నది కొద్ది రోజుల్లో తేలనుంది.

ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త వేతనాలు

- 2017 వేతన సవరణ అమలు ప్రారంభం
- 21 శాతం ఫిట్‌మెంట్‌తో బ్యాంకు ఖాతాల్లో జమ
- రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల్లో సంబరాలు



సాక్షి, హైదరాబాద్‌: ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త వేతనాల చెల్లింపు మొదలైంది. 2017 నాటి వేతన సవరణకు సంబంధించి గత మార్చిలో ప్రభుత్వం ఫిట్‌మెంట్ ప్రకటించటంతో, ఆ మేరకు కొత్త వేతనాలను జూన్ 1న చెల్లించారు. మే నెలకు సంబంధించి వేతనాలు తాజాగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో నమోదయ్యాయి. 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకారం కొత్త వేతనాలు అందుకోవటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లోని ఆర్టీసీ ఉద్యోగుల్లో సంబరాలు నెలకొన్నాయి.

ఏడేళ్ల క్రితం నాటి వేతన పెంపుతో..

2017లో వేతన సవరణ జరగాల్సి ఉండగా, అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా లేకపోవటంతో ప్రభుత్వం ఫిట్‌మెంట్‌ను ప్రకటించలేదు. దీంతో కార్మిక సంఘాలు అప్పట్లో సమ్మెకు పిలుపునిచ్చాయి. వాటితో చర్చించేందుకు నాటి ప్రభుత్వం ఆరుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసింది. వేతన సవరణ చేయకుంటే సమ్మెను ఆపబోమని కార్మిక సంఘాలు తేల్చి చెప్పటంతో, మధ్యే మార్గంగా 16 శాతం ఇంటీరియమ్ రిలీఫ్‌కు కమిటీ ప్రతిపాదించింది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే ఫిట్‌మెంట్ ఇవ్వనున్నట్టు పేర్కొంది. దీనికి కార్మిక సంఘాలు సమ్మతించి సమ్మెను విరమించాయి. అప్పటినుంచి ఐఆర్‌ే కొనసాగుతూ వచ్చింది. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి మార్చిలో 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించింది. ఇక అప్పటివరకు ఉన్న 82.6 శాతం కరువు భత్యంలోంచి, 2017 వేతన సవరణ గడువు నాటికి ఉన్న 31.1 శాతాన్ని ఉద్యోగుల మూలవేతనంలో చేర్చారు. మిగిలిన కరువు భత్యాన్ని 43.2 శాతానికి న్యూట్రలైజ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమంగా ఆర్టీసీ ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏను తగ్గించారు. మొత్తంగా కాస్త సంతృప్తికరంగానే ఉద్యోగుల వేతనాలు పెరిగాయి. ఏడేళ్ల క్రితం నాటి వేతన పెంపు అమలులోకి రావటంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు మాత్రం ఉద్యోగ విరమణ సమయంలో చెల్లిస్తామనటంతో కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రూ. 360 కోట్ల భారం

ఈ వేతన సవరణతో ఆర్టీసీపై సాలీనా రూ.360 కోట్ల భారం పడనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవటంతో, రోజువారీ ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు సంస్థ ప్రత్యేక కసరత్తు నిర్వహిస్తోంది. ఇది కొంతవరకు సత్ఫలితాలనిస్తోంది.

యాదాద్రి పవర్ ప్లాంట్‌పై 3 నెలల్లో నివేదిక

విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి



మిర్యాలగూడ: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు టెండర్లు పిలవకుండా బీహెచ్‌ఈఎల్ కంపెనీకి అప్పగించడంతోపాటు ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పంద విషయాలపై విచారణ చేపట్టి 3 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని పవర్ ప్లాంట్ విచారణ కమిటీ చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో నిర్మిస్తున్న 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌ను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు జరిగినట్లయితే నివేదికలో పొందుపరుస్తామన్నారు. పనుల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకున్న వారికి నోటీసులు ఇచ్చామని, వారి నుంచి వివరణ తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే ఎన్‌జీవోలు, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించామని వివరించారు. భద్రాద్రి సూపర్ క్రిటికల్ ప్లాంట్‌కు బదులు క్రిటికల్ ప్లాంట్‌గా మార్చేందుకు గత ప్రభుత్వం చూపిన సాంకేతిక కారణాలపై విచారణ చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్‌నుంచి విద్యుత్ కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన అభియోగంపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఆయన వెంట ప్లాంట్ సీఈ సమ్మయ్య, విజిలెన్స్ డీఎస్పీ రవీందర్ ఉన్నారు.


ప్రాణం తీసిన ఒక్క రూపాయి

- రూ.59 బిర్యానీకి రూ.60 చెల్లించిన ఆటోడ్రైవర్
- రూపాయి ఎక్కువ ఇచ్చే మగాడివా.. అంటూ హేళన చేసిన స్నేహితుడు
- ఇద్దరి మధ్య ఘర్షణలో ప్రాణం కోల్పోయిన ఆటో డ్రైవర్
- వరంగల్‌లో ఘటన



ప్రేమ్‌సాగర్ (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్‌లో దారుణం జరిగింది. 'ఆఫ్ట్రాల్ నువ్వు ఒక ఆటోడ్రైవర్‌వు. ఒక్క రూపాయి ఎక్కువ కొట్టే మొగోడివా'..? అంటూ ఇద్దరి మధ్య జరిగిన చిన్న ఘర్షణ చివరికి ఒకరి ప్రాణం తీసింది. శనివారం వరంగల్ క్రిస్టియన్ కాలనీ గాంధీనగర్‌లో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ మిల్స్‌కాలనీ గరీబ్‌నగర్ గొర్రెకుంటకు చెందిన ఇసంపెల్లి ప్రేమ్‌సాగర్ (38) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రేమ్‌సాగర్ గాంధీనగర్‌లోని 'నబీ రూ.59కే చికెన్ బిర్యానీ'సెంటర్‌కు వెళ్లాడు. ఆదే సమయంలో గాంధీనగర్‌కు చెందిన జన్ను అరవింద్ అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరు స్నేహితులే. ఈ క్రమంలో ప్రేమ్‌సాగర్ బిర్యానీ తీసుకుని రూ.59కి బదులు రూ.60 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. పక్కనే ఉన్న అరవింద్ దీనిపై స్పందించి.. 'ఒక్క రూపాయి ఎక్కువ కొట్టే మొగోడివి అయ్యావా'అంటూ ప్రేమ్‌సాగర్‌ను హేళన చేస్తూ మాట్లాడాడు. దీంతో ప్రేమ్‌సాగర్ ఒక్కసారిగా ఆవేశానికి లోనై 'నేను ఏమైనా అడుక్కు తింటున్నానా.. ఏం మాట్లాడుతున్నావు'అంటూ అరవింద్‌ను నిలదీశాడు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. తోపులాటలో అరవింద్, బలంగా ప్రేమ్‌సాగర్‌ను నెట్టివేయగా రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు బలమైన గాయమై చిన్నమెదడు చిట్లి ముక్కు, చెవుల్లోనుంచి రక్తస్రావం కావడంతో స్పృహ కోల్పోయాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ప్రేమ్‌సాగర్ తమ్ముడు విద్యాసాగర్‌తోపాటు అరవింద్ కలసి ఆటోలో ప్రేమ్‌సాగర్‌ను ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 1 గంట సమయంలో ప్రేమ్‌సాగర్ మృతిచెందాడు. వెంటనే అరవింద్ ఎంజీఎం నుంచి నేరుగా మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు లొంగిపోయాడు. మృతుడి సోదరుడు విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు శనివారం అరవింద్‌పై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.



తెలంగాణలో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో 2014–15లో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న పంటల సాగువిస్తీర్ణం 2022–23 నాటికి 2.38 కోట్ల ఎకరాలకు పెరిగింది. అంటే పదేళ్ల కాలంలో కోటి ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. సాగు విస్తీర్ణం పెరగడంతో పంట ఉత్పత్తి కూడా అదే స్థాయిలో 1.50 కోట్ల టన్నుల నుంచి 3.62 కోట్ల టన్నులకు పెరిగింది. అంటే పంట ఉత్పత్తి 2014తో పోల్చితే ఏకంగా 137 శాతం పెరగడం గమనార్హం. వరిసాగులో దేశంలో అగ్రగామిగా నిలిచింది. 2014–15లో 35 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు కాగా, 2022–23లో ఇది ఏకంగా 121 లక్షల ఎకరాలకు పెరిగింది. అంటే తొమ్మిదేళ్ల కాలంలో 86 లక్షల ఎకరాల్లో వరి సాగు పెంపు కారణంగా, ధాన్యం ఉత్పత్తి కూడా భారీగా పెరిగింది. 2014–15లో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 2022–23 నాటికి ఇది 2.60 కోట్ల టన్నులకు పెరిగింది. - సాక్షి, హైదరాబాద్

1.31 కోట్ల ఎకరాల నుంచి 2.38 కోట్ల ఎకరాలకు

పెరిగిన సాగు విస్తీర్ణం


ధాన్యం ఉత్పత్తి కూడా 68 లక్షల టన్నుల నుంచి 2.30 కోట్ల టన్నులకు...

అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున రైతులకు

రూ.75 వేల కోట్లు రైతుబంధు కింద జమ

అందించారు. ఈ పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలోనే జమ చేశారు. ప్రతి సీజన్‌లో సుమారు 65 లక్షల మందికి రూ.7,500 కోట్ల వరకు అందించేవారు. ఈ విధంగా ఇప్పటివరకు మొత్తం రూ. 75 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చింది.


- కేసీఆర్ రైతుబీమా పథకాన్ని తీసుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వివిధ కారణాలతో మరణించిన సుమారు 1.15 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ. 5,566 కోట్ల పరిహారాన్ని అందించింది.





లక్ష రుణమాఫీ

అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులకు రుణ విముక్తి చేయడమే లక్ష్యంగా గత ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. ఇందులో భాగంగానే తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. లక్ష వరకు రుణమాఫీ చేసిన కేసీఆర్ సర్కారు.. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రూ.లక్ష మాఫీకి హామీ ఇచ్చింది. ఇందులో 2014లో తొలిసారి 35.31 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ. 16,144 కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఇక రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 23 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.13 వేల కోట్ల రుణాలను మాఫీ చేయగా, మరో రూ. 6 వేల కోట్ల రుణాల మాఫీ పెండింగ్‌లో ఉంది. ఎన్నికల కోడ్ రావడంతో అడ్డంకి ఏర్పడింది. ఇప్పుడు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం దాదాపు రూ. 35 వేల కోట్లు అవసరమవుతాయని అంటున్నారు.



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన తర్వాత వైద్య రంగంలో వచ్చిన మార్పు జిల్లాకో మెడికల్ కాలేజీ సాధనే అని చెప్పవచ్చు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 5 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. ఇందులో ఉన్న ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 700. ఉస్మానియా, గాంధీ, వరంగల్ (కాకతీయ), ఆదిలాబాద్ (రిమ్స్) కాలేజీలు ఉండేవి. ఈ నేపథ్యంలో పేదలకు స్పెషాలిటీ సేవలు అందించడంతోపాటు, డాక్టర్ కావాలనుకునే విద్యార్థుల కలను సాకారం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా 2016లో 4 మెడికల్ కాలేజీలు సిద్దిపేట, మహబూబ్ నగర్, నల్లగొండ, సూర్యాపేటలో ప్రారంభించారు. దీంతో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1640కి పెరిగింది. 2021లో సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, జగిత్యాల, వనపర్తి, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, రామగుండంలలో 8 మెడికల్ కాలేజీలు ప్రారంభం అయ్యాయి. నాటి సీఎం కేసీఆర్ వీటిని స్వయంగా ప్రారంభించి, ఒకేరోజు తరగతులు ప్రారంభించి రికార్డు సృష్టించారు. దీంతో రాష్ట్రంలో మరో 1200 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. 2022లో నిర్మల్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, సిరిసిల్ల, వికారాబాద్‌ల్లో మరో 9 మెడికల్ కాలేజీలు ప్రారంభం అయ్యాయి. దీంతో రాష్ట్రంలో మెడికల్ కాలేజీల సంఖ్య 26కు పెరిగింది. చివరి దశగా గతేడాది మరో 8 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా... ఈ ఏడాది ఎన్ఎంసీ తనిఖీ ప్రక్రియ జరుగుతోంది. వీటికి కూడా అనుమతులు వస్తే జిల్లాకో మెడికల్ కాలేజీ పూర్తి కానున్నది. ఇక వీటికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు కానున్నాయి.

గుండెపోట్ల చికిత్సకు 'స్టెమీ'

గుండెపోట్లను వెంటనే గుర్తించి చికిత్స అందించేందుకు స్టెమీ కార్యక్రమం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం, రిమ్స్ ఆదిలాబాద్, ఖమ్మంలో క్యాథ్‌ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు.

టీ డయాగ్నొస్టిక్స్

వ్యాధుల నిర్ధారణలో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు టీ డయాగ్నొస్టిక్స్‌ను ప్రారంభించింది. ఇందులో 135 రకాల రోగనిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తారు. ఆటో అనలైజర్‌లు, డిజిటల్ ఎక్స్‌-రేలు, అల్ట్రాసౌండ్ స్కాన్ మెషీన్‌లు, 2-డి ఎకో, మామ్మోగామ్, హై ఎండ్ డయాగ్నొస్టిక్ పరికరాలు ఈ హబ్‌లో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో పీహెచ్‌సీలు మొదలు అన్ని స్థాయిల దవాఖానాలను టీ డయాగ్నొస్టిక్స్‌కు అనుసంధానం చేసింది. దీంతో పేదలు అటు చికిత్సకు, ఇటు వ్యాధి నిర్ధారణకు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా పోయింది.

గర్భిణులకు చేయూత...

2017లో ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్‌తో బహుళ ప్రయోజనాలు కనిపించాయి. ప్రభుత్వ దవాఖానాల్లో పరీక్షలు, ప్రసవం చేయించుకునే మహిళలకు మూడు విడతలుగా మొత్తం రూ.12 వేలు, ఆడపిల్లల జన్మిస్తే మరో రూ.వెయ్యి అదనంగా నగదును అందించింది. అదనంగా తల్లీబిడ్డకు అవసరమయ్యే వస్తువులతో కూడిన రూ. 2 వేల కిట్‌ను అందించింది. గతేడాది చివరినాటికి దాదాపు 14 లక్షల మంది ఈ పథకంతో లబ్ధి పొందారు. అలాగే గర్భిణుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలను నియంత్రించేందుకు న్యూట్రిషన్ కిట్ల పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసింది.

గత ప్రభుత్వం ఏరియా, జిల్లా, సూపర్ స్పెషాలిటీ దవాఖానాలను బలోపేతం చేసింది. ముఖ్యంగా కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రతి జిల్లా కేంద్రంలోనూ జిల్లా దవాఖాన మంజూరైంది. దీంతో ప్రజలకు సమీపంలోనే స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలోని 27,500 పడకలకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించే కార్యక్రమం గతేడాది పూర్తయింది. సూపర్ స్పెషాలిటీ వసతుల మెరుగు కోసం హైదరాబాద్ నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) పేరుతో 26 ఏప్రిల్ 2022న అల్వాల్, గడ్డి అన్నారం, ఎర్రగడ్డ ప్రాంతాల్లో టిమ్స్ నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్ భూమి పూజ చేశారు. ఇవి ఎయిమ్స్ మాదిరి స్వయం ప్రతిపత్తి గల వైద్య విజ్ఞాన సంస్థలుగా సేవలందించనున్నాయి. అల్వాల్‌లో 28.41 ఎకరాల్లో రూ.897 కోట్ల ఖర్చుతో, గడ్డి అన్నారంలో 21.36 ఎకరాల్లో రూ.900 కోట్ల ఖర్చుతో, ఎర్రగడ్డలో రూ.882 కోట్ల ఖర్చుతో పనులు ప్రారంభం అయ్యాయి. అదనంగా నిమ్స్‌లో 2000 సూపర్ స్పెషాలిటీ పడకల పనులు ప్రారంభం అయ్యాయి. వరంగల్‌లో 24 అంతస్తులతో హెల్త్ సిటీ నిర్మాణం తుది దశలో ఉంది. రూ.1200 కోట్ల వ్యయంతో 2021 జూన్‌లో 59 ఎకరాల్లో పనులు మొదలయ్యాయి. ఇక్కడ 34 విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తారు. ఇవన్నీ పూర్తయితే 8,200 సూపర్ స్పెషాలిటీ పడకలు అందుబాటులోకి వస్తాయి.

వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించిన గణాంకాలు (రూ. కోట్లలో)

విషయం	2014-15	2024-25
ప్రారంభ నిల్వ	2,544	758.56
రెవెన్యూ ఆదాయం	80,090	2,05,601
అప్పులు	15,713	59,625
రెవెన్యూ ఖర్చు	79,789	2,01,177
మూలధన వ్యయం	15,101	29,669
వ్యవసాయం	9,529	19,746
సాగునీరు	6,500	28,024
విద్యుత్	4,626	16,825
సంక్షేమం	23,104	45,419
విద్య	10,200	21,389
వైద్యం	3,539	11,500
ఎక్సైజ్ ఆదాయం	2,823	25,617
రిజిస్ట్రేషన్ల ఫీజు	2,583	18,228
అమ్మకపు పన్ను	26,963	50,762 (జీఎస్టీ)
కేంద్ర పన్నుల్లో వాటా	9,749	25,639
మొత్తం బడ్జెట్ ప్రతిపాదన	1,00,637	2,75,891

ఐటీలో మేటి..

ఎగుమతులు రూ. 11,185 లక్షల కోట్లు.. 54.47 లక్షల ఉద్యోగాలు!

పదేళ్లలో రాష్ట్రం నుంచి భారీగా ఐటీ ఉత్పత్తుల ఎగుమతులు

సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో శరవేగంగా దూసుకుపోతోంది. ఐటీ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏటా కొత్త రికార్డులు సృష్టిస్తూ ముందుకు సాగుతోంది. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది రూ.57,258 కోట్లతో మొదలైన ఎగుమతులు.. 2023 నాటికి రూ.2.41 లక్షల కోట్లకు ఎగబాకాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 30 ఏళ్లలో నమోదైన ఐటీ ఎగుమతుల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. 2022–23లో దేశంలో ఐటీ ఎగుమతులు 9.36 శాతం వృద్ధి చెందగా. అదే ఏడాది తెలంగాణలో 31.44 శాతం పెరిగాయి. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్ల కాలంలో (2014–23) రూ.11.85 లక్షల కోట్ల ఎగుమతులు సాధించగా.. 54.47 లక్షల ఉద్యోగ అవకాశాలు లభించాయి.

5,82,319 మందికి ఉద్యోగ అవకాశాలు పెరిగాయి..: తెలంగాణ ఏర్పడకముందు దేశవ్యాప్తంగా ఐటీలో 32.90 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉండగా.. ఇందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాటా 9.83 శాతం. అంటే 3,23,396 ఉద్యోగులున్నారు. గత తొమ్మిదేళ్లలో దేశవ్యాప్తంగా కొత్తగా 21.10 లక్షల మంది ఉద్యోగులు చేరగా.. రాష్ట్రంలోనే కొత్తగా 5,82,319 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

బ్రాండ్ హైదరాబాద్! ఐటీ రంగంలో హైదరాబాద్, బెంగళూరులో ఒకదానితో ఒకటి పోటీపడుతుంటాయి. గతేడాది ఉద్యోగ కల్పనలో భాగ్యనగరం గార్డెన్ సిటీ బెంగళూరుని దాటేసింది. కొత్తగా దేశంలో 4.50 లక్షల ఉద్యోగాలు రాగా.. హైదరాబాద్‌లో 1.50 లక్షల ఉద్యోగ అవకాశాలు లభించాయి. అదే బెంగళూరులో 1.46 లక్షల జాబ్స్ సృష్టించినట్లు నాస్కామ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఆఫీసు స్పేస్ వినియోగంలోనూ హైదరాబాద్ 2022 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్యకాలంలో బెంగళూరును అధిగమించి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రపంచంలోనే ఐటీ దిగ్గజ కంపెనీలైన యాపిల్, గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ కంపెనీలు తమ ప్రధాన కార్యాలయాలు హైదరాబాద్‌లో నెలకొల్పాయి. ఇక వీఎఫ్ఎక్స్, గేమింగ్, యానిమేషన్ రంగాలకు హైదరాబాద్ చిరునామాగా మారింది. ఐటీ రంగంలో కొత్తగా వస్తున్న కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, డ్రోన్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం అనేక నూతన పాలసీలకు రూపకల్పన చేసింది. ఐటీ రంగంలో ఆవిష్కరణలు, వాణిజ్యం ప్రోత్సహించే లక్ష్యంతో 2015లో ఏర్పాటు చేసిన ఐటీ హబ్ విజయం సాధించడంతో, మహిళల కోసం ప్రత్యేకంగా 'వి హబ్'ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేసింది.



ద్వితీయ శ్రేణి పట్టణాలకూ ఐటీ.. జిల్లాల్లో ఐటీ టవర్లు

రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి హైదరాబాద్ పశ్చిమ ప్రాంతానికే పరిమితం కావడంతో నగరంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించేలా గ్రిడ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఈ పాలసీతో ఉప్పల్, పోచారం, కండ్లకోయ, శంషాబాద్ ప్రాంతాల్లోనూ కొత్త ఐటీ టవర్లు కార్యకలాపాలు ప్రారంభించాయి. మరోవైపు ద్వితీయ శ్రేణి పట్టణాలు, గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంగా గత ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లోనే ఐటీ టవర్లను నిర్మించింది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, సిద్దిపేట, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఐటీ టవర్లలో పదుల సంఖ్యలో ఐటీ సంస్థలు, స్టార్టప్‌లు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. 2019లో వరంగల్‌లో తొలి ఐటీ టవర్ ప్రారంభం కాగా.. ఇందులోని టెక్ మహీంద్రా, సైయంట్, క్వాడ్రంట్ వంటి 10 కంపెనీల్లో 2,500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీ రంగం పురోగతి, ప్రోత్సాహానికి సంబంధించి ఇప్పటివరకు నిర్దిష్ట ప్రణాళికలేవీ ప్రకటించలేదు. రాష్ట్రంలో ఐటీ రంగం వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి విధానాలను ప్రకటిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

తెలంగాణ ఐటీ గణాంకాలు

సంవత్సరం	ఎగుమతులు (రూ.కోట్లలో)	ఉద్యోగుల సంఖ్య	వృద్ధి (శాతంలో)
2013-14	57,258	3,23,396	-
2014-15	66,276	3,71,774	15.74
2015-16	75,070	4,07,385	13.26
2016-17	85,470	4,31,891	13.85
2017-18	93,442	4,75,308	9.32
2018-19	1,09,219	5,43,033	16.89
2019-20	1,28,807	5,82,126	17.93
2020-21	1,45,522	6,28,615	12.98
2021-22	1,83,569	7,78,121	26.14
2022-23	2,41,275	9,05,715	31.44

బడ్జెట్

రూ.లక్ష కోట్ల నుంచి రూ.2.75 లక్షల కోట్లకు

గణనీయంగా మారిన ఆర్థిక గణాంకాలు



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల క్రితం ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి మిగులు బడ్జెట్‌తో విడిపోయింది. 2014–15 ఆర్థిక సంవత్సరానికి గాను అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్ర ఖజానా ప్రారంభ నిల్వ రూ.2,544 కోట్లుగా చూపెట్టారు. ఆ ఏడాది అసెంబ్లీ అనుమతి పొందిన మొత్తం బడ్జెట్ రూ.1.06 లక్షల కోట్లు. లక్ష కోట్ల నుంచి అంచెలంచెలుగా పెరిగిన తెలంగాణ బడ్జెట్ పరిమాణం ఇప్పుడు రూ.2.75 లక్షల కోట్లకు చేరుకుంది. అంటే బడ్జెట్ ప్రతిపాదనలు దాదాపుగా మూడు రెట్లు పెరిగాయన్న మాట. ప్రతిపాదనల మాట అటుంచితే బడ్జెట్ ఖర్చులో కూడా ఏటేటా పెరుగుదల కనిపిస్తోంది. 2014–15 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ ఖర్చు రూ.62,306 కోట్లు కాగా, ఆ తర్వాత వరుసగా రూ.97,922 కోట్లు, రూ.1.33 లక్షల కోట్లు.. ఇలా పెరుగుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2.01 లక్షల కోట్లకు చేరింది.

సొంత పన్ను ఆదాయమే కీలకం..

ఏ రాష్ట్రమైనా ఆర్థిక వనరులు సమకూర్చుకోవడంలో, ముఖ్యంగా రాష్ట్ర సొంత ఆదాయాన్ని (ఎస్ఓటీ) పెంచుకోవడంలో సఫలీకృతమైతే ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నట్టే. ఈ కోణంలో పదేళ్ల తెలంగాణ రాష్ట్రం సుస్థిరతను సాధించిందని, సొంత పన్నుల ఆదాయం భారీగా పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రం ఏర్పడిన రోజు 2014–15 ఆర్థిక సంవత్సరంలో రూ.50 వేల కోట్ల వరకు ఉన్న సొంత పన్నుల ఆదాయం ఇప్పుడు 2024–25 ఆర్థిక సంవత్సర ప్రతిపాదనల్లో లక్ష కోట్లు దాటింది.

> 2014–15లో రెవెన్యూ ఖర్చు రూ.62,306 కోట్లు..
> 2024–25లో రూ.2.01 లక్షల కోట్లు
>
> రూ.50 వేల కోట్ల నుంచి లక్ష కోట్లు దాటిన సొంత పన్నుల ఆదాయం
>
> అప్పుడు రూ.72,658 కోట్ల అప్పులు.. ఇప్పుడు రూ.5 లక్షల కోట్లకు పైనే..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆర్థిక రంగంలోని కీలక సూచికల్లో వచ్చిన మార్పులు (శాతాల్లో)

సూచిక	2014-15	2023-24
జీఎస్‌డీపీ	6.8	6.5
దేశ ఆర్థిక వ్యవస్థలో వాటా	4	4.9
జాతీయంతో పోలిస్తే తలసరి ఆదాయం	143.2	189.5
రిటైల్ ద్రవ్యోల్బణం	4.77	6.4
అన్ని రాబడుల్లో సొంత ఆదాయం	57.4	66.3
బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం	81.4	79.8
మూలధన వ్యయం	13.4	11.4
జీఎస్‌డీపీలో అప్పులు	16.1	23.8

అప్పుల కుప్పలే

పదేళ్లలో తెలంగాణ అప్పుల మూటను కూడగట్టుకుంది. రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి రూ.72,658 కోట్ల అప్పులుండగా.. ఇప్పుడు బడ్జెట్ లెక్కల ప్రకారం రూ.5 లక్షల కోట్లు దాటాయి. నికర అప్పు, పూచీకత్తులతో కలిపితే రూ.7 లక్షల కోట్లు దాటుతోంది. తలసరి ఆదాయంలో గణనీయ వృద్ధి సాధించిన రాష్ట్రం, తలసరి అప్పులోనూ అదే స్థాయిలో వృద్ధి సాధించడం గమనార్హం. అప్పులకు వడ్డీల చెల్లింపులకే రూ.22 వేల కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించాల్సి వస్తోంది. 2036 కల్లా కాళేశ్వరం ప్రాజెక్టుకు చేసిన ఖర్చు రూ.86 వేల కోట్లు, వడ్డీ రూ.54 వేల కోట్లు కలిపి రూ.1.40 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఒక్క ప్రాజెక్టు కోసమే ఏటా రూ.12 వేల కోట్లు చెల్లించాల్సి వస్తుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. అయితే గోదావరి జలాలను ఎత్తిపోయడం ద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టు కోసం పదేళ్లలో రూ.84 వేల కోట్లు ఖర్చు చేయగలగడం, రైతుబంధు లాంటి పథకాలను ప్రవేశపెట్టి సజావుగా అమలు చేస్తుండడం తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సాధించిన విజయాలుగానే చెప్పుకోవాలి. కానీ అప్పులు పెరిగినా ఆస్తుల కల్పన ఆశించిన స్థాయిలో జరగలేదనే అపవాదు కూడా తెలంగాణకు ఉంది. 2014–15లో ఆస్తుల కల్పన కింద చేయాల్సిన మూలధన వ్యయం రూ.15వేల కోట్లు దాటితే, 2024–25లో అది రూ.29,669 కోట్లకు మాత్రమే చేరింది. ఇవి కేవలం ప్రతిపాదనలే కాగా, ఖర్చు అంతకంటే తక్కువే ఉండడం గమనార్హం.

పటిష్టంగా పోలీస్

షీ టీమ్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, యాంటీ నార్కొటిక్స్ వంటి కీలక విభాగాల ఏర్పాటు

సాంకేతికతలోనూ ముందంజ

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో తెలంగాణ పోలీస్‌శాఖ పటిష్టమైంది. వేల సంఖ్యలో నూతన సిబ్బంది నియామకంతోపాటు సరికొత్త టెక్నాలజీ వినియోగంలోనూ రాష్ట్ర పోలీసులు ప్రగతి సాధించారు. మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ మహిళా భద్రత విభాగం, షీటీమ్స్ ఏర్పాటు సహా అనేక మార్పులు వచ్చాయి. అదేవిధంగా ప్రస్తుతం పెరుగుతున్న నేరాల్లో ఒకటైన సైబర్‌నేర దర్యాప్తు, డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటయ్యాయి. హైదరాబాద్‌లో నెలకొల్పిన కమాండ్ కంట్రోల్ సెంటర్ తెలంగాణ పోలీస్ ప్రతిష్టను మరింత పెంచింది.


కొత్త పోలీస్ కార్యాలయాలు...

రాష్ట్రంలో ఏడు నూతన పోలీస్ కమిషనరేట్లు, 10 కొత్త పోలీస్ జిల్లాలు, 112 కొత్త పోలీస్ స్టేషన్లు, 31 సర్కిల్ కార్యాలయాలు, 25 సబ్ డివిజన్‌కార్యాలయాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 11.10 లక్షలకు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. చరిత్రలోనే తొలిసారిగా హైదరాబాద్ నగరం గత పదేళ్లలో మతకల్లోలాలు లేకుండా ప్రశాంతంగా ఉంది.

కొత్త కొలువుల జాతర

పోలీస్‌శాఖను బలోపేతం చేసేలా ఇప్పటికే 27 వేల మంది నూతన సిబ్బంది నియామకం పూర్తి చేశారు. ఇటీవల నోటిఫికేషన్‌లో భర్తీ అయిన 414 సివిల్ ఎస్సైలు సహా మరో 16456 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయి, శిక్షణ కొనసాగుతోంది. నియామకాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేస్తుండడంతో మహిళా పోలీసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పోలీస్ సంక్షేమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులకు 30 శాతం రిస్క్ అలవెన్స్ వస్తోంది.

- తెలంగాణ ఏర్పడక ముందు నెలకు రూ.12 వేలు ఉన్న హోంగార్డులకు జీతాలు ఇప్పుడు రూ. 20 వేలకు పెంపు, ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18,491 మంది హోంగార్డుల కుటుంబాలకు లబ్ధి చేకూరింది. అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లో రూ.600 కోట్లతో మొత్తం 19 అంతస్తుల్లో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్మించారు. 2022 ఆగస్టు 4 నుంచి ఈ భవనం అందుబాటులోకి వచ్చింది.



టెక్నాలజీ వినియోగం..

పోలీసుల రోజువారీ విధుల్లో టెక్నాలజీ వాడకం పెరిగింది. 56 రకాల సర్వీసులతో రాష్ట్రస్థాయిలో టీఎస్‌కాప్ యాప్‌ను తెచ్చింది.

ఉమెన్‌సేఫ్టీ వింగ్ ఏర్పాటు

మహిళా భద్రత కోసం తొలుత 2014 అక్టోబర్ 24న షీటీమ్స్ ఏర్పాటు చేశారు. తర్వాత మహిళా భద్రత కోసం రాష్ట్ర స్థాయిలో ఉమెన్‌సేఫ్టీ వింగ్ ఏర్పాటు చేశారు. డ్రగ్స్ , ఇతర మత్తు పదార్థాల కట్టడికి తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో, సైబర్‌నేరాల నియంత్రణకు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలను ఏర్పాటు చేశారు. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసు శాఖ విమర్శలను ఎదుర్కొంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.